అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 18-03-2025

సంపుటి : 11 | సంచిక : 76 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ప్రధానితో తులసీ గబ్బర్డ్ భేటీ



రాజ్‌నాథ్ సింగ్‌తోనూ..

రక్షణ, సమాచార భాగస్వామ్య రంగాల్లో బలోపేతంపై చర్చ

న్యూఢిల్లీ : అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్ సోమవారం ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. అంతకు ముందు రక్షణమంత్రితో జరిగిన సమావేశంలో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను ...5లో

ఎగవేతల భారతం

పదేండ్లలో రూ.16 లక్షల కోట్లకు పైనే మొండి బాకీల రద్దు

సగం పైగా బడా పారిశ్రామికవేత్తలవే

29 కంపెనీలు.. రూ.61వేల కోట్ల ఎగవేత : మంత్రి సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ : దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోడీ హయాంలో బ్యాంకుల్లో మొండి బాకీల రద్దు పెరిగిపోయింది. మొత్తం పారు బకాయిల్లో బడా పరిశ్రమలు, సర్వీసు రంగాలకు చెందినవే సగానికి పైగా ఉన్నాయి. సామాన్యుడు లేదా ఓ రైతు బతుకుదెరువు కోసం రూ.లక్ష అప్పు చేసి చెల్లించకుంటేనే ముప్పు తిప్పలు పెట్టే బ్యాంకులు.. పదేండ్లలో రూ.9 లక్షల కోట్లపైగా కార్పొరేట్ల అప్పులను రద్దు చేశాయి. ఇదే విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంట్‌కు వెల్లడించారు. గడిచిన పది ఆర్థిక సంవత్సరాల్లో మొత్తంగా దాదాపు రూ. 16.35 లక్షల కోట్ల విలువైన మొండి బాకీలు (ఎన్‌పీఏ)లను బ్యాంకులు రద్దు చేశాయని మంత్రి సీతారామన్ తెలిపారు. ముఖ్యంగా 2018-19లో అత్యధికంగా రూ.2,36,265 కోట్ల పారు బకాయిలను మాఫీ చేశాయి. 2014-15లో కనిష్ఠంగా రూ.58,786 కోట్ల ఎన్‌పీఏలను రద్దు చేయగా.. 2023-24లో బ్యాంకులు రూ.1,70,270 కోట్ల బకాయిలను రద్దు చేశాయి. 2024 డిసెంబర్ 31 నాటికి వాణిజ్య బ్యాంకులు 29 కంపెనీలను ఎన్‌పీఏలుగా గుర్తించాయని మంత్రి తెలిపారు. వాటిలో ప్రతి ఒక్కటి రూ.1,000 కోట్లకుపైగా బకాయిలు కలిగి ఉన్నాయని వెల్లడించారు. వీటి మొత్తం విలువ రూ.61,027 కోట్ల పైనేనని పేర్కొన్నారు. గత పదేండ్లలో మొత్తంగా రూ.16.35 లక్షల కోట్ల మొండి బాకీలను రద్దు చేయగా.. అందులో రూ.9,26,947 లక్షల కోట్లు బడా పారిశ్రామికవేత్తలు, సర్వీసు సెక్టార్ రంగాలకు చెందినవి కావడం గమనార్హం.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాలు, బ్యాంకుల ...5లో

ఆర్థిక సంవత్సరం	రుణ మాఫీ (రూ. కోట్లల్లో)	కార్పొరేట్లకు(రూ. కోట్లల్లో)
2014-15	58,786	31,723
2015-16	70,413	40,416
2016-17	1,08,373	68,308
2017-18	1,61,328	99,132
2018-19	2,36,265	1,48,753
2019-20	2,34,170	1,59,139
2020-21	2,04,272	1,27,050
2021-22	1,75,178	69,532
2022-23	2,16,324	1,14,528
2023-24	1,70,270	68,366
మొత్తం	16,35,379	9,26,947

బీసీ బిల్లులకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం



మద్దతు తెలిపిన ప్రతిపక్షాలు

రిజర్వేషన్ల కల్పనకు అన్ని పక్షాలు మద్దతివ్వడం హర్షణీయం

పార్లమెంట్‌లో ఆమోదానికీ పార్టీలన్నీ కలిసి రావాలి

రిజర్వేషన్ల చట్టబద్ధతకు నేనే నాయకత్వం వహిస్తా

అవసరమైతే రాజ్యాంగ సవరణ కోసం కొట్లాడుదాం

ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించండి :

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

రాహుల్‌ను కలిసి విన్నవిద్దామంటూ సూచన

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని వ్యాఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను తెలంగాణ శాసనసభ ఆమోదించింది. ఇవి పార్లమెంట్‌లో చట్ట రూపం దాల్చితే విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లభించనున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసన సభ ప్రారంభం కాగానే రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లులపై చర్చను ప్రారంభిస్తూ ఏండ్లుగా బీసీలు అన్యాయానికి గురవుతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు తమ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బిల్లులను ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు మద్దతివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, బీజేపీ నుంచి పాయల్ శంకర్‌తో పాటు అధికార పక్షం నుంచి బీర్ల ఐలయ్య, వాకిటి శ్రీనివాస్, రాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'బీసీ రిజర్వేషన్ బిల్లుల చట్టబద్ధత కోసం జరిగే ఉద్యమానికి ఢిల్లీలో నేనే నాయకత్వం వహిస్తా. రాజకీయాలకతీతంగా బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పక్షాలు బీసీ బిల్లుకు శాసనసభలో సంపూర్ణ మద్దతు ప్రకటించడం హర్షణీయం...తమిళనాడు ...5లో

తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు

ఉభయ సభల్లో బిల్లు ఆమోదం

బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ మద్దతు.. వ్యతిరేకించిన బీజేపీ

చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టండి : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభలో కీలక బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చింది. దీనికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా నామకరణం చేసింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చాలంటూ ...5లో

మంత్రులను తొలగిస్తేనే పరిపాలనపై పట్టున్నట్టా...?

అన్నింటినీ సరిదిద్దుకుంటూ ముందుకెళ్లటమే నా విధానం : సీఎం

రాజీవ్ యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 5 వేల మందికి ఉపాధి 3లో..



రూ.70 వేల కోట్ల ఆదాయం తగ్గింది

అన్నీ పెరిగితే ఇదెలా?

బడ్జెట్‌కు ముందే నేరాన్ని అంగీకరించిన సీఎం రేవంత్‌రెడ్డి : మీడియాతో కేటీఆర్ చిట్ చాట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రూ.70 వేల కోట్ల ఆదాయం తగ్గిందనీ, ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బడ్జెట్ ...5లో

దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం కావాలి

సైంటిఫిక్ విధానం కనుగొనే వరకు పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలి



నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశంలో నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు క్రమంలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యంగా ఉండేలా నియోజకవర్గాల పునర్విభజన ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనపై సోమవారం అసెంబ్లీ ఆవరణలోని కమిటీ హాల్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం, సీపీఐ(ఎం), సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు. 'నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు ప్రధానంగా తెలంగాణ నష్టపోతుంది. ఈ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలి' అనే అంశంపై చర్చలు, ఆలోచనలు చేయాలని సమావేశానికి హాజరైన రాజకీయ పక్షాలను డిప్యూటీ సీఎం కోరారు. మన గౌరవం, ప్రాధాన్యత కాపాడుకుంటూ భారతదేశంలో మనందరి పాత్ర ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరిక మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ నేతలను సైతం ఆహ్వానించినప్పటికీ వారు ప్రత్యేక రాజకీయ కారణాలతో హాజరు కాలేమని తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పార్లమెంటు సమావేశంలో బిజీగా ఉండడం, ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వారు హాజరు కాలేదని ఆయన వివరించారు. సమావేశానికి హాజరైన నేతలంతా ఇచ్చిన సమాచారం మేరకు భవిష్యత్తులో ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ప్రణాళిక తయారు చేసుకొనే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాసనసభలో చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో ఆందోళనకు దారి ...5లో



డూప్లికేట్ ఓటరు ఐడీలపై చర్చకు నో

అనుమతి నిరాకరించిన డిప్యూటీ చైర్మెన్

రాజ్యసభ నుంచి ప్రతిపక్ష సభ్యులు వాకౌట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బహుళ నకిలీ ఓటరు ఐడీ కార్డులు జారీ చేయడంలోనూ, డీలిమిటేషన్‌లోనూ కేంద్ర ఎన్నికల కమిషన్ లోపాలపై చర్చకు రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ సింగ్ అనుమతి నిరాకరించారు. దీంతో ప్రతిపక్షాలు సభను వాకౌట్ చేసి తమ నిరసన తెలియజేశాయి. సోమవారం రాజ్యసభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు సహా ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. ప్రతిపక్ష ఎంపీలు 267వ నిబంధన కింద నోటీసులు ఇచ్చారు. తాము లేవనెత్తిన అంశంపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే ...13లో




13లో..

వారంతా మూర్ఖులు

దేశ సంపదను విదేశాలకు దోచిపెట్టారు

మాజీ అధ్యక్షులపై ట్రంప్ మండిపాటు



13లో..

అదానీలకు ఊరట

మార్కెట్ నిబంధనల ఉల్లంఘనల కేసు నుంచి బాంబే హైకోర్టు విముక్తి



(ఫైల్)

అమెరికాలో రోడ్డు ప్రమాదం


13లో..

ముగ్గురు రంగారెడ్డి జిల్లా వాసులు మృతి

ముడి చమురు ధరలు తగ్గినా బాదుడే



దిగిరాని పెట్రోల్, డీజిల్ ధరలు



న్యూఢిల్లీ : దేశంలో ముడి చమురు ధరలు బాగా తగ్గుతున్నాయి. బ్యారల్ ముడి చమురు సగటు దిగుమతి ధర 42 నెలల కనిష్ట స్థాయి 71.20 డాలర్లకు పడిపోయింది. అయినప్పటికీ వినియోగదారులకు ఒరిగిందేమీ లేదు. వారు ఇప్పటికీ పెట్రోల్, డీజిల్‌ను ఎక్కువ రేటుకే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రపంచ ఆర్థికాభివృద్ధి మందగించడం, అమెరికా కాల్పుల విరమణ యత్నాలు, అమెరికా చమురు కోసం ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల కారణంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. 2021 ఆగస్టులో చివరిసారిగా ముడి చమురు నెలవారీ దిగుమతి సగటు ధర బ్యారల్‌కు 70 డాలర్ల కంటే తక్కువకు పడిపోయింది.

ధరలు ఇలా...

అప్పటి నుంచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణహోమం వంటి పరిణామాల కారణంగా నెలవారీ సగటు ధర పెరుగుతూ వస్తోంది. మన ప్రస్తుత వార్షిక ముడి చమురు దిగుమతి ధర 2020-21 తర్వాత ఇంతగా తగ్గడం కూడా ఇదే ప్రథమం. 2020-21లో బ్యారల్ సగటు ధర 44.82 డాలర్లు ఉండగా 2021-22లో 79.18 డాలర్లు, 2022-23లో 93.15 డాలర్లు, 2023-24లో 82.58 డాలర్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 15వ తేదీ వరకూ బ్యారల్ సగటు ధర 78.49 డాలర్లుగా ఉంది. 2000 జూన్‌లో బ్యారల్ చమురు ధర 116.01 డాలర్లకు చేరినప్పటికీ ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది.

నిపుణుల అంచనాలు

మన దేశంలో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ముడి చమురు ధరలకు అనుగుణంగా లేవని పరిశ్రమ నిపుణులు తెలిపారు. ప్రయివేటు రిఫైనరీలు ఈ రెండు ఆటోమొబైల్ ఇంధనాలపై లీటరుకు రూ.10-12 మార్జిన్ పొందుతున్నాయి. రాబోయే నెలల్లో కూడా అంతర్జాతీయ చమురు ధరలు తక్కువగానే ఉండవచ్చునని నిపుణుల అంచనా. కాగా చైనాలో ఆర్థిక వృద్ధి మందగించడం, మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ, ఉక్రెయిన్ ఘర్షణకు పరిష్కారం లభించే అవకాశాలు, అమెరికాలో చమురు ఉత్పత్తి పెరగడం వంటి పరిణామాల కారణంగా అంతర్జాతీయ చమురు ధరలు తక్కువగానే ఉండవచ్చునని ఆర్బీఐకి చెందిన ద్రవ్య విధాన కమిటీ కూడా చెబుతోంది. ఆర్థిక వృద్ధి కోసం చమురు ధరలు తక్కువగా ఉండేలా చూడాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒపెక్ దేశాలను కోరారు. ఆయన మొదటిసారి అమెరికా అధ్యక్షుడుగా ...13లో

కారణమేమిటి?

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ ఆ ప్రయోజనాలను వినియోగదారులకు అందించడంలో మోడీ ప్రభుత్వం విఫలమవుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇందుకు పన్ను విధానామే కారణం. మోటారు స్పిరిట్లలో పన్ను వాటా కేంద్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. చమురు, పెట్రోలియం ఉత్పత్తులపై విధిస్తున్న పన్నులు వినియోగదారులు భరిస్తున్న రిటైల్ ధరల్లో ప్రధాన భాగంగా ఉంటున్నాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు రికార్డు స్థాయిలో తక్కువగా ఉన్నప్పటికీ ఎక్సైజ్ సుంకం అధికంగా ఉండడంతో ఆ రాబడుల ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎక్కువ ఆర్థిక ప్రయోజనం పొందుతోంది.

బడ్జెట్‌లో చేనేతకు రూ. 2వేల కోట్లు కేటాయించాలి

వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలి

యారన్ సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ :

డిప్యూటీ సీఎం భట్టికి చెరుపల్లి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడ్జెట్‌లో చేనేత, పవర్‌లూం రంగాలకు రూ.2వేల కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభం వల్ల రాష్ట్రంలో 15 నెలల కాలంలోనే 30 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల ఉపాధి కల్పనలో భాగంగా ప్రవేశ పెట్టిన వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. 2023నుంచి కార్మికులకు రావాల్సిన రూ.9కోట్ల యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని కోరారు. పొదుపు సంఘాల మహిళలకు అందించే చీరలను ఉత్పత్తి చేస్తున్న చేనేత కార్మికులకు రోజుకు రూ.వెయ్యి అందించాలనీ, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సెస్ సంస్థ విధించిన బ్యాక్ బిల్లింగ్ అదనపు విద్యుత్ చార్జీలు రూ.30 కోట్లను రద్దు చేయాలని కోరారు. కుటీర పరిశ్రమ ఆసాములకు 10 శాతం వరకు ఉచిత విద్యుత్ అందించాలనీ, టెక్స్‌టైల్ పార్కుల్లో విద్యుత్ భారంతో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా ...13లో

ఒక్క ఛాయాచిత్రం వెయ్యి పదాలకు సమానం

ప్రజాస్వామ్య పరిరక్షకులు ఫొటో జర్నలిస్టులు :గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఘనంగా ఫొటో జర్నలిస్టుల అవార్డుల ప్రదానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ఒక్క ఛాయాచిత్రం వెయ్యి పదాలకు సమానం. ప్రజల బాధలను, భావోద్వేగాలను ఫొటోలు ప్రతిబింబిస్తాయి. నేడున్న సామాజిక పరిస్థితుల్లో ఫొటో జర్నలిస్టులు ప్రజాస్వామ్య పరిరక్షకులు. సమాజంలో వారి పాత్ర కీలకం" అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రింట్ మీడియాకు ఆదరణ తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో వారు నిర్వహిస్తున్న పాత్ర మరువ లేనిదని కొనియాడారు. వార్తా కథనాల కన్నా ఒక్క ఫొటో ఆ పత్రిక నాణ్యతను తెలియ జేస్తుందని అభిప్రాయపడ్డారు. గతానికి, భవిష్యత్‌కు వారధిగా ఫొటోలు పని చేస్తాయని పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని గవర్నర్ అన్నారు. దేశంలోనే మొదటి సారీగా 1880లో ప్రయివేట్‌గా ఫొటో కెమెరాలు కొనుగోలు చేసిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ఫొటో జర్నలిస్టులు రాజకీయాలకతీతంగా విలువలు పాటిస్తూ వృత్తిలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కాలగర్భంలో కలిసి పోయిన చరిత్రను గుర్తు చేసేవి ఫొటోలని అన్నారు. రాష్ట్రంలోని ఫొటో జర్నలిస్టులు అన్యాయాలు, అవినీతి, అక్రమాలను తమ ఫొటోల ద్వారా సమాజానికి చేరవేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎన్.హరి స్వాగతోపన్యాసం చేసిన ఈ కార్యక్రమంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఆల్ ఇండియా రైస్ మిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తూడి దేవేందర్ రెడ్డి, రా అండ్ వెడ్డింగ్ సినిమా అధినేత రఘునాథ్, ఆర్విఆర్ మాభూమి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్, యూరోనిక్స్ కంపెనీ తెలంగాణ డీజీఎం మహమ్మద్ సిద్ధికి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఓయూలో సర్క్యులర్‌పై గరం గరం

వీసీ నియంతృత్వ పోకడలపై విద్యార్థి సంఘాల జేఏసీ ఆగ్రహం

సర్క్యులర్‌ను వాపస్ తీసుకోవాలని డిమాండ్...భారీ నిరసన ర్యాలీ, అరెస్ట్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ వీసీ జారీ చేసిన సర్క్యులర్‌ను వాపస్ తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. లేనియెడల ప్రతిపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను, మేధావులను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించింది. హైదరాబాద్ ఓయూలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దంటూ ఇచ్చిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజ్ వరకు విద్యార్థులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం, పౌర సమాజానికి పెద్దదిక్కైన ఓయూలో విద్యార్థి ఉద్యమాలను నిషేధించడం దుర్మార్గమన్నారు. తెలంగాణలో ప్రజా ప్రజాపాలన అందిస్తామని సీఎం పదే పదే ప్రకటిస్తూనే.. ఓయూలో విద్యార్థి ఉద్యమాలను నిషేధించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఈ వివాదంపై తక్షణమే స్పందించి ఓయూ ఆత్మగౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను నిరాకరించిన నియంతలు కాలగర్భంలో కలిశారని గుర్తు చేశారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అవగాహన లేకుండా ఓయూ వీసీ నిర్ణయాలు చేయడం తన అజ్ఞానాన్ని తెలుపుతున్నదన్నారు. ఓయూ అభివృద్ధి కోసం, నిధుల కోసం ఓయూ విద్యార్థి సంఘాల నేతలు, ప్రొఫెసర్లు ఉద్యమిస్తున్నారని తెలిపారు. వీసీ మాత్రం విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలి యూనివర్సిటీ అస్తిత్వానికి వ్యతిరేకంగా చెత్త నిర్ణయాలు రుద్దాలని చూస్తున్నారని విమర్శించారు. వీసీ ఐదు నెలల పాలనలో విద్యార్థులతో, విద్యార్థి సంఘాల నాయకులతో ఒక్క సమస్య మీదా చర్చించలేదని అన్నారు. దివ్యాంగులను అమానుషంగా అరెస్టు చేయించి, వారిపై కేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓయూ అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి, విశ్వవిద్యాలయాల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు కోరుతుంటే.. దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వీసీల ద్వారా ఇలాంటి అణచివేత చర్యలకు దిగుతుందా అనే సందేహాలు కలుగుతున్నాయన్నారు. అనంతరం లా కాలేజ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించడానికి వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. విద్యార్థి నేతలను అంబర్‌పేట, నల్లకుంట పోలీస్ స్టేషన్లకు తరలించారు. అక్రమ అరెస్టులను విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. అరెస్టయిన వారిలో సుమంత్ (జార్జిరెడ్డి పీడీఎస్‌యూ), జంగిలి దర్శన్ (డీబీఎస్‌ఏ), ఎల్.నాగరాజు (ఎంఎస్ఎఫ్-టీఎస్), అనిల్ (బీఆర్ఎస్‌వీ), జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు ఎం.వెంకటేష్, ఎస్.అంజి, స్వాతి, కోటేశ్వర రావు, ప్రణిత, నవ్యశ్రీ, నవీన్ (ఎస్ఎస్‌యూ), చేరాల వంశి (జేవీఎస్) ఉన్నారు.



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి.

26న చలో అసెంబ్లీ

యూనివర్సిటీల్లోని నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యల్ని పరిష్కరించాలి : టీయూఈడబ్ల్యూయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్ డైలీవేజ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలనీ, రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(టీయూఈడబ్ల్యూయూ-సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. ఈ కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు టీయూఈడబ్ల్యూయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్టు రవి, వి.నారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యను ప్రయివేటీకరిస్తున్నదనీ, అందులో భాగంగానే ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపును తగ్గించిందని విమర్శించారు. ఉన్నత విద్యా రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు అనుకూలంగా యూజీసీ నిబంధనలను సడలించిందని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను మోడీ సర్కారు హరిస్తున్నదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతున్నదనీ, దీనికి యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బంది కూడా బలవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కొరవడుతున్నదనీ, పనిభారం పెరుగుతున్నదనీ తెలిపారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీల నాన్‌టీచింగ్ సిబ్బంది తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

మంత్రులను తొలగిస్తేనే పరిపాలనపై పట్టున్నట్టా...?

అన్నింటినీ సరిదిద్దుకుంటూ ముందుకెళ్లటమే నా విధానం

రాజీవ్ యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 4 నుంచి 5 వేల మందికి ఉపాధి

ఇది పార్టీ పథకం కాదు.. ప్రజల పథకం...

- రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు మంజూరు చేస్తాం
- దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించాం
- జూన్ 2 న లబ్దిదారుల జాబితా ప్రకటన : రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"నాకు పరిపాలనపై పట్టు లేదంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు, గత సీఎంల మాదిరిగా క్యాబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టున్నట్టా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్టా?..." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అన్నింటినీ సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే తన విధానమని ఆయన స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే తన లక్ష్యమని తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకంగా వ్యవహరించాలంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలను, అసలైన అర్హులకే పథకాలను వర్తింపజేయాలంటూ అధికారులనూ ఆదేశించామని వివరించారు.

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు, అందుకనుగుణంగా ఆర్థికంగా సాయం చేసేందుకు రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సోమవారం శాసనసభ ప్రాంగణంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, పలువురు శాసనసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు త్వరలోనే 1.20 కోట్ల నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ రకంగా రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకూ కులగణన జరగలేదని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన సమాజానికి కులగణన అనేది ఎక్స్ రే లాంటిదంటూ తమ నేత రాహుల్ గాంధీ చెప్పారని వివరించారు. అది దేశమంతటా జరగాలంటూ ఆయన నొక్కి చెప్పారని తెలిపారు.

ఈ నేపథ్యంలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును కూడా ప్రవేశపెట్టామని అన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏండ్లుగా ఉద్యమం సాగుతోందనీ, దశాబ్దాలుగా నానుతున్న ఈ సమస్యపై కూడా అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి, దుబారా జరిగాయని విమర్శించారు. ఈ క్రమంలో దుబారాను, ఖర్చునూ తగ్గించుకుంటూ అప్పులను చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర రంగాలతో పోలిస్తే ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.3 కోట్లు పెరిగిందనీ, జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని సీఎం వ్యాఖ్యానించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే స్వయం ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలంటూ నిరుద్యోగ యువతకు ఆయన సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా విడుదల చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఒకప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ధర్నాలు జరిగేవనీ, ఇప్పుడు ఒక నోటిఫికేషన్‌కు మరో నోటిఫికేషన్‌కు మధ్య గ్యాప్ ఇవ్వాలంటూ నిరుద్యోగులు కోరుతున్నారని తెలిపారు.



తెలంగాణ

రైజింగ్ కాదు.. ఈజ్ ఫాలింగ్

జనం ప్రశ్నిస్తే.. జర్నలిస్టులను జైలుకు పంపుతారా.. : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చంచల్‌గూడ జైల్లో మహిళా జర్నలిస్టులకు పరామర్శ

నవతెలంగాణ- చంపాపేట్

తెలంగాణ రైజింగ్ కాదు.. తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అని.. అక్రమ కేసులతో ఆడబిడ్డలను జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ అనే పిచ్చోడి చేతిలో రాయిలా తెలంగాణ మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి అర్థం కావడానికి ఆయన మాట్లాడే బజారు భాషలోనే జనం నిలదీస్తున్నారని చెప్పారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రేవతి, తన్వి యాదవ్ తరపున న్యాయపోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌పై ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే జర్నలిస్టులపై ఆయన అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. జనం నిలదీస్తే.. ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపుతారా? జైలుకు పంపుతారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్న డిజిటల్ జర్నలిస్టులపై అక్రమ కేసులు, దాడులతో వేధించడం ప్రజాస్వామ్య హననం అని అన్నారు. తాను ఎంతో గొప్పగా చెప్పిన మొహబ్బత్‌కి దుకాన్ అంటే ఇదేనో కాదో చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను బట్టలూడదీసి కొడ్తానంటున్న రేవంత్ రెడ్డికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. సీఎం నియంతృత్వ పోకడలను అడ్డుకోకుంటే రేపు మిగతా జర్నలిస్టులకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. అక్రమాలపై మీడియా గొంతు విప్పి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులే అన్న సంగతి మరోసారి స్పష్టమైందన్నారు.

తన భార్యాపిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి గతంలో తమ మీద అడ్డగోలుగా అవాస్తవాలు మాట్లాడిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. తన పిల్లల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు రేవంత్‌కు కుటుంబం గుర్తుకురాలేదా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.71 వేల కోట్ల ఆదాయం తగ్గిందన్న రేవంత్ రెడ్డి, వారి పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ విఫలమైన సంగతిని స్వయంగా ఒప్పుకున్నారని చెప్పారు.

చారిత్రాత్మక నిర్ణయం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, ప్రతిపక్షాలు బీసీ బిల్లుకు సహకరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, శ్రీహరి ముదిరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా సభలో బిసి రిజర్వేషన్ల పెంపు బిల్లును ప్రవేశ పెట్టామన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా, విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ అందించే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేశామని, కేంద్ర ప్రభుత్వమూ చట్ట సవరణకు సహకరించాలన్నారు. ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ ఇప్పటికీ బీసీలోని పలు కులాలు చట్ట సభలలోకి రాని పరిస్థితి ఉందని, చేతులు ఎత్తి మొక్కుతున్న.. ప్రతిపక్షాలు ఈ బిల్లుకు సహకరించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

కేసీఆర్ స్థాయి కాదు మీది రేవంత్‌రెడ్డి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు స్థాయి మీది కాదు రేవంత్ రెడ్డి.. మీ స్థాయి కౌశిక్‌రెడ్డి స్థాయి మాత్రమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం నోటికి వచ్చినట్టు మాట్లాడారని, నిస్సిగ్గుగా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చానని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. దమ్ముంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా అశోక్‌నగర్‌కు రావాలన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, డిసెంబర్ వరకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని.. ఎందుకు ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ 2 లక్షల 10 వేల ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ అయిందని భట్టి విక్రమార్క చెబుతున్నారు.. తన నియోజకవర్గంలో 100 శాతం రుణ మాఫీ అయితే, తాను రాజీనామా చేస్తానన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో అభివృద్ధి కోసం పార్టీ మారినా అని కడియం అంటున్నారు.. మరి ఎంపీగా ఉన్న కడియం కూతురు అభివృద్ధి కోసం బీజేపీలోకి ఎందుకు మారలేదని ప్రశ్నించారు. చావు నోట్లో తలబెట్టి తెలంగాణ సాధించింది కేసీఆర్ అని, తెలంగాణ జాతి పిత కేసీఆరే అని అన్నారు.

గుమ్మడిదలలో డంపింగ్ యార్డు పెట్టొద్దు

- బీఆర్ఎస్ సభ్యులు సునీతా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదలలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డును వెంటనే నిలిపేయాలని బీఆర్ఎస్ సభ్యులు సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభలో జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆమె లేవనెత్తారు. కూరగాయల పంటలకు నెలవైన ఆ భూముల్లో డంపింగ్ యార్డు పెట్టడమేంటని ప్రశ్నించారు. ఆ డంపింగ్ యార్డులో ప్రతి చుక్క కూడా రాయరావు చెరువులో కలుస్తుందనీ, ఆ నీటితో పటాన్‌చెరుతో పాటు తన నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కూడా పంటలు పండుతున్నాయని చెప్పారు. ఇప్పుడు డంపింగ్ యార్డు పెడితే ఆ భూములు పనికిరాకుండాపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు అక్కడ వద్దని మొట్టికాయలు వేసినా ప్రభుత్వం అలాగే ముందుకెళ్లడమేంటని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో అర్బన్ ఫారెస్టు పార్కును డెవలప్ చేయాలని విన్నవించారు.

ధర్మపురి సీవరేజిని గోదావరిలో కలువకుండా చేయండి..పుష్కరాలకు మాస్టర్ ప్లాన్ చేయండి : అడ్లూరి లక్ష్మణ్

గోదావరి పుష్కరాలు 2027లో జరుగబోతున్న నేపథ్యంలో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని విప్ అడ్లూరి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ..ధర్మపురి సీవరేజిని గోదావరిలో కలువకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సీవరేజీ ప్రత్యేకంగా దారి మళ్లించేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో సరికొండ నుంచి చెల్కతండా వరకు 1.55 కిలోమీటర్ల రోడ్డు అధ్వాన్నంగా ఉందనీ, సింగిల్ రోడ్డు వల్ల పావుగంట నుంచి 20 సమయం పడుతున్నదని సభ దృష్టికి కాంగ్రెస్ సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి తీసుకొచ్చారు. తన నియోజకవర్గంలోని రోడ్లను అభివృద్ధి చేయాలని విన్నవించారు. బీఆర్ఎస్ సభ్యులు కె. మాణిక్‌రావు మాట్లాడుతూ.. తన నియోజవర్గంలో 1000 ఫీట్ల లోతు బోర్లు వేసినా నీళ్ల పడటం లేదన్నారు. భూగర్భజలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ సభ్యులు మురళీనాయక్ మాట్లాడుతూ..భీముని పాదం జలపాతం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. బొట్టుచెలిమె అటవీ ప్రాంతంలో 240పైగా పక్షిజాతులున్నాయనీ, ఆ ప్రాంతాన్ని వైల్డ్ లైఫ్ శాంక్చుయరీగా మార్చాలని విన్నవించారు. మహబూబాబాద్‌లో 11 ఎకరాల ప్రభుత్వ భూమిలో దాసరి స్మృతి వనం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆ ప్రభుత్వ భూమిపై ఉన్న లిటిగేషన్‌ను క్లియర్ చేసి రీహాబీటేషన్ సెంటర్ పెట్టాలని సూచించారు. సభ్యుల ప్రశ్నలను నోట్ చేసుకున్నామనీ, పరిశీలిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీనిచ్చారు.

గోదావరి చెలిమల నీరే దిక్కు

- కటిక చీకటిలో మగ్గుతున్న ఆదివాసీలు
- వీరి సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టవా : సీపీఐ(ఎం) నేత ఎస్.వీరయ్య
- మండపాక నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు ఖాళీ బిందెలతో ర్యాలీ, ధర్నా
- ధర్నా వద్దకు వచ్చిన పీఓ.. సమస్యల పరిష్కారానికి హామీ

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

పేదలకు గుక్కెడు మంచినీళ్ల ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదనీ, కారుచీకట్లో ఆదివాసీల జీవితాలు మగ్గుతున్నా కనీసం వారికి విద్యుత్ సౌకర్యం కల్పించలేని స్థితిలో అధికారులున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మండపాకలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండపాకలో ఆదివాసీలు, గుడిసెవాసులు ఉదయం 7 గంటలకు ర్యాలీ ప్రారంభించగా, పాదయాత్ర చేసుకుంటూ మధ్యాహ్నం 12 గంటల వరకు ఏటూరునాగారం ఐటీడీఏకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ధర్నాలో వీరయ్య మాట్లాడుతూ.. మంచినీళ్ల కోసం పేదలు 20 కి.మీ నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. మండల కేంద్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న ఆదివాసీలకు,



పేదలకు చెలిమనీరే దిక్కయిందని అన్నారు. కనీసం గ్రామ పంచాయతీ పాలకమండలి నుంచి మంచినీటి సౌకర్యం కల్పించాల్సి ఉన్నా అది .కారులూ పట్టించుకోలేదని ఆరోపించారు. పేదలు రెండేండ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటుంటే వారి సమస్యలు పట్టించుకోకపోగా ఖాళీ చేయాలని ఒత్తిడి చేయటం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. పేదల సమస్యలపై ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి జాగా లేక, ఇల్లు లేక పేదలు రోడ్డెక్కి పోరాటం చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు గాడిద పళ్ల తోముతున్నారా అంటూ ఎద్దేవా చేశారు. వాజేడులోని ఆదివాసీలు నీళ్ల లేక అల్లాడుతుంటే బీజేపీకి వీళ్ల సమస్యలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కండ్లు తెరిచి పేదలు, ఆదివాసీలకు కనీస అవసరాలైన ఇల్లు, ఇంటిజాగా, తాగునీరు, విద్యుత్తు, డ్రయినేజీ, రోడ్లు లాంటి ఇతర సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. పేదలు, ఇంటి జాగ కోసం ఏడాదిగా పోరాటం కొనసాగిస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఐటీడీఏ పీవో సమస్యలకు పరిష్కారం చూపకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం ఆదివాసీ ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. దీనిపై పీఓ స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేలా చర్యలు చేపడతామన్నారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ దావూద్, పొదిళ్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి చిరంజీవి, గొంది రాజేష్, జజ్జరి దామోదర్, గుగ్గిళ్ళ దేవయ్య, బచ్చల కృష్ణ, బాబు పూణెం కృష్ణ, బాబు బత్తుల సంతోష్, నరేష్, గౌరారపు చంద్రశేఖర్, తోలే ముత్తయ్య, తల్లడి ఉదయ, పాయంకుమారి, శాంత కుమారి, రామలక్ష్మి, శారద, కురసం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది గాంధీభవన్ కాదు.. అసెంబ్లీ

- మైకివ్వరు.. సమాధానాలివ్వరు.. ప్రశ్నలను మార్చుతున్నారు
- సభను సభలా నడపడంలో విఫలం
- సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం : ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఇది గాంధీ భవన్ కాదు..అసెంబ్లీ. సభను సభలా నడపండి. సభా నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. అందుకే సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం...' అంటూ ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో గంటన్నర పాటు చర్చ నడిచింది. కేవలం నాలుగు ప్రశ్నలకే సమాధా నాలు లభించాయి. మిగతా ప్రశ్నలకు రాత పూర్వక సమాధానాలను అందిస్తారంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ప్రశ్నోత్త రాలకు గంటే సమయం ఉంటుందనీ, కానీ, ప్రాధాన్యతారీత్యా గంటన్నర పాటు నిర్వహిం చామని చెప్పారు. అక్బరుద్దీన్ లేచి స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఒకింత అసహనానికి గురయ్యారు. తమకు మాట్లాడే అవకాశమి వ్వకుండా అధికార పార్టీ సభ్యులకు ఎక్కువ సమయం ఇవ్వడాన్ని తప్పుబట్టారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఒక ప్రశ్న ఇస్తే మరో ప్రశ్నకు మారుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు ముందు గంట, అరగంట ముందు ఎజెండా ఇస్తే సభ్యులు ఎలా ప్రిపేర్ కావాలంటూ ప్రశ్నించారు. శాసనసభ నిర్వ హణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ వైఖరిని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోతున్నామని ప్రకటించారు.

ఈ నిర్ణయం దేశానికే మార్గదర్శకం: పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల్లో, విద్యా, ఉపాధి అవకాశాల్లో బలహీన వర్గాలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలనే గొప్ప విప్లవాత్మక నిర్ణయాన్ని తమ ప్రభుత్వం తీసుకుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం అసెంబ్లీలోని మీడియాపాయింట్‌లో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ చెప్పినట్టుగా 'ఎవరెంతో వారికంత' అనే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని గుర్తు చేశారు. ఏడాది లోపు కుల గణన ఆధారంగా 42శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టామన్నారు. ఏకగ్రీవంగా ఈ బిల్లు ఆమోదం పొందటం అభినందనీయమన్నారు. 50 రిజర్వేషన్లపై క్యాప్ ఎత్తియాలని ప్రధానిని కలుస్తామని చెప్పారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చే విధంగా రాజ్యాంగ సవరణ అవసరమని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అఖిల పక్షంతో కేంద్రాన్ని కలుస్తామన్నారు. కేంద్రం ఆమోదించే విధంగా అందరం ముందుకు వెళదామని సూచించారు.

పొట్టి శ్రీరాములు జాతీయ నాయకుడు

- బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పొట్టి శ్రీరాములు జాతీయ నాయకుడనీ, యూనివర్శిటీకి ఆయన పేరు తొలగించటం అన్యాయమని చెప్పారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టే బిల్లు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఇది తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతీసే నిర్ణయమని ఆక్షేపించారు. సురవరం ప్రతాపరెడ్డి పేరు ఉస్మానియా యూనివర్శిటీకి పెట్టాలని డిమాండ్ చేశారు. .

ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేల హక్కులు తేలాల్సిందే

- ఎమ్మెల్యేలకు గౌరవమివ్వకుంటే మీకు మీరు తిట్టుకున్నట్టే
- బీజేపీ సభ్యులు కె.వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తాను 84 ప్రశ్నలను ఈ సభలో ఇస్తే కేవలం ఎనిమిదింటికే సమాధానాలు వచ్చాయనీ, 76 ప్రశ్నలకు సమాధానాలు లేవని బీజేపీ సభ్యులు కె.వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఆర్టీఐ ద్వారా 86 ప్రశ్నలను ఒక్కో డిపార్టుమెంట్ ఒక్కో విధంగా తనకు సమాధానాలు ఇచ్చిందని వివరించారు. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జి మంత్రుల పాత్రేంటి? ఇన్‌చార్జి మంత్రి శాసనం ద్వారా నియమితులయ్యారా? పార్టీల బలోపేతం కోసం పెట్టుకున్నారా? ప్రతి దాంట్లో ఇన్‌చార్జి మంత్రుల జోక్యమేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపైనా, ఎమ్మెల్యే హక్కులపైనా సభలో తేలాలని పట్టుబట్టారు. సోమవారం శాసనసభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. తాను అడిగిన ప్రశ్నల్లో 9 శాతం జవాబులు కూడా అందలేదని వాపోయారు. ఆరోగ్య శాఖలో సమాచారం అడిగితే..ఇలాంటివి మస్తుగ చూసినం అని అధికారులు అన్నారని గుర్తుచేశారు. విద్యా శాఖ సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ పరిస్థితి తనకు ఇప్పుడు వచ్చిందనీ, రేపు అటుపక్కనున్న ఎమ్మెల్యేలకు కూడా రావొచ్చునని చెప్పారు. ఆ పరిస్థితి వచ్చినప్పుడు బాధపడటం కంటే ఇటువంటి ప్రాక్టీస్‌ను మానేయడం మంచిదని సభకు విన్నవించారు. నియోజక వర్గంలో ఓడిపోయిన, పారిపోయిన వారు ప్రొసీడింగ్స్ ఇస్తుంటే మంత్రులు అక్కడికిపోయి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభిస్తుంటే ఎమ్మెల్యేగా తానెందుకు అని ప్రశ్నించారు. తాము పోలీసు ప్రోటోకాల్ అడగట్లేదనీ, అధికారులు లేచి మర్యాదులు చేయాల్సిన అవసరం లేదన్నారు. అయితే, ఎమ్మెల్యేగా కనీస గౌరవం ఇస్తే చాలన్నారు. ఓడిపోయినోళ్లు చెప్పినట్టు అధికారులు చేస్తారా? అని నిలదీశారు. ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలు పెంచినప్పుడు, డైట్ చార్జీలను పెంచినప్పుడు ప్రభుత్వాన్ని సమర్థించారని గుర్తుచేశారు. మంచిని మంచే..చెడును చెడే అని చెప్పడమే తనకు తెలుసు అన్నారు. ఎమ్మెల్యేలకు జరుగుతున్న అన్యాయంపైనే తాను మాట్లాడుతున్నారన్నారు. శాసనసభ హుందాగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం, అధికారులు సమాధానాలు చెప్పలేని స్థితిలో ఉండటమంటే ప్రభుత్వానికే సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేకు గౌరమివ్వకుండా ఉండటమంటే మీకు మీరు తిట్టుకున్నట్టే అని సర్కార్‌కు చురకలు అంటించారు.

రూ.90 లక్షలు మాకు...రూ.వెయ్యి కోట్లు మీకా?

- నిధుల కేటాయింపులో ఇదేం పద్ధతి
- ప్రతి నియోజకవర్గానికీ రూ.1000 కోట్లివ్వండి : బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించడమేంటి? తన నియోజవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.90 లక్షలు ఇవ్వడమేంటి? ఎందుకీ వ్యత్యాసం? మేం ఎమ్మెల్యేలం కాదా? అంటూ బీజేపీ సభ్యులు పైడి రాకేశ్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. ఎమ్మెల్యేగా ఉన్నందుకు తాను సిగ్గుపడుతున్నానని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గానికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు తాను నియోజకవర్గానికి వెళ్తే ఏం తెచ్చినవ్..ఏం తెచ్చినవ్..? అని విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిందేంది? తీసుకుపోయిందేంది? అంటూ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలంగాణ టూరిజం అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. యూపీ ప్రభుత్వం కుంభమేళ ద్వారా రూ.3 లక్షల కోట్ల ఆదాయం పొందిందనీ, టెంపుల్ టూరిజం ద్వారా ఆదాయం సాధించడం దేశానికే ఆదర్శమని కొనియాడారు. దక్షిణ తెలంగాణకు అధిక న్యాయం, ఉత్తర తెలంగాణకు అన్యాయం జరుగు తున్నదని వాపోయారు. ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంతంలో నిరుద్యోగం ఉందన్నారు. తాను చెప్పేది దక్షిణ తెలంగాణ నుంచి మంత్రులుగా ఉన్నవారంతా వినాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో 8 లక్షల మంది బీడీ కార్మికులున్నారనీ, 10 లక్షల మంది వలసలు వెళ్లారని చెప్పారు. దక్షిణ తెలంగాణలో పదో తరగతి వరకు డ్రాపౌట్స్ 21 శాతముంటే ఉత్తర తెలంగాణకు వచ్చే సరికి అది 40 శాతముందని వ్యత్యాసాన్ని ఎత్తిచూపారు. తన ఆర్మూర్ నియో జకవర్గంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో దేవాలయాలున్నాయనీ, 9 ఎకరాల్లో అద్భుతమైన ఐల్యాండ్ ఉందని చెప్పారు. టెంపుల్, ఈకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే తన నియోజకవర్గ ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగు తాయని చెప్పారు. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

టెక్కీల తిరుగుబాటు

సంపాదకీయం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమనగానే.. మంచి జీతాలు, ఏసీ హాలు, ఖరీదైన కార్లు, అదో దర్జా జీవితమని కొందరు భావిస్తారు. కానీ, వారు కూడా అందరి ఉద్యోగుల్లాగే సమస్యలు ఎదుర్కొంటారని, అర్ధరాత్రి వరకూ ఆఫీసుల్లో పనిచేస్తారని, కుటుంబంతో సరదాగా గడిపే సమయం కూడా దొరకదన్న విషయం సమాజంలో చాలా తక్కువ మందికి తెలుసు? ఇప్పుడిదే అంశంపై సాఫ్ట్‌వేర్ రంగంలో రగిలిన ఉద్యమం నేడు దేశమంతా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కర్నాటకలోని బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులంతా ఉప్పెనలా కదిలారు. 'మేం మనుషులమే..కార్పొరేట్లకు బానిసలం కాదంటూ' రాష్ట్ర రాజధాని 'ఫ్రీడమ్' పార్కు వేదికగా ర్యాలీ తీసి

> అసలు కార్మికుడైనా, ఉద్యోగి అయినా రోజుకు ఎన్నిగంటలు పనిచేయాలి? అన్న అంశంపై పద్దెనిమిదో శతాబ్దం, పారిశ్రామిక విప్లవం ప్రారంభకాలంలోనే అనేక చర్చలు జరిగాయి. సోషలిస్టు ఉద్యమాలు నడిచాయి. 24 గంటల్లో 8గంటల పని, 8గంటల నిద్ర, 8 గంటలు వ్యక్తిగత అవసరాలు, లేదంటే కుటుంబంతో గడిపే సమయంగా విభజించి చివరకు ఎనిమిది గంటల పనిని హక్కుగా పోరాడి సాధించుకున్నారు. ఇప్పుడు రోజుకు 14గంటల నుంచి 16 గంటలు పనిచేయాలని ఒత్తిడిచేస్తే వారి శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది? అందుకే "పెట్టుబడిదారులు కార్మికులను ఎక్కువ గంటలు పని చేయించడం ద్వారా వాళ్లను మృత్యువుకు దగ్గర చేస్తున్నారు." అంటారు మార్క్స్.

నిరసనలు తెలిపారు. వారికి సీఐటీయూ కూడా మద్దతు తెలిపింది. కార్పొరేట్ దిగ్గజాలను నడిపిస్తున్న ప్రయివేటు సంస్థల యజమానులు ఇటీవలి కాలంలో పనిగంటల పెంపుపై చేసిన వ్యాఖ్యల తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమవ్వడం ఇక్కడ గమనార్హం.

కాలంతో పోటీపడే వాటిల్లో ఐటీ రంగం ఒకటి. హైదరాబాద్, చెన్నయ్‌లతో పోల్చుకుంటే బెంగళూర్ టెక్ ఉద్యోగులకు కేంద్రం. కంపెనీలు కూడా బాగా ఉండటంతో వలసొచ్చే ఉద్యోగుల సంఖ్య కూడా ఎక్కువే. ఇది యజమానులకు ఓ వరంగా మారింది. అదిరించి, బెదిరించి పని చేయించుకోవడం అలవాటైంది. వేతనం లేని ఓవర్ టైం డ్యూటీ, అవాస్తవిక డెడ్‌లైన్, అనుకూలించని వాతావరణం వల్ల ఉద్యోగులు, తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్నారని అనేక సంస్థలు చేసిన సర్వేల్లో వెల్లడైంది. దీనికితోడు మారిన లైఫ్‌స్టైల్, దీర్ఘకాల ఒత్తిడి, వర్క్‌ప్రెషర్ వల్ల శారీరక, అనారోగ్య సమస్యలతో డెబ్బయి శాతం టెక్కీలు ఇబ్బందులు పడుతున్నారని పలు అధ్యయనాలు తేల్చాయి. అందుకే వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అనేది ప్రతి ఉద్యోగి హక్కుగా ఉండాలని, అన్ని పరిశ్రమల్లోలాగే ఐటీలో కూడా లేబర్ చట్టాలను అమలు చేయాలని టెక్కీలు రోడ్డెక్కారు.

శ్రమను గుర్తించకుండా కార్మికులను, ఉద్యోగులను ఎనిమిది గంటలకంటే ఎక్కువ పని చేయించుకోవాలనే విధానం ఇటీవల కాలంలో



బాగా పెరిగింది. అందులో ఉద్యోగుల్ని బానిసలుగా చూసే పద్ధతి కూడా బాగా విస్తరించింది. ఎల్అండ్‌టీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి ఉద్యోగులు వారంలో డెబ్బయి నుంచి తొంభై గంటలు పనిచేయాలన్నారు. ఓలా ఫౌండర్ విష్ అగర్వాల్ "శని, ఆదివారం వారాంతపు సెలవులు అనేది భారతీయ సంస్కృతి కాదు. ఇది విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నది. మన సంస్కృతి ప్రకారం నెలకి రెండు రోజులు సెలవుంటే సరిపోతుంది"అన్నారు. ప్రపంచ కుబేరుడు, ఎలన్‌మస్క్ వారానికి తొంభై నుంచి వంద గంటలు పనిచేయాలన్నాడు. మారిన ప్రపంచ రాజకీయ పరిస్థితులు, కేంద్రంలో కార్పొరేట్ల అనుకూల సర్కార్, వ్యాపారాల్లో మితిమీరిన లాభాపేక్ష, వాటి పర్యావసనాలే ఈ బరితెగింపు మాటలన్నది స్పష్టం.

అందుకే కారల్ మార్క్స్ పెట్టుబడిలో చెప్పిన ఒక మాటను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. "యంత్రాలు విలువను సృష్టించవు. అవి నిర్జీవ శ్రమకు ప్రతిరూపాలు. అవి కూడా గతకాలపు మనుషులు చేసినవే. అందులో కూడా శ్రమ నిక్షిప్తమై ఉంది. కానీ ఆ శ్రమకు కొత్తగా అదనంగా చేరేది లేదు. మనిషి సృజనాత్మకతతో లేదా తన కండరాలతో చేసే పనివల్ల ఎప్పటికప్పుడు కొత్త అదనపు విలువను సృష్టిస్తాడు. సజీవ శ్రమవల్లనే విలువ ఉత్పత్తి అవుతుంది. అదనపు ఉత్పత్తికి విలువ సమకూరుతుంది. నిర్జీవ శ్రమవల్ల కాదు." అన్నారు. అందుకే కార్పొరేట్ యజమానులకు ఉద్యోగులు మనుషుల్లాగా కనపడటం లేదు. యంత్రాల్లాగా కనపడుతున్నారు. తమ లాభాల కోసం పనిచేయాల్సిన మిషన్స్‌లా చూస్తున్నారు. ఈ ధోరణి అత్యంత ప్రమాదకరం.

అసలు కార్మికుడైనా, ఉద్యోగి అయినా రోజుకు ఎన్నిగంటలు పనిచేయాలి? అన్న అంశంపై పద్దెనిమిదో శతాబ్దం, పారిశ్రామిక విప్లవం ప్రారంభకాలంలోనే అనేక చర్చలు జరిగాయి. సోషలిస్టు ఉద్యమాలు నడిచాయి. 24 గంటల్లో 8గంటల పని, 8గంటల నిద్ర, 8 గంటలు వ్యక్తిగత అవసరాలు, లేదంటే కుటుంబంతో గడిపే సమయంగా విభజించి చివరకు ఎనిమిది గంటల పనిని హక్కుగా పోరాడి సాధించుకున్నారు. ఇప్పుడు రోజుకు 14గంటల నుంచి 16 గంటలు పనిచేయాలని ఒత్తిడిచేస్తే వారి శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది? అందుకే "పెట్టుబడిదారులు కార్మికులను ఎక్కువ గంటలు పని చేయించడం ద్వారా వాళ్లను మృత్యువుకు దగ్గర చేస్తున్నారు." అంటారు మార్క్స్. ఇది ఒక్క సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాదు, ప్రతి రంగంలోనూ దీన్ని జొప్పించే వ్యూహం చాపకింద నీరులా సాగుతున్నది. కార్మిక చట్టాల స్థానంలో మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే గనుక రేపు కార్మికులు, ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అందుకే బెంగళూర్‌లో టెక్కీలు చేపట్టిన ఉద్యమం, రేపు దేశమంతా వ్యాపిస్తుందనడంలో సందేహం లేదు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ట్రంప్ చికిత్స!



సి.పి. చంద్రశేఖర్

ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక, అమెరికా నాయకత్వంలో నడుస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మొత్తంగా వ్యవస్థీకృత మార్పులకు లోనవుతోంది. దీనికి చోదకశక్తి అంతర్గతంగానే పని చేస్తోంది. గతంలో రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు 'మహా మాంద్యం' ఏర్పడినప్పుడు 'న్యూ డీల్'ను ప్రకటించారు. 1970 దశకంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పినప్పుడు నయా ఉదారవాద విధానాలను ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ పెట్టుబడిదారీ వ్యవస్థ మరో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దానికి స్పందనగా ట్రంప్ నాయకత్వంలో ఈ మార్పులు జరుగుతున్నాయి.

ఆర్థిక రంగంలో ట్రంప్ ప్రభుత్వం ప్రధానంగా ప్రవేశ పెడుతున్న మార్పులు అయిదు విధాలుగా ఉన్నాయి. వాటిలో **మొదటిది:** అధిక దిగుమతి సుంకాలను విధించడం. బైటకు తరలిపోయిన పరిశ్రమలను తిరిగి అమెరికాకు రప్పించడానికి, తద్వారా అక్కడ ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచడానికి ఈ సుంకాల పెంపు చేపట్టినట్టు చెప్పి సమర్థించు కుంటున్నారు. దేశ భద్రతకు సైతం ఈ విధానం అవసరం అంటూ చెప్తున్నారు. అయితే, ఈ విషయంలో లోతుగా, ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్టు తోచదు. ఈ విధానం అమలు విషయంలో ఊగిసలాటలు కూడా కనిపిస్తున్నాయి. చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టగల దేశాలకు తరలిపోయిన సరుకుల ఉత్పత్తి పరిశ్రమలు ఏ మేరకు వెనక్కి వస్తాయన్నది ప్రశ్నార్థకమే.

కెనడా, మెక్సికో దేశాలపై ఇరవై ఐదో శాతం దిగుమతి సుంకం విధించారు. తర్వాత వెనక్కి తగ్గారు. కొంత జాగు తర్వాత తిరిగి సుంకం విధించారు. చైనాపై విధించే సుంకాలను పెంచారు. కార్లు, ఇతర వాహనాలు, స్టీల్, అల్యూమినియం తదితర ఉత్పత్తుల మీద కూడా సుంకాలను ప్రకటించారు. దానికి ప్రతిస్పందనగా అమెరికాతో వాణిజ్యం నడిపే దేశాలు కూడా అమెరికా దిగుమతులపై సుంకాలను ప్రకటిస్తున్నాయి.

రెండవ మార్పు: బడా పెట్టుబడిదారులు అమెరికన్ రాజ్య వ్యవస్థను స్వాధీనం చేసుకోవడం. ఇంతవరకూ సెక్యూరిటీస్ ఎక్స్‌ఛేంజ్ కమిషన్, ఫెడరల్ ట్రేడ్ కమిషన్, వంటి నియంత్రణ సంస్థలు స్వతంత్ర సంస్థలుగా ఉన్నాయి. గతంలో ఎస్ఇసి క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు పగ్గాలు వేయడానికి ప్రయత్నించింది. అమెజాన్, మెటా వంటి గుత్త సోషల్ మీడియా ప్లాట్‌ఫాం సంస్థలను అదుపు చేయడానికి ఎఫ్‌టిసి ప్రయత్నించింది. ఇప్పుడు ఈ స్వతంత్ర సంస్థలను అమెరికన్ అధ్యక్షుడి శ్వేతసౌధానికి జవాబుదారీగా వ్యవహరించేలా వాటి ప్రతిపత్తిని మార్చివేశారు. బడా పెట్టుబడులు యథేచ్ఛగా దోచుకోడానికి అవకాశం కల్పించారు. ఇప్పుడు అమెరికాలోని అగ్రశ్రేణి బడా వ్యాపార వేత్తలందరూ ట్రంప్ వెనుక మోహరించివున్నారు. ట్రంప్‌కు చెందిన విధాన రూపకల్పన వేదికలలో సైతం వారు ప్రవేశించారు. వారందరిలోకీ చెప్పుకోదగ్గవాడు ఎలన్ మస్క్. ఎక్స్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫాంకు, టెస్లా అనే వాహన తయారీ సంస్థకు అతడు



అధిపతి. ఇప్పుడు ఎలన్ మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచే ఒక శాఖను ఏర్పరిచాడు ట్రంప్. అదే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ. దీనికి 50 బిలియన్ల డాలర్లు కేటాయించాడు. ప్రభుత్వానికి చెందిన ఏ విభాగమైనా ఈ డిఒజిఇ కి జవాబుదారీ గా ఉండాలని ఆదేశించారు.

> ఇప్పుడు అమెరికాలోని అగ్రశ్రేణి బడా వ్యాపార వేత్తలందరూ ట్రంప్ వెనుక మోహరించివున్నారు. ట్రంప్‌కు చెందిన విధాన రూపకల్పన వేదికలలో సైతం వారు ప్రవేశించారు. వారందరిలోకీ చెప్పుకోదగ్గవాడు ఎలన్ మస్క్ ఎక్స్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫాంకు, టెస్లా అనే వాహన తయారీ సంస్థకు అతడు అధిపతి. ఇప్పుడు ఎలన్ మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచే ఒక శాఖను ఏర్పరిచాడు ట్రంప్. అదే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ. దీనికి 50 బిలియన్ల డాలర్లు కేటాయించాడు. ప్రభుత్వానికి చెందిన ఏ విభాగమైనా ఈ డిఒజిఇ కి జవాబుదారీ గా ఉండాలని ఆదేశించారు.

మూడవ మార్పు: అమెరికాతో వాణిజ్య పరంగా, దౌత్య పరంగా సంబంధాలు నెరపే దేశాల నుండి తమకు కావలసిన వ్యూహాత్మకమైన భూభాగాలను, సహజ వనరులను, ఇతర సదుపాయాలను ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్, పనామా కాలువ, గాజా భూభాగం తనకే స్వంతం అని ప్రకటించాడు. అదే సమయంలో ఆ యా మిత్ర దేశాలకు అందిస్తూ వచ్చిన ఆర్థిక, సైనిక సహాయాలకు కోత పెడుతున్నాడు.

నాలుగవది: ఉక్రెయిన్‌లో గాని, గ్రీన్‌లాండ్‌లో గాని, ఇతర దేశాలలో గాని ఉన్న కీలకమైన ఖనిజాలను తమకు కేటాయించాలని బెదిరిస్తున్నాడు. తర్వాత అవసరమైతే బలప్రయోగానికి కూడా వెనుకాడేలా లేడు.

ఐదవది: ప్రపంచ రాజకీయాలన్నీ అమెరికా చుట్టూ మాత్రమే తిరిగేలా చేయడానికి రష్యాతో మళ్లీ సత్సంబంధాలను నెలకొల్పుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. యూరప్ దేశాలతో సంబంధాలలో కూడా మార్పులు చేస్తున్నాడు. రష్యాతో సంబంధాలు మెరుగుపడితే ఆ దేశంలో లభించే ముడిసరుకులను అమెరికా పొందగలుగుతుంది. అమెరికాతో యూరప్ దేశాలు వ్యాపార సంబంధాలను కొనసాగిస్తాయి కాని వాటి రక్షణ బాధ్యతనుండి అమెరికా వైదొలగు తుంది. - ఇదీ ట్రంప్ విధానం.

ట్రంప్ ఎత్తుగడల లక్ష్యం ఏమిటి?

ట్రంప్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించిన శ్వేత కార్మికులకు ఏదో ఒరగ బోతోందన్న అభిప్రాయాన్ని కలిగించడం. అమెరికాకు మళ్లీ పరిశ్రమలు తిరిగి వచ్చేస్తే వాటిలో తమకు ఉపాధి లభిస్తుందన్న ఆశలు వారిలో కలిగించడం. ముఖ్యంగా అత్యంత సంపన్నుల ప్రయోజనాల కన్నా ట్రంప్ తమ ప్రయో జనాలను కాపాడేందుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాడన్న భ్రమలు వారిలో కలిగించడం ఒక లక్ష్యం. బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్యాన్ని తిరిగి బలంగా నెలకొల్పాలన్నది మరో లక్ష్యం.

అయితే ఈ లక్ష్యాలు ఏమేరకు నెరవేరతాయి?

1970 దశకం తర్వాత అమలు చేసిన నయా ఉదారవాద విధానాలు ద్రవ్య పెట్టుబడిపై నియంత్రణలను ఎత్తివేశాయి. రుణాల మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి వైపు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పాత్ర మారి పోయింది. అట్టడుగు తరగతుల సంక్షేమం కోసం నిలబడి, అందుకోసం సంపన్నులను నియంత్రించే విధానాలకు బదులు దానికి రివర్స్‌గా దిగువ తరగతుల నుండి సంపదను కొల్లగొట్టి సంపన్నుల వద్ద సంపద మరింతగా కేంద్రీకరించబడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

అయితే ఈ విధంగా సంపదను నిరవధికంగా కేంద్రీకరించడం అనేది ఎంతోకాలం పాటు కొనసాగించడం

> ఈ పరిస్థితి సామ్రాజ్యవాద దేశాల మధ్య నెలకొన్న సంబంధాలలో మార్పునకు దారితీస్తోంది. గతంలో రెండుసార్లు ప్రపంచయుద్ధాలకు దారి తీసిన విధంగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఈ సారి పరిణమించక పోవచ్చు. ఆ సామ్రాజ్యవాద దేశాల్లో ఒక ఆధిపత్య దేశం తన స్వార్థం కోసం తక్కిన సామ్రాజ్యవాద మిత్రులను సైతం తొక్కి పెట్టడానికి తయారౌతోంది. అందుకోసం తన మాజీ శత్రువులతో సైతం చేతులు కలిపేందుకు సిద్ధపడుతోంది. తక్కిన ప్రపంచాన్ని మొత్తంగా తన వలసగా మార్చుకుని తద్వారా తన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడు కోవచ్చునని అమెరికన్ పాలకవర్గం భావిస్తున్నట్టు ఉంది. కాని ఇది ఒక వికృతమైన ప్రయత్నంగా తయారై విఫలం కాక తప్పదు.

అసాధ్యం.ఈ విషయాన్ని 2008లో బద్దలైన సంక్షోభం తేటతెల్లం చేసింది. 1960 దశకం నుండి రెండు దశాబ్దాల పాటు పెట్టుబడిదారీ విధానానికి 'స్వర్ణయుగం' నడిచింది. ఆర్థిక వృద్ధి, కనీస స్థాయిలో ద్రవ్యోల్బణం, ఎక్కువ మోతాదులో ఉపాధి కల్పన, సంక్షేమ రాజ్యం అన్నీ ఆ కాలంలో సాధ్యపడ్డాయి. కాని నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అవన్నీ అదృశ్యమయ్యాయి. అందుచేత పెట్టుబడిదారీ దోపిడీ విధానాలను సమర్థించుకోవడం రాజకీయంగా పాత పద్ధతులలో సాధ్యపడటం లేదు.

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అని ట్రంప్ ఇచ్చిన నినాదం అతగాడి వెనుక ఉన్న అమెరికన్ పెట్టుబడిదారుల కోసమే. తక్కిన వారందరినీ, తన మిత్ర దేశాలతో సహా బలిచేసి, అమె రికాను మాత్రమే అగ్రస్థానంలో నిలపాలన్నదే ఆ నినాదం లక్ష్యం. అందుకోసమే ట్రంప్, అతని సహచరులు అమెరి కన్ రాజ్యవ్యవస్థను చేజిక్కించుకుని అతి కొద్దిగా ఉన్న 'సూపర్ రిచ్'కి మరింత సంపదను కట్టబెట్టే పనిలో ఉన్నారు. తక్కిన ప్రపంచం నుండి వనరులను చేజిక్కించుకుని తద్వారా అతి కొద్దిమంది సూపర్ రిచ్ వద్ద సంపదలను మరిం తగా కేంద్రీకరించి, ఈ క్రమంలో అమెరికాలో ఉన్న కార్మికవర్గానికి కొంతవరకూ విదిలిస్తే సరిపోతుందన్న దృష్టితో వాళ్లున్నారు.

ఈ పరిస్థితి సామ్రాజ్యవాద దేశాల మధ్య నెలకొన్న సంబంధాలలో మార్పునకు దారితీస్తోంది. గతంలో రెండుసార్లు ప్రపంచయుద్ధాలకు దారి తీసిన విధంగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఈ సారి పరిణమించక పోవచ్చు. ఆ సామ్రాజ్యవాద దేశాల్లో ఒక ఆధిపత్య దేశం తన స్వార్థం కోసం తక్కిన సామ్రాజ్యవాద మిత్రులను సైతం తొక్కి పెట్టడానికి తయారౌతోంది. అందుకోసం తన మాజీ శత్రువులతో సైతం చేతులు కలిపేందుకు సిద్ధపడుతోంది. తక్కిన ప్రపంచాన్ని మొత్తంగా తన వలసగా మార్చుకుని తద్వారా తన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడు కోవచ్చునని అమెరికన్ పాలకవర్గం భావిస్తున్నట్టు ఉంది. కాని ఇది ఒక వికృతమైన ప్రయత్నంగా తయారై విఫలం కాక తప్పదు.ఒక దురహంకారి నాయకత్వంలో అమెరికన్ శత కోటీశ్వరుల గుంపు సాగించే దోపిడీ ఎల్లకాలమూ కొనసాగిపోతుందనే భ్రమలో ఉన్నారు. కాని ఈ భ్రమ పటాపంచలు కాక తప్పదు.

(స్వేచ్ఛానుసరణ)

కనీస వేతనాలపై సర్కార్ కరినమెంతకాలం?


భూపాల్
9490098034

రాష్ట్రంలో కనీస వేతనాల సమస్యపై గత పదకొండేండ్లుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా కనీస వేతనాలు పెరగలేదు. 73 రంగాల్లో సుమారు కోటి 20 లక్షల మంది కార్మికులు అరకొర వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారు. ప్రయివేటు రంగంలోని యజమానులంతా కార్మికుల శ్రమను దోచుకొని లాభాలు గడిస్తున్నారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కార్మికుల వేతనాల విషయంలో ఒకటే విధానాన్ని అవలంభిస్తున్నాయి. రెండు ప్రభుత్వాలు కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చి యజమానులకు సేవ చేస్తున్నాయి. కార్మికులు, కార్మిక సంఘాల మొర ఆలకించడం లేదు. కనీస వేతనాల చట్టం - 1948 ప్రకారం ప్రతి ఐదేండ్లకు ఒకసారి వేతనాలు సవరించి పెంచాలి. 2012 తర్వాత నేటి వరకు షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో వేతనాలు పెంచలేదు. చట్ట ప్రకారం పెరిగిన ధరలకనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఖజానాపై నయా పైసా భారం పడదు. పని చేయించుకున్నందుకు ప్రయివేటు యాజమాన్యాలు చెల్లించే వేతనాలను ప్రభుత్వం నిర్ణయించకపోవడంతో పదిహేనేండ్లుగా వేల కోట్ల రూపాయలు కార్మికులు నష్టపోతున్నారు. రాష్ట్రంలోని కార్మికుల దారిద్ర్యానికి, అర్థాకలికి, అప్పులపాలు కావడానికి ప్రభుత్వాలే కారణం.

2014 తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మూడుసార్లు కనీస వేతనాల సలహా మండలి నియమించి వేతనాలపై ప్రతిపాదనలను తెప్పించుకుని కూడా అంతిమంగా కార్మికులకు ప్రయోజనం కల్గించలేదు. 2021లో ఐదు షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ అయిన సెక్యూరిటీ సర్వీసెస్, కన్‌స్ట్రక్షన్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఆపరేషన్స్, స్టోన్ బ్రేకింగ్, ప్రాజెక్టులు, డ్యామ్‌లు, ప్రయివేటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలకు సంబంధించి జీఓ నెం.21, 22, 23, 24, 25ల పేరిట ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చింది. వీటి మీద యాజమాన్య సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం గెజిట్ చేయకుండా ఆపివేసింది. ఎందుకు ఆపిందంటే ? కనీస వేతనాల సలహా మండలి సిఫారసుల ఆధారంగా కనీస వేతనం అన్‌స్కిల్డ్ వర్కర్‌కు రూ.18,019, హైలీస్కిల్డ్ వర్కర్‌కు రూ.39,837 నిర్ణయించారు. ఇవి చాలా ఎక్కువగా ఉన్నాయని యాజమాన్య సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం గెజిట్ చేయలేదు. ఈ చర్య వల్ల కార్మికులకు తీవ్రంగా నష్టం జరిగింది. ఈలోపు ప్రభుత్వం మారింది.

2024 డిసెంబర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఉన్నఫళంగా ఏదీ ఆలోచించకుండా, కార్మిక సంఘాలతో చర్చించకుండా హడావిడిగా 2024 జనవరి ఆఖరులో 73 రంగాలకు డ్రాఫ్ట్ జీఓలు జారీ చేసింది. ఇందులో వేతనాలు సగటున రూ.12వేలు నిర్ణయించింది. అంటే 2021 నాటి వేతనాల కన్నా సగటున రూ.7వేలు తగ్గించింది. పెంచాల్సింది పోయి తగ్గించింది. గతంలో ఇచ్చిన జీఓలను అమలు



చేయకుండా పక్కన పెట్టడం చట్ట వ్యతిరేకం. కరువుభత్యం పాయింట్ల యొక్క రేట్లు కూడా అన్‌స్కిల్డ్ వర్కర్ రూ.12, హైలీస్కిల్డ్‌కు రూ.26.55 ప్రతిపాదించారు. వీటిని యాజమాన్య సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. గత ప్రభుత్వం కూడా యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ కాలయాపన చేస్తున్నది. దీనిపై అన్ని సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

2021లో విడుదల చేసి ఐదు రంగాలను గెజిట్ ముద్రించాలని మిగిలిన 68 రంగాలకు వీటి మాదిరిగా వేతనాలు నిర్ణయిం చాలని హైకోర్టులో కేసు వేశారు. హైకోర్టులో పిల్ నెం: 14 ఆఫ్ 2023లో కేసు వేశారు. ఈ కేసులో 9అక్టోబర్2023న జడ్జిమెంట్ ఇస్తూ ఆరు వారాల్లో చట్టం ప్రకారం వేతనాలు సవరించాలని, అలాగే 2021లో ఐదు రంగాలకు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్స్‌ను గెజిట్ చేయాలని ఉత్తర్వులిచ్చింది. పిల్ నెం.14 ఆఫ్ 2023లో పై ఉత్తర్వులను ప్రభుత్వం అమలు

> ఈ కేసులో 9 అక్టోబర్2023న జడ్జిమెంట్ ఇస్తూ ఆరు వారాల్లో చట్టం ప్రకారం వేతనాలు సవరించాలని, అలాగే 2021లో ఐదు రంగాలకు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్స్‌ను గెజిట్ చేయాలని ఉత్తర్వులిచ్చింది. పిల్ నెం.14 ఆఫ్ 2023లో పై ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయలేదు. దీనిమీద కంటెమ్ట్ కేసు సిసి నెం.2624 ఆఫ్ 2023 ఫైల్ చేశారు. ఇందులో 2025 మార్చి 3న జడ్జిమెంట్ వచ్చింది. నాలుగు వారాల్లోగా ఐదు జీవోలను గెజిట్ చేయాలి లేదా ప్రభుత్వ ఉన్నతాధికారి పర్సనల్‌గా కోర్టుకు హాజరు కావాలని తీర్పు చెప్పింది. వచ్చే నెల11కు కేసు వాయిదా వేసింది. ఈ లోగా ప్రభుత్వం అమలు చేయాల్సి వుంది.

చేయలేదు. దీనిమీద కంటెమ్ట్ కేసు సిసి నెం.2624 ఆఫ్ 2023 ఫైల్ చేశారు. ఇందులో 2025 మార్చి 3న జడ్జిమెంట్ వచ్చింది. నాలుగు వారాల్లోగా ఐదు జీవోలను గెజిట్ చేయాలి లేదా ప్రభుత్వ ఉన్నతాధికారి పర్సనల్‌గా కోర్టుకు హాజరు కావాలని తీర్పు చెప్పింది. వచ్చే నెల11కు కేసు వాయిదా వేసింది. ఈ లోగా ప్రభుత్వం అమలు చేయాల్సి వుంది. కానీ ఈనెల 12న ప్రభుత్వం అడిషనల్ అడ్వకేట్ జనరల్ ద్వారా హైకోర్టులో మెమో వేసి పదిహేను రోజుల సమయం అడిగింది. కోర్టు రెండు వారాలు గడువు ఇచ్చింది. ఈ పిల్ కేసు కాకుండా రిట్‌పిటిషన్ నెం.34997 ఆఫ్ 2022 కేసులో కూడా హైకోర్టు తీర్పునిస్తూ 25అక్టోబర్ 2024న నాలుగు వారాల్లో చర్యలు తీసుకొని వేతనాలు సవరించాలని చెప్పింది. ఈ తీర్పును ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించలేదు. ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు అమలుచేసే ఉద్దేశ్యం లేదు.

ప్రభుత్వం తప్పించుకోవడానికి నానా యాతనలు పడుతూ మళ్లీ టైం అడుగుతున్నది. ఇది కార్మికులను మోసం చేయడమే! కార్మికులకు అనుకూలంగా జడ్జిమెంట్ ఉన్నందుకే ప్రభుత్వం అడ్డంకులు పెడుతున్నది. అనేక సందర్భాల్లో ధనవంతులకు, ప్రయివేటు యాజమాన్యాలకు అనుకూలంగా ఇచ్చిన తీర్పులను మాత్రం ప్రభుత్వం ఆగమేఘాల మీద అమలు చేసిన ఘటనలున్నాయి. ప్రభుత్వమే ఇక్కడ చట్టం ప్రకారం వేతనాలు పెంచకుండా ఉల్లంఘనలకు పాల్పడుతున్నది. హైకోర్టు మొట్టి కాయలు వేసినా చలనం లేకుండా ఉండడం చూస్తే పెట్టుబడిదారుల పట్ల బహిరంగంగా వైఖరి తీసుకుంటున్నది. ఈ పరిస్థితిలో రాష్ట్రంలో కార్మిక సంఘాలన్నీ ఏకతాటి పైకి వచ్చి పోరాటాన్ని ప్రారంభిస్తున్నాయి.

కుల దురహంకారులు ఇకనైనా మారాలి


టి.స్కైలాబ్ బాబు
9177549646

కుల రక్కసి అగ్రకుల అహంకారం జడలు విప్పితే ఎంతటి కసాయివారుగా మారుతారో చూస్తూనే ఉన్నాము. రాష్ట్రంలో ఈ పదకొండేండ్ల కాలంలో 128 కుల దురహంకార హత్యలు జరిగాయి. వరుస హత్యలపై నాటి, నేటి ప్రభుత్వాధినేతలు ఏనాడూ ఖండించిన పాపాన పోలేదు. పైగా కొన్ని ఘటనల్లో హంతకులకు అండగా నిలబడ్డారు. కేవీపీఎస్, కొన్ని సామాజిక ప్రజాసంఘాలు మాత్రమే బాధితుల పక్షాన నిలబడ్డాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మిర్యాలగూడకు చెందిన పెరుమాండ్ల ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా ఎస్సీ,ఎస్టీ కోర్టు ఈ నెల పదిన కుల దురహంకారులకు చెంప చెళ్లుమనిపించే తీర్పునిచ్చింది. గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న ఈ హత్యల తీరును విశ్లేషిస్తే కులాలు వేరుకావడం, ఊరిలో, బంధువుల్లో తమ పరువు పోయిందనే కారణంతోనే దారుణ దురాగతాలకు పాల్పడుతున్నారన్నది కేవీపీఎస్ నిజనిర్ధారణలో కూడా వెల్లడైంది.

2014లో నిజామాబాద్ జిల్లాలో ప్రేమ వివాహం చేసుకున్న కూతుర్ని 'ఇంటికి రా, బట్టలు పెడతాం' అంటూ నమ్మబలికి వచ్చాక నడింట్లో గుంజకు పశువును కట్టేసినట్టుగా కట్టి సజీవ దహనం చేశారు తల్లిదండ్రులు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ కూతురిపై ఇంత కఠినంగా, హింసించి చంపేస్తే పౌర సమాజం, పాలక పార్టీలు నోరు మెదపలేదు. ఆ రోజే ఇలాంటి వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునివుంటే ఈ హత్యల్లో కొన్నయినా కట్టడి అయ్యేవి. ఆ తర్వాత పెద్దపల్లి జిల్లాలో మంథని మధుకర్ హత్య, భువనగిరిలో అంబోజీ నరేష్ హత్య, మిర్యాలగూడలో 2018 సెప్టెంబర్ 14న పెరుమాండ్ల ప్రణయ్ హత్య రాష్ట్రాన్ని కుదిపేశాయి. అమృత తండ్రి మారుతీ రావు కోటి



రూపాయలు సుఫారీ ఇచ్చి ప్రణయ్‌ని అత్యంత కిరాతకంగా హత్య చేయించాడు. తన కూతురు ఎస్సీ యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుందని, దీంతో తమ పరువు పోయిందని హత్యచేయించాను అని ఆరోజు మారుతిరావు చెప్పాడు. హత్య కేసు విచారణ జరుగుతున్న సమయంలో 2020లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఐదున్నరేండ్లపాటు న్యాయస్థానంలో అనేక వాదోపవాదాలు జరిగాయి. ప్రణయ్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు చంపుతామని బెదిరింపు కాల్స్ కూడా వచ్చాయి. 1600 పేజీల చార్జ్‌షీటు వేశారు. 78 మందిని ఈ కేసులో విచారించారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రణయ్ కుల దురహంకార హత్య కేసు'లో తుది తీర్పు వెల్లడించింది మొత్తం ఎనిమిది మందిలో మారుతి రావు ఆత్మహత్య తర్వాత ఏ2 సుభాష్ శర్మ, ఏ3 అస్గర్ అలీ, ఏ4 అబ్దుల్ భారీ, ఏ5 కరీం, ఏ6 శ్రావణ్,(మారుతీ రావు తమ్ముడు), ఏ7 శివ, ఏ8 నిజాంలకు శిక్షలు పడ్డాయి. ఏ2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవిత ఖైదూ విధించింది.

ఈ తీర్పు వెల్లడైన తర్వాత కొంతమంది హంతకులను బలపరిచే వాళ్లు భిన్న కోణాల్లో సామాజిక మాధ్యమాల్లో చర్చలు పెడుతున్నారు. ప్రణయ్ భార్య అమృత ప్రస్తుతం తల్లి దగ్గర ఉంటుందని, ఆమె ప్రణయ్ కుటుంబం వద్ద ఉండట్లేదని, ఆమె మౌనంగా ఉంటుందని రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. కొంతమంది మనువాద పుత్రులు హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన నాగరాజు మత దురహంకార హత్యపై దళిత సంఘాలను, అభ్యుదయ వాదులను నిందిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. హిందువులను ముస్లింలు చంపితే ఈ దళిత సంఘాలు ఎందుకు నోరు విప్పట్లేదని? ఆరోపిస్తున్నారు. కానీ రాష్ట్రంలో జరిగిన కుల దురహంకారాత్యల్లో ఎప్పుడూ నోరు విప్పని ఆరెస్సెస్-బీజేపీ మతోన్మాద సంస్థలు కేవలం ముస్లింలు నాగరాజును చంపినప్పుడు మాత్రమే నోరువిప్పాయి.బండి సంజయ్, రాజాసింగ్‌లు రోడ్డుపైకొచ్చి స్పందించారు. మొత్తం 128 హత్యల్లో కేవలం ఈ ఒక్క హత్యపై మాత్రమే బీజేపీ స్పందించింది.అది కూడా మత విద్వేషాలు రెచ్చగొట్టడాడనికి ప్రయత్నించింది. ఒక మనిషిని మరొక మనిషి హత్య చేయటాన్ని ఖండించాలి. కానీ కేవలం ముస్లింలు చంపితే మాత్రమే స్పందిస్తామనడం మూర్ఖత్వమే.

ఇదిగాక, హంతకుడు మారుతిరావుకు మద్దతుగా 2018లో మతోన్మాద వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ర్యాలీ కూడా చేసింది. కానీ కేవీపీఎస్ సమాజం, సామాజిక పక్షం. ప్రణయ్ హత్య జరిగినప్పుడు కేవీపీఎస్ 24 గంటల పాటు అతని డెడ్‌బాడీతో ఉంది. అంత్యక్రియల్లో పాల్గొంది. ప్రణయ్ కుటుంబానికి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకత్వం అండగా నిలబడింది. రాష్ట్ర వ్యాప్తంగా దశల వారి పోరాటాలు నిర్వహించింది. నింది తులను అరెస్టు చేసేంతవరకు ఉద్యమాన్ని నిష్క్రమించలేదు. నాడు నల్లగొండ ఎస్పీగా ఉన్న రంగనాథ్ ఈ కేసులో లోతైన పరిశీలన చేసి నిందితులను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ పంపారు. కేవీపీఎస్ తరపున నాడు పార్లమెంటు సభ్యుడు, డీఎస్ఎంఎం జాతీయ నాయకుడు సోమ ప్రసాద్ బృందం అమృతను ప్రణయ్ తండ్రి బాలస్వామిని పరామర్శించి ధైర్యం చెప్పారు. తమిళనాడులో కుల దురహంకార హత్యకు గురైన శంకర్ జీవిత సహచరి కౌసల్య తన భర్తను నడిరోడ్డు మీద కౌసల్య తండ్రి అన్న మరి కొంతమంది దుండగులతో నరికి చంపారు. బయట ప్రజా ఉద్యమం నిర్మించిన కౌసల్య న్యాయస్థానంలో పోరాడి వాళ్లకి జీవిత ఖైదు పడే విధంగా కృషి చేసింది. ఆ కౌసల్యను అమృతకు అండగా తీసుకొచ్చి ధైర్యం చెప్పించింది.

హత్య జరిగినప్పటినుండి మొన్న శిక్ష పడిన తర్వాత కూడా మతోన్మాదులు సాంఘీక మాధ్యమాల్లో అనేక వక్రీకరణలు చేస్తున్నారు ప్రణయ్ క్రిస్టియన్ అని, అల్లారుముద్దుగా పెంచుకున్న తన బిడ్డ వేరే కులంవాడిని పెండ్లి చేసుకుంటే ఊరుకోమంటారా? అని వ్యాఖ్యానిస్తున్నారు. క్రిస్టియన్ అయితే చంపాలా? దళితుడిని చంపిన నోరు విప్పరా? ఇలాంటి వ్యాఖ్యలు సమాజానికి అత్యంత ప్రమాదకరం. దీన్ని ప్రతిఒక్కరూ ఖండించాలి. ప్రణయ్ హత్య కేసు తీర్పుతో మొత్తం కులదురహంకార హత్యలు ఆగిపోతాయని చెప్పకపోయినప్పటికీ, అలాంటి హత్యలకు పాల్పడే, ప్రేరేపించే వారి గుండెల్లో గుబులు పుట్టించే విధంగా తీర్పు ఉందని మాత్రం చెప్పొచ్చు. అట్టడుగు వర్గాలకు న్యాయస్థానాల్లో న్యాయం దక్కుతుందనే భరోసా, ధైర్యం ఈ తీర్పు కలిగించింది.ఇకనైనా కుల దురహంకారులు మారాలి.

గతేడాది టెన్త్ మూల్యాంకనం

రెమ్యూనరేషన్ చెల్లించాలి

- మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గతేడాది పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన కింద ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభమవుతున్నాయని చెప్పారు. కానీ గతేడాది మూల్యాంకనం రెమ్యూనరేషన్ ఇంకా అందలేదని అన్నారు. గత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కొత్తగూడెంలో మూల్యాంకన కేంద్రాన్ని ప్రారంభించామని సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు కూడా పాల్గొనేలా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల దామాషా ప్రకారం ఉపాధ్యాయులుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫీజులు రాక కాలేజీలు మూత పడే ప్రమాదం : వాణీదేవి

రాష్ట్రంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడం వల్ల కాలేజీలు మూతపడే ప్రమాదముందని బీఆర్‌ఎస్ సభ్యులు సురభి వాణీదేవి అన్నారు. రాష్ట్రంలో రూ.ఆరు వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఫీజులపై ఆధారపడి నడిచే జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలకు సకాలంలో ఫీజులు రాకపోవడంతో వాటిని నడపలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను చెల్లించాలని కోరారు.

దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

తీయకుండా కొంతకాలం ఇదే విధానం కొనసాగించాలనీ, నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆలోచన చేయకపోతే ప్రమాదం ఉందన్న స్పృహ వారికి కలగజేయాలని సీనియర్ నేత జానారెడ్డి అభిప్రాయపడ్డారు. ఒక సైంటిఫిక్ నిర్ణయం వచ్చే వరకు నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతానికి అనుగుణంగా దక్షిణాది రాష్ట్రాల్లోనూ సీట్ల సంఖ్య పెంచాలని సీపీఐ శాసనసభ పక్ష నేత కె.సాంబశివరావు, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓవైపు ఈ అంశంపై పోరాటం చేస్తూ మరోవైపు సైంటిఫిక్ పరిష్కారం కోసం రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు నిత్యం ఆలోచించాలని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ నియోజకవర్గాల పునర్విభజనపై జాతీయస్థాయిలో ఒక పాలసీని తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెడరల్ స్టేట్ అంటే ప్రతి రాష్ట్రానికి సమాన హక్కు ఉండాలనీ, నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం అభినందనీయమని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నేత హనుమేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతం ప్రకారం దక్షిణాదిలోనూ నియోజకవర్గాలు పెరగాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది ప్రాథమిక సమావేశమేననీ, రాబోయే రోజుల్లో విస్తృతంగా ఈ అంశంపై చర్చ, కార్యక్రమాలు చేపట్టాలని అఖిలపక్ష సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా ఆచరణలో పెట్టేందుకు సిద్ధమని సమావేశానికి హాజరైన పార్టీల నేతలు తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు హనుమేష్, సూర్యం, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సిహెచ్. బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బి. మహేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

ప్రధానితో తులసీ గబ్బర్డ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానంగా రక్షణ, సమాచార భాగస్వామ్య రంగాల్లో బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా 'అమెరికా జాతీయ నిఘా అధిపతిని కలవడం సంతోషంగా ఉంది. నేటి సమావేశంలో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింతగా వృద్ధి చేసుకునే మార్గలను చర్చించాం' అని రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తులసి గబ్బర్డ్ భారత్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో తులసీ గబ్బర్డ్ సమావేశమయ్యారు. జపాన్, థాయిలాండ్, ఫ్రాన్స్ వంటి బహుళ దేశాల పర్యటనలో భాగంగా భారత్‌లోనూ తులసీ పర్యటిస్తున్నారు. భారత్ నిర్వహిస్తున్న రైసినా డైలాగ్‌లో మంగళవారం ఆమె ప్రసంగించనున్నారు. అమెరికా నిఘా చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇది తులసీ గబ్బర్డ్ యొక్క రెండో విదేశీ పర్యటన. తన మొదటి విదేశీ పర్యటనలో భాగంగా తులసీ గబ్బర్డ్ గత నెలలో జర్మనీ వెళ్లారు. అక్కడ మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి 'సురవరం' పేరు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. శాసనమండలిలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతిపాదించగా, శాసనసభ, శాసనమండలిలో ఈ అంశంపై పలువురు సభలో మాట్లాడారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్, ఎంఐఎం, సీపీఐ దీనికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ వైతాళికుడన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టడం సముచితమని తెలిపారు. తెలుగు భాష పరిరక్షణ, వెట్టిచాకిరీ కోసమే 1930లో ఆంధ్రమహాసభ ఏర్పడిందనీ, అందులో సురవరం కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ మాత్రం ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలనీ, బదులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని ఆ పార్టీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ వ్యాఖ్యలను ఎంఐఎం సభ్యులు బలాల తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ సభ్యులు నాగరాజు మాట్లాడుతూ బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతోందనీ, పార్లమెంటులో అంబేద్కర్ చిత్రపటాన్ని బీజేపీ తొలగించిందనీ, గుజరాత్ సర్ధార్ వల్లభాయ్ స్టేడియానికి



మోడీ పేరు పెట్టారని విమర్శించారు. దీనిపై మండలిలో కాంగ్రెస్ సభ్యులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, బీఆర్‌ఎస్ సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం ఈ బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి.

భౌగోళిక ప్రాంతాన్ని ప్రతిబింబించేలా 'సురవరం ప్రతాపరెడ్డి పేరు' : రేవంత్‌రెడ్డి

భౌగోళిక ప్రాంతాన్ని ప్రతిబింబించేలా తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆయన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక ప్రాంతంలో ఉన్నవి ఆంధ్రా ప్రాంతానికి, తెలంగాణలో ఉన్నవి ఈ ప్రాంతానికి కేటాయించారని గుర్తు చేశారు. అందులో భాగంగా పేర్లు మార్చుకోవడం జరుగుతోందని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆంధ్రాకు వెళ్లిందనీ, తెలంగాణ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ నారాయణరావు పేరు పెట్టుకున్నారని తెలిపారు. దీనికి అర్థం ఎన్టీఆర్‌పై గౌరవం లేనట్టు కాదని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పేరును మార్చుకోవడంలో భాగంగా ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీకి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ పేరును పెట్టారని తెలిపారు. ఉద్యాన యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టారని తెలిపారు. కొత్తగా ఏర్పడిన యూనివర్సిటీలకు పేర్లు మార్చుకోవడం సహజమని అన్నారు. తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ నరసింహరావు పేరును, అదే కోణంలో తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం సముచితం అని తెలిపారు. తెలుగు యూనివర్సిటీకి ఆంధ్రాలో పొట్టి శ్రీరాములు పేరు కొనసాగుతోందన్నారు. ప్రతాపరెడ్డి సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణకు అసలు భాషనే లేదని వెక్కిరించిన రోజుల్లో ఆయన గోల్కొండ పత్రికను ప్రారంభించి కవులను ఏకతాటిపైకి తెచ్చి నడిపించారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సురవరం సేవలు మరువలేనివనీ, అందుకే ఆయన పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టడం సముచితమన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను ఎవరూ తక్కువ చేయడం లేదన్నారు. గాంధీ ఆదర్శాలతో ప్రాణత్యాగంతో మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన త్యాగం చేశారన్నారు. అదే సందర్భంలో తెలంగాణ వైతాళికులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆ యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలని కూనంనేని సాంబశివరావు గతంలో సూచించారని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. 2014 పునర్విభజన తర్వాత తెలంగాణకు కొన్ని సంస్థలు, యూనివర్సిటీలు వచ్చాయనీ, పరిపాలన, పాలనాపరమైన నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. ఆయన పేరును ఒక కులానికి ఆపాదించడం సరైందికాదన్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామని, అందుకోసం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి లేఖ రాస్తానన్నారు. బల్కంపేట్ నేచర్‌క్యూర్ ఆస్పత్రికి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రోశయ్య పేరు పెట్టడంతోపాటు అక్కడి సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని పెడతామని తెలిపారు. పేరు మార్పును రాజకీయం చేయడం తగదని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు విషయంలో మతపరమైన రాజకీయాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరైనవి కావని చెప్పారు.

రూ.70 వేల కోట్ల ఆదాయం తగ్గింది

(మొదటిపేజీ తరువాయి)

కంటే ముందే నేరాన్ని అంగీకరించి ముఖ్యమంత్రి అప్రూవర్‌గా మారారని ఎద్దేవా చేశారు. ఆదాయం పెంచే తెలివి రేవంత్ సర్కారుకు లేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి సీఎం విధానాలే కారణమని ఆరోపించారు. ఏడాది కాలంగా చేసిన నెగెటివ్ పాలిటిక్స్, అక్రమ నిర్బంధాలు, తెలంగాణను క్యాన్సర్ అంటూ రాష్ట్ర పరువు తగ్గించడం వంటి అడ్డమైన మాటల వల్లే తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

ఆర్థిక మాంద్యం, కోవిడ్ వంటి సంక్షోభం లేకుండానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చారని తెలిపారు. బడ్జెట్ కోత అంటే తాము ఇంతకాలంగా చేస్తున్న విమర్శలు నిజమని నిరూపితమైనట్టే అని వ్యాఖ్యానించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారిందని చెప్పారు. ఢిల్లీకి 40 సార్లు కాకపోతే సీఎం 400 సార్లు పోయినా తమకేమీ సమస్యలేదని కేటీఆర్ తెలిపారు. అయితే తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారు? అని ప్రశ్నించారు. తెలంగాణ వారికి నాయకత్వ లక్షణాలు లేవనీ, పాలన చేతకాదని సమైక్యాంధ్ర పాలకులు అన్న మాటలను రేవంత్ రెడ్డి పాలనతో నిజమే అని నిరూపిస్తున్నట్టుగా ఉందన్నారు. విదేశాల్లో 7 వేల మంది తెలంగాణ విద్యార్థులు ప్రభుత్వం చేసిన ఓవర్సీస్ స్కాలర్ షిప్పులకు సంబంధించిన అన్యాయంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

సీఎం రేవంత్ రెడ్డి ముఠా టీడీఆర్ స్కాం చేయబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీఆర్‌పై ముఖ్యమంత్రి మాట్లాడాలని నిలదీశారు. భూములు అమ్మకూడదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ధర్నాలు చేస్తుంటే రాహుల్‌గాంధీ ఇప్పుడెందుకు రావడం లేదని ప్రశ్నించారు. తనపై 15 కేసులు పెట్టిన రేవంత్‌రెడ్డికి ప్రజాస్వామ్య విలువలు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. రేవంత్‌కు ఈ రోజు కుటుంబం గుర్తుకు వచ్చిందా? తమపై దారుణమైన, అసహ్యకరమైన ఆరోపణలు, మాటలు మాట్లాడినప్పుడు మాకు కుటుంబాలు, ఫ్యామిలీలు లేవా? మాకు సంబంధాలు అంటగట్టినప్పుడు, మా పిల్లల్ని రాజకీయాల్లోకి లాగిన రోజు మీకు విలువలు లేవా? ఇప్పుడు ముఖ్యమంత్రి తన పిల్లలు, భార్య గురించి మాట్లాడుతున్నారు, మరి ఆ రోజు మాకు కూడా కుటుంబాలు ఉండేవి కదా? అని ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే యూట్యూబర్లు జర్నలిస్టులు కారా? అని నిలదీశారు. ఇదేనా జర్నలిస్టులకు రేవంత్ రెడ్డి ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. తాము నోరు విప్పితే సీఎం రేవంత్ రెడ్డికి ఇంట్లో అన్నం కూడా పెట్టరని హెచ్చరించారు. తాము కూడా సాగర్ సొసైటీ, మైహోం భుజ వ్యవహారాలు గురించి మాట్లాడగలమనీ, ఫొటోలు కూడా బయట పెట్టగలమనీ, రేవంత్ సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రయివేట్ కార్లపైన వివరాలు చెప్తామన్నారు. బీజేపీ సీనియర్ నేతలతో సీఎం రహస్యంగా సమావేశమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రం అప్పుల పాలైందంటూ చెప్పే సీఎం అందాల పోటీలతో ఏం సాధించాలనుకుంటున్నారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.46 కోట్లతో ఫార్ములా ఈ రేస్ పెడితే ఏం వస్తుందో చెబుతున్నా పట్టించుకోని సీఎం రూ.250 కోట్లతో అందాల పోటీలు ఎందుకు నిర్వహిస్తున్నారు? అని నిలదీశారు. ఆత్మహత్యలతో తల్లడిల్లుతున్న రాష్ట్రంలో అందాల పోటీలు సిగ్గుచేటు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డివి మన జాతిపిత గాంధీని చంపిన గాడ్సె మూలాలని కేటీఆర్ విమర్శించారు. అందుకే తెలంగాణ జాతిపిత లాంటి కేసీఆర్ పై చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కేటీఆర్ పై అనుచితంగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి అభినవ గాడ్సె అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీఏలు, పీఆర్సీ ఇవ్వలేమనడం

సమంజసం కాదు

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి : యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏను, 2023 జులై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని అడగొద్దనీ, అవి కావాలంటే నెలనెలా జీతాలే ఇవ్వలేమంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) తీవ్రంగా ఖండించింది. సీఎం హోదాలో ఉండి ఇలా ఇవ్వలేమనడం సమంజసం కాదని తెలిపింది. ఈ మేరకు యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదనీ వారికి న్యాయంగా రావాల్సిన బకాయిలను లేదా వారు దాచుకున్న సొమ్మును వారికి తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నారని స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మ్యానిఫెస్టోలో నిర్దిష్ట గడువుతో పలు సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేసింది. సగం మంది ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు మాత్రమే ప్రతి నెల మొదటి తేదీన వేతనాలను ఇస్తున్నదని తెలిపింది.

అది మినహా మరే సమస్య కూడా పరిష్కారం కాలేదని పేర్కొంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలలు సమయమిచ్చామనీ, ఈ కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, నూతన పథకాలకు వేల కోట్ల రూపాయలను కేటాయించి అమలు చేస్తున్నదని తెలిపింది. కానీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలు, బకాయిలకు డబ్బుల్లేవంటూ ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించింది. ఉద్యోగులు కూడా ప్రభుత్వంలో, ప్రజల్లోనూ భాగంగా ఉన్నారని పేర్కొంది. వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. ఐదు నెలల క్రితం ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులతో జరిపిన సమావేశంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కారం చేస్తామనీ, ఈలోగా ఆర్థిక భారం లేని సమస్యలను శాఖలవారీగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేసింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపింది. కానీ ఇప్పటివరకు ఏ శాఖ ప్రతినిధులతోనూ మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరగలేదని పేర్కొంది. ఆర్థిక, ఆర్థికేతర అనే తేడా లేకుండా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. ఈ ధోరణి ప్రభుత్వానికి మంచిది కాదనీ, సాధారణ ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తి తీవ్రమై పోరాటానికి దారితీసే అవకాశముందని హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాడ్ చేసింది.

సమస్యలు పరిష్కరించండి

- ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి
- పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వాలి : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నాలు, సమస్యలపై వినతిపత్రాలు

నవతెలంగాణ-విలేకరులు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలు జిల్లాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు నిర్వహించారు. వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు ఇవ్వాలని, గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం జిల్లా తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలుపరచకుండా కాలం వెళ్ళబుచ్చడంతో ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రేవంత్ రెడ్డికీ అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మాచర్ల భారతి పాల్గొన్నారు. కొమురం భీం జిల్లాలో వార్ధానదిపై ప్రాజెక్టుకోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కుమురం భీం ప్రాజెక్టు కాల్వల నిర్మాణం పూర్తిచేసి,



ఇప్పటికే నిర్మించిన కాలువలను పూడికలను తీయించాలని, వాట్టవాగు, ఎర్రవాగు, ప్రాజెక్టుల నుంచి పొలాలకు నీరందించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు.

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం కేసారం గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ పాల్గొన్నారు. సాగు రైతులకు పట్టాలివ్వాలని, గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు.తాండూరు మున్సిపల్‌లో తాగునీటి వసతి కల్పించడంతోపాటు డ్రయినేజీ వ్యవస్థను బాగు చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల సమీపంలో 96 మంది పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వారికి అప్పగించకపోవడంపై ఇబ్రహీంపట్నం లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ వెంకటమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఫిలిం సిటీలో పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని, ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతుల సమస్యలు పరిష్క రించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. సంగారెడ్డి జిల్లాలో మంజీరను మరో మూసీ చేయొద్దని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రాలు అందించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో పెంట్లవెల్లి మండలంలో ఇండ్ల స్థలాల కోసం సేకరించిన భూమిని పేదలకు పంచాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. దళితులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపురంలో రిజర్వాయర్‌కు రూ.500కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఎగవేతల భారతం

(మొదటిపేజీ తరువాయి)

బోర్డులు ఆమోదించిన విధానం ప్రకారం బ్యాంకులు నాలుగేండ్లు పూర్తయిన తర్వాత పూర్తి ప్రొవిజనింగ్ (కేటాయింపులు) చేసిన వాటితో సహా నిరర్థక ఆస్తులను రద్దు చేస్తాయని మంత్రి సీతారామన్ తెలిపారు. రుణాల తిరిగి వసూలుకు బ్యాంకులు వివిధ మార్గాలను అనుసరిస్తాయని తెలిపారు. సివిల్ కోర్టుల్లో దావా వేయడం, రుణ రికవరీ ట్రిబ్యునళ్లు, ఎన్‌సీఎల్‌టీ వంటి వాటిని ఆశ్రయించడం వంటి పద్ధతులను అనుసరిస్తాయని తెలిపారు. కాగా.. రద్దు చేసిన అప్పుల వల్ల రుణ గ్రహీతలకు ప్రయోజనం ఏమీ ఉండదని మంత్రి చెప్పడం కొసమెరుపు.

బీసీ బిల్లులకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

తరహాలో యావత్ తెలంగాణ ఒక్కటై కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. అవసరమైతే రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌లో కొట్లాడుదాం' అని పిలుపునిచ్చారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శాసనసభలో సోమవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రెండు వేర్వేరు బిల్లులపై సీఎం మాట్లాడారు. ఢిల్లీలో దీన్ని పట్టాలెక్కించే బాధ్యతను నేనే తీసుకుంటానని స్పష్టం చేశారు. అందుకు బీజేపీ నేతలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రధాని అపాయిమెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. "రాహుల్ గాంధీని కలిసి పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరుదాం. వారి సమయం తీసుకునే బాధ్యతను మా పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు అప్పగిస్తున్నా. అవసరమైతే రాజ్యాంగ సవరణ కోసం కొట్లాడుదాం. ఇప్పటి వరకు వంద సార్లకు పైగా రాజ్యాంగ సవరణ జరిగింది. దేశంలో కుల గణన సర్వే 1931లో జరిగింది. ఆ తర్వాత మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వారికి 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదు" అని సీఎం పేర్కొన్నారు. 2017లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు 37 శాతం రిజర్వేషన్లు కలించాలని శాసన సభ తీర్మానం చేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించిందని గుర్తు చేశారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఆ తీర్మానాన్ని ఉప సంహరించుకుంటున్నామని సీఎం తెలిపారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది.

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తాము కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించామని సీఎం తెలిపారు. ఆ క్రమంలో ఆయా వర్గాల రిజర్వేషన్లను పెంచేందుకు కులగణన చేపట్టి విజయవంతంగా పూర్తి చేసినట్టు వివరించారు. "దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో సర్వే పారదర్శకంగా జరిగింది .రెండు దఫాల్లో చేపట్టిన సర్వేలో 3,55,50,759 మంది వివరాలు అందించారు. అందులో బీసీల సంఖ్య 56.36 శాతంగా తేలింది. సభా నాయకుడిగా అసెంబ్లీలో నేను మాట ఇస్తున్నా. సర్వేలో పొందుపరిచిన బీసీల లెక్క వందశాతం సరైంది. 2024 ఫిబ్రవరి 4న సర్వే మొదలు పెట్టి 2025 ఫిబ్రవరి 4న పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్‌డేగా సభ ద్వారా తీర్మానించి నిర్ణయించాం. కులసర్వేలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. తెలంగాణ సమాజం బలహీన వర్గాల రిజర్వేషన్ల విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారనే సందేశం ఈ సభ ద్వారా పంపించాలనుకున్నాం. ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. శాసన సభలో ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో పాటు అన్ని పార్టీలు మాతో కలిసి రావాలి" అని సీఎం విజ్ఞప్తి చేశారు.

న్యాయపరమైన చిక్కులు లేకుండా చూడండి: బీఆర్‌ఎస్

బీసీ రిజర్వేషన్ బిల్లుకు న్యాయపరమైన చిక్కులు లేకుండా చూడాలని బీఆర్‌ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిల్లులకు వారు సంపూర్ణ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచినట్టు కాంట్రాక్టుల్లో కూడా బీసీలకు వాటిని అమలు చేయాలనీ, అందుకు సంబంధించిన అంశాన్ని బిల్లులో చేర్చాలని కోరారు. కేంద్రంతో సంబంధం లేకుండానే కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయవచ్చునని సూచించారు. మల్లన్నసాగర్, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో కొనసాగుతున్న పనుల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీలకు రూ. 20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జీవో 9,18లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ బీసీ రిజర్వేషన్ బిల్లుకు, కాంట్రాక్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సభ్యుల తీరు కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కులగణన చేయడం సాహసోపేతమైన నిర్ణయమని చెప్పారు. ఇంటింటి సర్వే సమగ్రంగా చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతర కులాల ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అందుతాయన్నారు.

రాష్ట్ర పరిధిలో ముందు రిజర్వేషన్లు అమలు చేయండి: కూనంనేని

రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేన్లు అమలు చేసేందుకు కృషి చేయాలని సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శాసనసభలో సోమవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రెండు వేర్వేరు బిల్లులపై సీఎం మాట్లాడారు. రిజర్వేషన్ల అమలు కేంద్రం పరిధిలో ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో తమ పరిధిలో ఉన్న అంశాలపై ముందుకెళ్లాలని సూచించారు. బీసీలకు తరతరాలుగా జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో తాము కలిసి నడుస్తామని కూనంనేని ప్రకటించారు. ప్రయివేట్ రంగంలో సైతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ల మాదిరిగా ఏబీసీడీ వర్గీకరణ చేయాలనీ, ఫలితంగా ఆయా కులాల్లో పూర్తిగా వెనకబాటుకు గురైన వర్గాలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లలో మహిళల వాటాను సైతం తేల్చాలని సూచించారు.

రిజర్వేషన్లకు బీజేపీ మతం రంగు: అక్బరుద్దీన్

రిజర్వేషన్లకు బీజేపీ మతం రంగు పులుముతోందని ఎంఐఎం శాసన సభాపక్ష నాయకులు అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శించారు. సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లులపై ఆయన మాట్లాడారు. హిందువుల రిజర్వేషన్లను ముస్లింలు లాక్కుంటున్నారని కొంత మంది చేస్తున్న వాదన సరికాదని చెప్పారు. ముస్లిం వర్గాల్లో కూడా బీసీలుంటారని స్పష్టం చేశారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 42 శాతం రిజర్వేషన్లకు తాము మద్దతిస్తున్నట్టు ప్రకటించారు. అలాగే ఎస్సీల రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి, ఎస్టీల రిజర్వేషన్లను 10 నుంచి 12 శాతానికి పెంచాలని సూచించారు. బీసీ బిల్లు చట్టబద్ధత కోసం తమ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి నడుస్తుందని పేర్కొన్నారు.

న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడండి: పాయల్ శంకర్

బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత విషయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ ప్రభుత్వానికి సూచించారు.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అప్పటి సర్కార్ తీసుకొచ్చిన ఉత్తర్వులను కోర్టు కొట్టేసిందని గుర్తు చేశారు. అలాంటి పొరపాట్లు తిరిగి ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ బిల్లుకు అసెంబ్లీలో బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ప్రకటించారు.

బీసీ కమిషన్‌ను అవమానించారు: కేపీ.వివేకా

. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కె.వివేకానంద మాట్లాడుతూ ఒకటే కమిషన్ రెండు సిఫారసులు చేస్తే కోర్టు కొట్టేసే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. అధ్యయనం పూర్తికాకముందే డెడికేషన్ కమిషన్‌ను నియమించి బీసీ కమిషన్‌ను అవమానించారని చెప్పారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం డెడికేషన్ కమిషన్‌ను నియమించిన మాట వాస్తవమేనని వివరించారు. గతంలో రాజీవ్‌గాంధీ బీసీ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడారని అన్నారు. కులగణన విషయంలో ఎన్నో అనుమానాలు ఉన్నాయని చెప్పారు. బీజేపీ మొదటి నుంచి బిల్లుకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈసందర్భంగా చర్చలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంచి ఉద్దేశంతో బిల్లును సభలో పెట్టామనీ, సలహాలు, సూచనలు ఉంటే ఇవ్వాలని అన్నారు. అనవసర చరిత్ర చెప్పొద్దని అభిప్రాయపడ్డారు. గత చరిత్రతో బీసీ బిల్లుకు సంబంధం లేదన్నారు. మంత్రి సీతక్క చర్చలోకి వస్తూ పదేండ్ల తర్వాత బీఆర్‌ఎస్ చరిత్ర గురించి మాట్లాడుతున్నదన్నారు. ఏదైనా చేస్తే చిత్తశుద్ధితో చేయాలని సూచించారు. పొద్దున బిల్లుకు ఆమోదం తెలిపి సాయంత్రం అపరిచితులు అయ్యారని అభిప్రాయపడ్డారు

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చలోకి వస్తూ రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేయాలని చెప్పారు. ఈ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 50 రోజుల్లో చేపట్టామని చెప్పారు. భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలు కులగణన చేయాల్సి వస్తే, మన రాష్ట్రాన్ని మోడల్ తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. గతంలో కేంద్రానికి పంపిన అనేక తీర్మానాలు శాస్త్రీయంగా లేకపోవడంతో వీగిపోయాయని గుర్తుచేశారు. శాస్త్రీయంగా జరిగిన కులగణన సర్వే బీసీలు 50:36 శాతం ఉన్నారన్నారు. ఈ సంఖ్య ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని సభలో తీర్మానాన్ని పెట్టామని చెప్పారు.

న్యాయపరమైన చిక్కుల్లేకుండా చూస్తాం : మంత్రి పొన్నం

బిల్లులపై వివిధ పార్టీల సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ వీటికి సంబంధించి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం,తోపాటు 15 మంది మాట్లాడారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడానికి బిల్లుకు మద్దతు తెలిపిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం సైతం ఈ బిల్లులు మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. దేశానికి రోల్ మోడల్ తెలంగాణ అని గుర్తు చేశారు. వెనుకబడిన తరగతుల ఈజీగా తీసేసే నుంచి దేశానికి వెన్నెముక అనే స్థాయికి వచ్చిందన్నారు. భారత్‌జోడో యాత్రలో రాహుల్‌గాంధీ జిత్న ఆజాదీ ఉత్నా ఇస్సేదారి అని చెప్పినట్టుగా కులగణన చేపట్టామన్నారు. రాజకీయ పార్టీగా 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ తొలగించాలని అన్నారు. దీనికి సంబంధించిన ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. జనవరి 12, 2019న 50 శాతం కోటాను అధిగమిస్తూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రం అవకాశం కల్పించిందన్నారు. 76 రాజ్యాంగ సవరణ ద్వారా తమిళనాడులో 68 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని గుర్తు చేశారు. న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ముందుకుపోతున్నామన్నారు. పక్కా ఆధారాలతో కేంద్రం దగ్గరకు వెళ్తున్నామని చెప్పారు. 1994 చట్టం ప్రకారం రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందుకే సీఎం, ప్రధాని మోడీ అపాయింట్‌మెంటును అడుగుతున్నారని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు ఒకే గొంతుకగా ఢిల్లీ వెళ్దామని వివరించారు. స్వయంగా ముఖ్యమంత్రే వస్తా అని అంటున్నారని చెప్పారు. దేశంలోనే మనది చిన్న రాష్ట్రమనీ, ఇక ముందు నుంచి దిక్సూచీ అని చెప్పారు. బీజేపీకి ఇది శీల పరీక్ష లాంటిదన్నారు. చారిత్రాత్మక బిల్లుకు కేంద్రం మద్దతు తెలపాలని కోరారు. అనంతరం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఈ బిల్లులను ఆమోదించారు. ఆ తర్వాత సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ఔరంగజేబు సమాధి వివాదంతో ఉద్రిక్తం

నాగ్‌పూర్‌లో పోలీసులపై రాళ్లు..అనేక వాహనాలు దహనం

భయాందోళనలో స్థానికులు



నాగ్‌పూర్ : ఔరంగజేబు సమాధిపై వివాదం మధ్య.. సోమవారం సాయంత్రం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని మహల్ ప్రాంతంలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణ చెలరేగింది.ఒక వర్గం పోలీసులపై రాళ్లు రువ్వింది. దీని తరువాత పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఈ సమయంలో దుండగులు అనేక వాహనాలకు నిప్పు పెట్టారు. రాళ్లు రువ్వారు, ప్రజా ఆస్తులను ధ్వంసం చేశారు. దీని కారణంగా స్థానిక ప్రజల్లో భయాందోళనలు వ్యాపించాయి. రాళ్ల దాడిలో చాలా మంది పోలీసులు కూడా గాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ఎలాంటి పుకార్లకు ప్రాధాన్యత ఇవ్వవద్దని ఫడ్నవీస్ సర్కార్ కోరింది.

అసలేం జరిగింది..?

నాగ్‌పూర్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది, రాళ్ల దాడిలో అనేక మంది పోలీసులు గాయపడ్డారు. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ సహా కొన్ని హిందూ సంస్థల సభ్యులు నిరసన సందర్భంగా మతపరమైన సందేశాలు రాసిన వస్త్రాన్ని తగలబెట్టారని ముస్లిం సంస్థలు చేసిన ఆరోపణల నేపథ్యంలో హింస జరిగింది. శంభాజీనగర్‌లోని మొఘల్ పాలకుడు ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన జరిగింది. పరిస్థితిని అదుపు చేయడానికి స్థానిక యంత్రాంగం అదనపు పోలీసు బలగాలను మోహరించింది . ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసింది.

ఇంటి నుంచి బయటకు వెళ్లకండి: నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్

ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని, పోలీసులు అనుమానితులను గుర్తించి అరెస్టు చేస్తున్నారని నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవీంద్ర సింగల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఫోటో దహనం జరిగిన సంఘటన తర్వాత ప్రజలు గుమిగూడారని ఆయన చెప్పారు. అతను తన ఫిర్యాదును నమోదు చేశాడు, దానిపై మేము వెంటనే చర్య తీసుకున్నాము. అని వివరించారు. ఈ విషయంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

పీఎంశ్రీ మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను రద్దు చేయాలి



- ఎన్‌ఈపీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీల 48 గంటల మహాధర్నా
- కేంద్రం నిర్ణయాలు రాష్ట్రంలో అమలు చేయడంపై ఆగ్రహం



నవతెలంగాణ -విలేకరులు

"ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ అంగన్‌వాడీ మొబైల్ సెంటర్స్‌ను ఉపసంహరించుకోవాలి.. మాతా, శిశు సంరక్షణలో, పౌష్టికాహారం అందజేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం తెరలేపింది. కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలనుకోవడం దుర్మార్గం. ఎన్ఇపీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి" అంటూ అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట 48 గంటల మహాధర్నా చేపట్టారు. అక్కడే వంటావార్పు చేశారు. వీరికి సీపీఐ(ఎం), పలు ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి.

పెద్దపల్లి, జగిత్యాల ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాల ద్వారా ఐసీడీఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి చర్చించి, బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని తెచ్చిందని, ఇది అమలు జరిగితే ఐసీడీఎస్ మూతపడే పరిస్థితి వస్తుందని, అందుకే ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్రం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేయాలని చూడటం అన్యాయం అన్నారు. ఎన్ఇపి చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ గత ప్రస్తుత ప్రభుత్వాల హామీలు, కోర్టు తీర్పులు గ్రాట్యుటీ, పర్మినెంట్ చేయడం వంటివి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నాలో జిల్లాలోని 7 ప్రాజెక్టుల నుంచి సుమారు వెయ్యి మంది అంగన్‌వాడీలు తరలివచ్చారు. ఈ ధర్నాకు ప్రజా సంఘాలు, సీపీఐ(ఎం) సంఘీభావం తెలిపాయి. మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల కలెక్టరేట్ల ఎదుట 48 గంటల ధర్నా ప్రారంభించారు. మొబైల్ అంగన్వాడీ కేంద్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో 48 గంటల మహాధర్నా ప్రారంభించారు. మంచిర్యాలలో సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులు, హమాలీ, మున్సిపల్ కార్మికులు మద్దతు తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సునీత పాల్గొన్నారు. నిజామాబాద్‌లో ధర్నా చౌక్‌లో, కామారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. కాగా కామారెడ్డిలో అంగన్‌వాడీల ఆందోళనలకు ఐసీడీఎస్ పీడీ, సీడీపీవోలు మద్దతు తెలిపారు.

నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రిటైర్డ్ అయిన టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ముందు మహాధర్నా చేపట్టారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట భారీగా అంగన్‌వాడీలు తరలివచ్చి ధర్నా చేపట్టారు. మంగళవారం కూడా కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు విష్ణు తెలిపారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌ని పర్మినెంట్ చేయాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం, మణుగూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు.

మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డిపై

వల్లభ మిల్క్ సిబ్బంది దాడి

- గ్రామస్తులు-కంపెనీ సిబ్బందికి మధ్య ఘర్షణ
- పరిశ్రమను తనిఖీ చేసి నీటి నమూనాలు సేకరించిన పీసీబీ అధికారులు

నవతెలంగాణ- చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డిపై వల్లభ మిల్క్ ప్రొడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ సిబ్బంది దాడి చేశారు. పీసీబీ అధికారులు పరిశ్రమను తనిఖీ చేసి నీటి నమూనాలు సేకరించిన సమయంలో గ్రామస్తులు, సిబ్బందికి మధ్య ఘర్షణ తలెత్తింది. వివరాలిలా ఉన్నాయి.. చౌటుప్పల్ మండలం, దండుమల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోనివల్లభ మిల్క్ ప్రొడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై సోమవారం పీసీబీ అధికారులు తనిఖీ కోసం వచ్చారు. ఈ క్రమంలో మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, తూప్రాన్‌పేట గ్రామ మాజీ సర్పంచ్ చక్రం జంగయ్య, సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు బొజ్జ బాలయ్య కంపెనీ వద్దకు సమాచారం కోసం వెళ్లారు. లోపలికి వెళ్తుండగా కంపెనీ సిబ్బంది, అక్కడే ఉన్న ఇద్దరు పోలీసులు వారిని అడ్డుకున్నారు. సర్దిచెప్పి కంపెనీలోకి వెళ్దామనుకున్న ఆ ముగ్గుర్ని అడ్డగించడంతో పోలీసుల సమక్షంలోనే తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. కంపెనీ సిబ్బంది కానిస్టేబుల్ ప్రోద్బలంతో వారిపై దాడిచేశారు.

అసంఘటితరంగ కార్మికుల హక్కుల సాధన సీఐటీయూతోనే సాధ్యం



- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు
- సీఐటీయూలో చేరిన 250 మంది బార్దాన్ కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసంఘటిత కార్మికులైన బార్దాన్ కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని, వారి హక్కుల కోసం పోరాడుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు నూర్జహాన్, రమేశ్‌బాబు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 250 మంది బార్దాన్ కార్మికులు సోమవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా వారికి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అనుసరించే విధానాల వల్ల నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పేద ప్రజలకు మాత్రం ఉపాధి అవకాశాలు లేక సరైన కూలి దొరకక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు. మరొకవైపు కార్మికులకు కనీస వేతనాలు అమలు జరపటంలో, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందటంతో పాటు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఫలితంగా దశాబ్దాల తరబడి కనీస వేతనాల సవరణ అనేక రంగాల్లో జరగటం లేదని తెలిపారు. తమ హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాడితేనే కొన్ని సమస్యలైనా పరిష్కారం అవుతున్నాయని స్పష్టంచేశారు. అసంఘటిత కార్మికులైన బార్దాన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం కూలి రేట్ల పెంపుదల కొరకు యాజమాన్యాలు దిగిరావాలని, కార్మికులందరూ ఐక్యం వర్ధల్లాలి అంటూ నినాదించారు. ఈ కార్యక్రమంలో బార్దాన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి ఇమామ్, నాయకులు విజయ్, రాజు, గంగాధర్, భాస్కర్ తదితరులతో పాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మీతో ఫోటో దిగడానికి భయం లేదు

జానారెడ్డితో కేటీఆర్ సరదా సంభాషణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం ముగియగానే కాంగ్రెస్ సీనియర్ నేత కే జానారెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే తారకరామారావు (కేటీఆర్) ఆయనకు తారసపడ్డారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ సరదాగా మాట్లాడుకున్నారు. 'మీ ఆరోగ్యం ఎలా ఉంది..' అని కేటీఆర్ జానారెడ్డిని అడిగారు. 'నా ఆరోగ్యం బాగుంది.. నా ఏజ్ ఎంత ఉంటుందో మీకు తెలుసా..' అని జానారెడ్డి అడగ్గా.. '70 ఏండ్లకుపైగా ఉండొచ్చనుకుంటున్నా..' అని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. జానారెడ్డి స్పందిస్తూ.. 'కాదు.. నాకు 79 ఏండ్లు పూర్తయ్యాయి.. ' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. ఆ సందర్భంగా 'మా జానారెడ్డితో ఫొటో దిగడానికి భయం లేదు..' అంటూ ఆయనతో కలిసి కేటీఆర్ ఫొటో దిగారు. ఈ సరదా సంఘటనను అక్కడి వారు ఆసక్తిగా గమనించారు.



ఖరీదైన ఐ ఫోన్స్ స్మగ్లింగ్

- శంషాబాద్‌లో పట్టుబడ్డ ఐదుగురు మహిళలు
- 10 ఐఫోన్లు స్వాధీనం
- ఒక్కో ఫోన్ విలువ సుమారు రూ.90 వేలు
- నిందితులపై కేసు నమోదు, దర్యాప్తు

నవతెలంగాణ-శంషాబాద్

విదేశాల నుంచి ఖరీదైన మొబైల్ ఫోన్లను స్మగ్లింగ్ చేస్తూ ఐదుగురు మహిళలు పట్టుబడిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం జరిగింది. ఎయిర్‌పోర్టు అవుట్ పోస్ట్ ఎస్‌హెచ్‌ఓ జె.బాలరాజ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ జరిగింది. స్మగ్లింగ్‌కు సంబంధించిన వివరాలను శంషాబాద్ ఏసీపీ కేఎస్ రావు మీడియాకు వెల్లడించారు. యూఏఈలోని రాస్‌అల్ ఖైమా నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి ఉదయం 7:30 గంటలకు ఐదుగురు మహిళలు చేరుకున్నారు. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు ఎయిర్‌పోర్టులోని ఎగ్జిట్ వద్ద పోలీసులు నిఘా ఉంచారు. అనుమానం ఉన్న ఐదు మంది మహిళలు రిజ్వానా బేగం, సబాఖన్నం, ఓమర్ బేగం, సురియా ఖన్నం, లహియా ఉన్నిసాలను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో అత్యంత ఖరీదైన అయిన టాప్ మోడల్ 10 ఐఫోన్ 16 ప్రో మాక్స్ గోల్డ్ కలర్ మొబైల్స్‌ను గమనించి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించిన పోలీసులకు మొబైల్‌లకు సంబంధించిన ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఒక్కో మొబైల్ రూ.90 వేలకుపైగానే ఉంటుందని తెలుస్తోంది. నిందితులను అరెస్టు చేసి క్రైమ్ నెంబర్ 243/2025, 318 (ఏ) 112 (1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏసీపీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్
- కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ- మహబూబ్‌నగర్

నీరు అందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. హన్వాడ మండలంలోని పలు గ్రామాల్లో వరి, టమాట, వంకాయ, పశు గ్రాసం తదితర పంటలు సాగు చేయగా.. నీరందక వందల ఎకరాల్లో పైర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పంటలను పరిశీలించి.. రైతులతో మాట్లాడినట్టు చెప్పారు. యారోన్‌పల్లి, తిరుమలగిరి, మునిమోక్షం, అమ్మాపూర్, అంబటోనిపల్లి, కొనగట్టుపల్లి గ్రామాల్లో గతేడాది సాగు చేసిన విస్తీర్ణంలోనే ఈసారి కూడా వేసినట్టు రైతులు చెప్పారని అన్నారు. కానీ ఈ సంవత్సరం బోరు బావులు ఎండిపోయి నీరు అందించడం లేదన్నారు. సాగుకు ఎకరాకు 20వేల నుంచి 30 వేల రూపాయల వరకు ఖర్చు చేశామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. పెట్టుబడిలో సగం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. పంటలను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి రైతుల వద్దకు పంపించాలని, ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటకు ఎకరాకు 50వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. మరికొన్ని గ్రామాల్లో పశుగ్రాసం కోసం సాగు చేసుకున్న జొన్న పైరు కూడా ఎండిపోయిందని, కూరగాయలు పండించే రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం గతంలో ప్రకటించిన పెట్టుబడి సాయం కూడా వెంటనే రైతులందరికీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, నాయకులు ఎ.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ ఏడుగురి ఆచూకీ ఎప్పుడు?

- నిర్విరామంగా శ్రమిస్తున్న రెస్క్యూ టీమ్‌లు
- ఇంకా ఉబికి వస్తున్న నీరు, పడుతున్న మట్టి

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి నేటికి 24 రోజులయింది. సొరంగంలో రెస్క్యూ టీమ్‌లు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నా.. ఏడుగురు కార్మికుల ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదు. మరోవైపు మిగతా కార్మికులు, సహాయ బృందాలు ప్రాణం అరచేతిలో పెట్టుకుని సహాయక చర్యల్లో వెనుకడుగు వేయకుండా శ్రమిస్తున్నాయి. సొరంగంలో కార్మికులను కాపాడటం కోసం రెస్క్యూ టీం చేయని ప్రయత్నం లేదు. సొరంగంలో చిక్కుకుని ప్రాణం కోల్పోయిన ఇంజినీర్ గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని వారం రోజుల కిందట బయటకు తీశారు. మిగిలిన ఏడుగురి ఆచూకీ ఇప్పటి వరకు తెలియలేదు. కొద్ది రోజులు మంత్రులు హడావిడి చేసినా ఆ తర్వాత సమీక్షలు లేవు. అధికారులు చేస్తున్నారు. ఉబికి వస్తున్న నీటి ఊట, పైనుంచి కూలుతున్న మట్టి తవ్వకాలకు ఆటంకంగా మారుతున్నాయి. అయినా రెస్క్యూ సిబ్బంది ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని సహాయక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా 14వ కిలోమీటర్ చివరి పాయింట్ దగ్గర 20 మీటర్ల మట్టి దిబ్బ ఉంది. అక్కడే టీబీఎం మిషన్ మట్టిలో కూరుకుపోయింది. ఆ మట్టి తొలగిస్తే.. పై భాగం పడిపోయే ప్రమాదం ఉంది. అక్కడ రోబో మిషన్, యంత్రాలు తప్ప కార్మికులు పనిచేయడం కష్టంగా మారింది. రోబోలు, యంత్ర పరికరాల ద్వారా పనిచేయడానికి సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. చివరి వరకు కన్వేయర్ బెల్ట్ లేకపోవడం, టీబీఎం మిషన్ ఆటంకంగా ఉంది.

కుటుంబ సభ్యుల విలవిల

బాధిత కుటుంబ సభ్యులు తమ బిడ్డల కోసం సొరంగం దగ్గర ఎదురు చూస్తున్నారు. కనీసం ప్రాణంతో కాకున్నా మృతదేహాలను అయినా అప్పగించాలని కోరుతున్నారు. మరో వారం రోజులయినా కార్మికుల ఆచూకీ తెలిసే పరిస్థితులు లేవంటున్నారు అధికారులు. దీంతో తమ వారి ఆచూకీ, కడసారి చూపుకోసం పడిగాపులు కాస్తున్నారు.

ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి



- రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలుచేసేలా ఈ అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలి
- ఆశా వర్కర్ల సమస్యలపై తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాలు

నవతెలంగాణ-విలేకరులు

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా డీఓంహెచ్ఓకు యూనియన్ రాష్ట్ర నాయకులు జయలక్ష్మి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో ఫిక్స్‌డ్ వేతనం, రూ.18వేలు ప్రకటించాలని, ఇతర హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్, హుజురాబాద్, జమ్మికుంట మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేసి, అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్, జోగిపేట, వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లా శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక, దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్, కందుకూరు మండలకేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆశావర్కర్లు ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. చిట్యాల, చండూరు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాంపల్లిలో తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీకి వినతి పత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో మండల వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో ఒక రోజు దీక్ష చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చర్ల, బూర్గంపాడులో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. చంద్రుగొండలో తహసీల్దార్ సంధ్యారాణికి, మెడికల్ ఆఫీసర్ తనుజాకు వినతి పత్రాన్ని అందజేశారు. జోగులాంబ గద్వాల జిల్లా దరూరు మండల కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.



ఎన్టీఆర్ స్టేడియంలో దారుణం

అప్పుడే పుట్టిన ఆడ శిశువు సజీవ దహనం!

నవతెలంగాణ - ముషీరాబాద్

ఏ తల్లి కన్నదో తెలియదు.. పురిట్లోనే తల్లి ఒడికి దూరమైంది.. పుట్టిన వెంటనే ఆడ శిశువును గుర్తుతెలియని దుండగులు నిప్పంటించి తగులబెట్టారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం జరిగింది. దోమలగూడ ఏసీపీ రాఘవేంద్ర, సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఎన్టీఆర్ స్టేడియంలో చెత్త తరలించే వాహనాల పక్కన అప్పుడే పుట్టిన ఆడ శిశువుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటల్లో కాలి శిశువు మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రంగంలోకి దింపారు. వారు ఆధారాలను సేకరించారు. బతికుండగానే శిశువును కాల్చేశారా..? మృతిచెందిన శిశువును ఇక్కడికి తీసుకొచ్చి తగులబెట్టారా..? అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలి

తెలంగాణ చేతి వృత్తిదారు సమన్వయ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం కో కన్వీనర్ పైళ్ల ఆశయ్య, సభ్యులు పల్లపు విగ్నేష్, చెన్నారం మల్లేశ్, గుమ్మడిరాజే నరేశ్, మరియాల గోపాల్ తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్‌విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో అనంతరాములు కమిషన్ సిఫారసుల మేరకు అమలవుతున్న వర్గీకరణను స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లు కూడా వర్గీకరణ ఉండాలని డిమాండ్ చేశారు. అత్యంత వెనుకబడ్డ సేవ, సంచార, వృత్తి కులాలు గ్రామ (వార్డ్ మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మెన్లు మున్సిపల్ చైర్మెన్లు , కౌన్సిలర్లు,)100 కులాలపైగా అవకాశాలు రాకుండా పోయారని తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఉప వర్గీకరణ చేస్తామని ప్రభుత్వమిచ్చిన వాగ్దానాలు అమలకు అసెంబ్లీలో తీర్మానించాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్ మండిలో ఖరీదుదారుల కుమ్మక్కు

- క్వింటా పసుపునకు రూ.8 వేలే
- మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌లో రూ.13 నుంచి 14 వేలు
- కేంద్రంతో మాట్లాడి పసుపు ఎమ్ఎస్‌పీ రూ.15వేలు చేయాలి : ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిజామాబాద్ మండిలో ఖరీదుదారులు కుమ్మక్కు అయ్యారనీ, దీంతో క్వింటా పసుపు ధరను రూ.8వేలు నిర్ణయించి రైతులను దోపిడీ చేస్తున్నారని శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి సభా దృష్టికి తీసుకొచ్చారు. కొందరు అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. క్వింటా పసుపు పంటకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.3 వేలు అదనంగా ఇవ్వాలని కోరారు. సోమవారం అసెంబ్లీ జీరో అవర్‌లో 8 నియోజకవర్గాల పసుపు రైతుల సమస్యను ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. పక్కనే మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు రైతులు పసుపు పంటను తీసుకెళ్తే క్వింటాకు రూ.13 వేల నుంచి రూ.14 వేలు దక్కుతున్నదని చెప్పారు. ఒక్కో క్వింటాపై ఐదారు వేల రూపాయల వ్యత్యాసమేంటని ప్రశ్నించారు. నిజామాబాద్ మండిలో సరుకు తేగానే కొనకుండా రెండు, మూడు రోజులు నాన్చి రైతులను ఇబ్బంది పెడుతున్నారనీ, సిండికేట్ అయ్యి ధరను తెగ్గోస్తున్నారని వాపోయారు. దీనిపై రాజకీయాలకతీతంగా రైతులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే తమ పంటకు ఎక్కువ ధర లభిస్తుందనే రైతుల ఆశ అడియాశే అయ్యిందన్నారు. పసుపు బోర్డు లేనప్పుడు క్వింటా పసుపు ధర రూ.16 వేలు పలికిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడి క్వింటా పసుపు పంటకు ఎమ్ఎస్‌పీ ధర రూ.15 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
మంగళవారం | మార్చి 18, 2025 | www.navatelangana.com

దాహం తీర్చేందుకు చలి వేంద్రాలు దోహదపడతాయి

రాచకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ సర్వర్ అహ్మద్



నవతెలంగాణ-నాగోల్

వేసవిలో దాహం తీర్చుకునేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లలో బస్‌స్టాప్ లలో స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని రాచకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ సర్వర్ అహ్మద్ అన్నారు. రావుస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ వారి సౌజన్యంతో నాగోల్ చౌరస్తా బస్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్ర కేంద్రాల ఏర్పాటుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. రావుస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రావుస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఈవో డాక్టర్ కేవీ రావు, ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ మల్లారెడ్డి, కురుంపల్లి యాదయ్య హాజరై ఆర్ టీ జీ సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సమరస్యానికి ప్రతీకలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్ పూర్ ఖుతుబ్ షాహీ మస్జీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలలో ఉన్న ధనవంతులు తమ ధనంలోని కొంత భాగాన్ని పేదలకు దానం చేస్తారని అన్నారు. ఈ విధానాన్ని అన్ని వర్గాల ప్రజలు అమలు చేస్తే పేదరికం నిర్మూలన చేయటం సులభమవుతుందన్నారు. ముస్లింలు తాము సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు సహాయం చేయాలని ఖురాన్‌లో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అఫ్జల్, ముస్లిం పెద్దలు, నాయకులు సయ్యద్ మొయిజ్, షాకేబ్, మొహమ్మద్ సల్మాన్, మొహమ్మద్ రియాజ్ యువకులు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలి

- సీఐటీయూ సౌత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్

నవతెలంగాణ - ధూల్‌పేట్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ సౌత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. వేతనం, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ యాకుత్పురా, మలక్‌పేట్ జోన్ కమిటీల ఆధ్వర్యంలో సైదాబాద్ ఎమ్మార్వో ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేల ఇవ్వాలని, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మెతో ప్రభుత్వానికి తెలిపారని గుర్తు చేశారు. సమ్మె సందర్భంగా 2023 అక్టోబర్ 9న హైదరాబాద్ కోఠి కమిషనర్ ఆఫీస్ ముందు వేలాదిమంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహిస్తే ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు సీఐటీయూ అనుబంధంగా ఉన్న ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపారన్నారు. ఆ సమయంలో కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యల



పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని, వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. డైరెక్టర్ హామీ ప్రకారం అక్టోబర్ 9న ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను విరమించారన్నారు. వీటితోపాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందని విమర్శించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని 2024 ఫిబ్రవరి 9న జూలై 30న డిసెంబర్ 10న ఆరోగ్యశాఖ కమిషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నాలు చర్చల సందర్భంగా కమిషనర్లు స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని మట్టి ఖర్చులు రూ.50 వేల ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని, నిర్దిష్టమైన హామీలు ఇచ్చిన నేటికీ అవి అమలు కావడం లేదని విమర్శించారు. ఇతర సమస్యల పైన ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపి మరిచిపోయారని ఎద్దేవా చేశారు. స్పూటం డబ్బాలు మోయటం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినా ఇతర సమస్యలు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుండి నేటి వరకు ఈ ఏడాది కాలంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 రోజులు బస్సుజాత నిర్వహించామన్నారు. నిరంతరం అనేక ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అశాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, ఎన్.చంద్రకళ, పి. పుష్పలత పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-ఎల్బీనగర్

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దళితుల జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగాలని, చేవెళ్ల డిక్లరేషన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని తీర్మానం చేశారు.

1) విద్యా జ్యోతి పథకం : ద్వారా ఈ పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలి. కేజీ టూ పీజీ వరకు ఉచితంగా ఇవ్వాలి.

2) వైద్యం: ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించి నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా ఇవ్వాలి.

3) ఉద్యోగం ఉపాధి అవకాశాలు: ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ వెయ్యాలి. అలాగే బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయాలి. ఉద్యోగం లేని వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

4) అంబేద్కర్ అభయ హస్తం: ఈ పథకం ద్వారా ప్రతి ఎస్సీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందజేయాలి.

5) ఇందిరమ్మ ఇల్లా ఇందిరమ్మ పక్క ఇళ్ల పథకం ఈ పథకం ద్వారా ఇండ్లు లేని ప్రతి దళిత కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కొరకు రూ.750000 కేటాయించాలి.

6)భూమి పథకం ఈ పథకం ద్వారా భూమిలేని దళితులకు భూమి పంపిణీ చేయాలి అన్నారు.

7) ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మాల, మాదిగ, ఎస్సీ కుటుంబాలకు కొత్తగా మూడు ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది ఒక్కొక్క కార్పొరేషనుకు రూ.1000 కోట్ల నిధులను కేటాయించాలి.

8) ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు ప్రభుత్వ వ్యవస్థలను ప్రయివేటుపరం చేసినప్పుడు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.

9)ఎస్సీ సబ్ ప్లాన్ రిజర్వేషన్లు, ప్రత్యేక నిధులు తదితర వాటిని సమగ్రంగా అమలు చేస్తే దళితుల బతుకులు కొంతైనా బాగుపడతాయని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు.

చేనేత వస్త్రాలు ధరించి నేతన్నకు అండగా నిలుద్దాం

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ- నాగోల్

చేనేత వస్త్రాలను ధరించి నేతన్నకు అండగా నిలుద్దామని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చేనేత కళలను ప్రోత్సహించడానికి ప్రతి సోమవారం చేనేత వస్త్రాన్ని ధరించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా అనుసరిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ వస్త్రాలు చేనేత కార్మికుల కళా నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ, వారి నాణ్యమైన పని తీరును కనబరుస్తూ.. ఎంతో సౌకర్యంగా ఉంటాయని తెలిపారు.

అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-చంపాపేట్

సీఐటీయూ చంద్రయన్‌గుట్ట జోన్ కార్యదర్శి ఎస్. కిషన్, హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు మీనా అన్నారు. సోమవారం అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐసీడీఎస్ ప్రారంభమై 50 ఏండ్లు అవుతుందన్నారు. ఐసీడీఎస్ సేవలు అనేక మన్ననలు పొందాయని, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌లకు పర్మినెంట్ చేయాలని సుప్రీం కోర్టు, గుజరాత్ హైకోర్టు సూచించాయని తెలిపారు. సమస్యను పరిష్కరించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తన బాధ్యతను నిర్వహించడం లేదన్నారు. పేదలకు, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ నష్టం కలిగించేలా ఐసీడీఎస్‌ను ప్రయివేటీకరణ చేయాలని చూడడం దారుణం అన్నారు. దీన్ని సీఐటీయూ ఖండిస్తుందని తెలిపారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూడటం అన్యాయం అన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలతో పీఎం శ్రీ పథకం కింద ప్రైమరీ కేంద్రాలను 28 జిల్లాల్లో 56 కేంద్రాల్లో ప్రారంభించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. ఈ నిర్ణయం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే చర్య తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్రంలో మొబైల్ అంగన్వాడీ సేవల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తెరపైకి తెస్తుందన్నారు. ఇది కూడా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే చర్యలే అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పీఎం శ్రీ పథకాన్ని పూర్తిగా రద్దు చేసి ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 18 వేల వేతనం పెంచాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు పక్క భవనాలు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. బీఎల్ఓ డ్యూటీ రద్దు చేయాలన్నారు. ఐసీడీఎస్‌తో సంబంధం లేని పనులను చేయించకూడదని కోరారు. కారణ్యా నియమకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌లకు ఆసరా పెన్షన్ సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ గోడ పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ చంపాపేట్

ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికుల చలో పార్లమెంటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా పిలుపు మేరకు సోమవారం పాతబస్తీలో గోడ పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎల్. కోటయ్య మాట్లాడుతూ... హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో చాలా ఎక్కువ మంది డ్రైవర్లు, క్లీనర్లు, మెకానికులు ఇలా ట్రాన్స్‌ఫోర్ట్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని అలాంటి వారికి ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు 2019 మోటార్ వాహన చట్టాన్ని డ్రైవర్లకు అనుకూలంగా మార్చాలని, కార్పొరేట్ శక్తులను ట్రాన్స్‌ఫోర్ట్ రంగంలోకి రాకుండా, నిలువరించాలన్నారు. ట్రాన్స్‌ఫోర్ట్ రంగంలో డీసీఎంలు, క్యాబ్‌లు, టాక్సీలు, లారీలు, మినీ బస్సులు, హెవీ బస్సులు, బుల్డోజర్లు, జేసీబీలు, పెద్ద పెద్ద క్రేన్ మిషన్లు, నడుపుతూ ఉపాధి పొందుతున్న వాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందటం లేదని తెలిపారు. ఇంటి అద్దెలు, వాహన రిపేరు, చార్జీలు, ట్రాఫిక్ పోలీసుల చాలానాలు, ఫీజులు, వంటి వాటితో పాటు టోల్ టాక్సీలు, పెట్రోలు, డీజిల్, వంటి ఇంధనాల ధరలు రోజురోజుకు పెరడంతో దారుణం అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నెల 24 చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి నాగేశ్వర్, ఎండీ వాహద్, అబ్దుల్ జాబే, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-దిల్‌సుఖ్ నగర్

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రజా సేవకులు యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదానం పూర్ణాహుతి, మూలమంత్ర, మన్యుసూక్త హెూమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారిణి ఉమారాణి, జగిని రమేష్, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ కుంచారపు సురేంద్ర కుమార్, సాయి కుమార్, రాజు శ్రీ వాత్సవ్, లింగుస్వామి గౌడ్, శ్యాం సుందర్, హరీష్ కుమార్, భగత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సాండ్ బజారులో చౌక ధరకే ఇసుక విక్రయం

- దళారుల కృత్రిమ కొరతను నమ్మొద్దు
- నష్టాల నుంచి లాభాలలోకి తీసుకెళ్ళాం
- మండలంలో అక్రమ మైనింగ్ ను ఆపి, చెక్కు పోస్టును ఏర్పాటు చేయాలి
- కాలుష్యాన్ని నియంత్రించి, ప్రజల ప్రాణాలని కాపాడాలి : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

సాండ్ బజార్‌లో చౌక ధరకే ఇసుక విక్రయం జరుగుతుందని, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజల ఇంటి నిర్మాణం కోసం టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో సాండ్ బజారు ద్వారా ఇసుక విక్రయ కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సాండ్ బజార్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇసుకను చౌకగా అందించేందుకు టీఎస్ఎండీసీ వారిచే ఇసుక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన టన్ను ఇసుకకు రూ. 1800, దొడ్డు ఇసుకను రూ.1600 విక్రయించేందుకు టీఎస్ఎండీసీ నిర్ణయించిందన్నారు. దళారులు సృష్టించే కృత్రిమ కొరతను నమ్మొద్దన్నారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాండ్ బజారు ద్వారా లారీ డ్రైవర్లుగా పనిచేసే వారికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇక్కడ ప్రకృతిని నాశనం చేస్తూ పర్యావరణ కాలుష్యం కారణమవుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క పర్మిషన్‌తో అనేక మైనింగ్ కంపెనీలు నడుస్తున్నాయని వీటిని వెంటనే నిలిపివేసేందుకు చెక్కు పోస్టులు ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. 15 గ్రామాలు మైనింగ్ బారిన పడి కాలుష్యంతో కమ్ముకున్నాయన్నారు. అధికారులు మేల్కొనకపోతే దాని ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు.

సామాన్యులకు అందుబాటులోకి తేవడమే సాండ్ బజారు ఉద్దేశం : టీఎస్ఎండీసీ చైర్మెన్ అనిల్

సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం కోసమే టీఎస్ఎండీసీ ఉద్దేశమని చైర్మెన్ అనిల్ అన్నారు. గత ప్రభుత్వం అధీనం జరిగిన ఇసుక మాఫియాను అరికట్టి, సీఎం రేవంత్ రెడ్డి ముందు చూపు ఆలోచనతో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుందుకే సాండ్ బజారు ఏర్పాటు చేశారని తెలిపారు. కేసీఆర్ కుటుంబం ఆదాయం పెంచుకోవడానికి, ప్రభుత్వానికి ఆదాయం సమాకూర్చే అనేక ఆర్థిక వనరులను కొల్లగొట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.628 కోట్ల నుంచి రూ. 703 కోట్లకు ఆదాయం పెరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ జరిగిందన్నారు. గత ప్రభుత్వం లో బోర్డు ఆఫ్ డైరెక్టర్‌ల మీటింగ్ లేదని అంత దోపిడీ చేశారని ఆరోపించారు. వర్షా కాలంలో కూడా ఇసుకను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీ ఎస్ ఎం డీ సీ చైర్మెన్ అనిల్, మేనేజింగ్ డైరెక్టర్ శుసీల్ కుమార్, జీ ఎం రాజశేఖర్ రెడ్డి, మైనింగ్ ఏడీ నర్సిరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఎంపీ డీ ఓ శ్రీ వాణి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, నాయకులు బుర్ర మహేందర్ గౌడ్, పండుగుల రాజు, సిద్దంకి కృష్ణ రెడ్డి, విజేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, తాటిపల్లి రమేష్,గంటా శ్రీనివాస్ రెడ్డి, పెంటయ్య, లింగం, తదితరులున్నారు.

ఎమ్మెల్యేపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి తనను హింసపరిచేలా మాట్లాడారని హస్తినపురం కార్పొరేటర్ సుజాత నాయక్ ఆరోపించారు. సోమవారం ఎల్బీనగర్ పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తన వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా, చులకన భావం చేసి మాట్లాడినందుకు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీజేపీలో ఉన్నప్పుడు కూడా తనపై పరుష పదజాలంతో దూషించారని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ గౌడ్‌తో హనీమూన్ నడుస్తున్నదని మాట్లాడడం తన కుటుంబాన్ని అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయకపోతే ఎమ్మెల్యే సతీమణి పై తాము ఆరోపణ చేస్తామని మండిపడ్డారు. ఎల్బీనగర్‌లో ఉన్న అంబేద్కర్, పూలే విగ్రహాల వద్ద ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. ఆమె వెంట లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, నాయకులు సుజాత రెడ్డి, చెన్నగోని రవీందర్ గౌడ్, భీమిడి రామకృష్ణారెడ్డి, గణేష్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుమాముల గ్రీన్ సిటీ కాలనీలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ పరిధిలోని పసుమాముల గ్రీన్ సిటీ కాలనీలో రంజాన్ పండుగను పురస్కరించుకొని కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లింలకు సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా హయత్ నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హాజరై షేక్ వలి, సలీం, ఖాదర్‌లను శాలువాలతో సత్కరించినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. ఇలాంటి అనుబంధం కొనసాగిస్తూ, మత సామరస్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నాగరాజు, కళ్యాణ్, గోవిందరావు, కృష్ణ గౌడ్, బ్రహ్మానాయుడు, శ్రీకాంత్, సత్యనారాయణ, వంశీ, లింగ నాయక్, లింగాస్వామి, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ రామిడి కళావతి నగర్ కాలనీకి చెందిన సుమన్ బ్రెయిన్ స్ట్రోక్‌తో అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స నిమిత్తం మా కాలనీ వాసుల అందరి సహకారంతో రూ.1లక్ష 30వేలను సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, రామిడి కళావతి నగర్ కాలనీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి సహకారం అందించిన కాలనీ వాసులకు ప్రతీ ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. -నవతెలంగాణ, బడంగ్‌పేట్

పోస్టర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 26వ డివిజన్ పరిధిలోని ఉన్న పోస్టర్ కాలనీ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం కాలనీ అసోసియేషన్ నూతన అధ్యక్షులు నర్సింగ్ రావు ఆధ్వర్యంలో తాజా మాజీ కార్పొరేటర్ రామిడి కవిత రాంరెడ్డిని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాలనీలో రోడ్లు, డ్రయినేజీలు మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు సౌకర్యం, వీధి దీపాలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కాలనీ వాసులు ఎవ్వరు పట్టించుకోక పోవటం వలన కాలనీలో అనేక సమస్యలు పేరుకపోవటంజరిగిందన్నారు.అందుకు స్పందించిన మాజీ కాలర్పొరేటర్ త్వరలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు పర్వతాలు గౌడ్, కార్యదర్శి చంద్రయ్య గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

సంకష్టహర చతుర్థి గణపతి హెూమం

నవతెలంగాణ-చంపాపేట్

ఈ తెలుగు సంవత్సరం ఆఖరు సంకష్టహర చతుర్థి గా శ్రీ వినాయక స్వామి విశేషమైన రోజు సంకష్టహర చతుర్థి వచ్చిన సంధర్భంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థాన ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ మహాగణపతి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. లావణ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సామూహిక గణపతి హెూమం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీ గణపతి హెూమం ఆద్యంతం ఎంతో వైభవంగా జరిగింది, హెూమంలో పాల్గొనేందుకు భక్తులు కూడ అధిక సంఖ్యలో తరలివచ్చారు. అదే విధంగా దేవాలయమునకు పూలు పూల దండలు, పూల అలంకరణ, పాలు పెరుగు, ఆవు మేత, కూరగాయలు, టెంట్ సామగ్రి సరఫరా హక్కుల నిమిత్తము దేవాదాయ శాఖ సహాయ కమీషనరు, శ్రీ టి. శేఖర్ గారి పర్యవేక్షణలో ఆలయ ఇ.ఓ. యన్. లావణ్య గారి ఆధ్వర్యములో హజరైన టెండరుదారుల సమక్షములో సీల్డ్ టెండరు ప్రక్రియ నిర్వహించారు.



హస్తినాపురం డివిజన్ అభివృద్ధే లక్ష్యం



కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా హస్తినాపురం డివిజన్ అభివృద్ధే తమ లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ కాలనీలో రూ.25లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ ప్రజాప్రతినిధుల మూలంగా డివిజన్ అభివృద్ధికి నిధుల కేటాయింపులో అలసత్వం వహించి, డివిజన్ అభివృద్ధిని అడ్డుకొని ఇబ్బందులు గురి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదని, ఇప్పుడు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి దశల వారీగా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి ,గోపాల్ రెడ్డి ,గంగాధర్, హనుమంత్ రెడ్డి, మమతా మల్లేష్ గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్ పరిధిలోని వీఎస్ రెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం భవన్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, వీఎస్ రెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు వెంకట్ రామ్ రెడ్డి, కనకరాజ్ గౌడ్, రామచంద్రయ్య, వాసుదేవరెడ్డి, వీరన్న, రంగారెడ్డి, బాల్ రాజ్, నాగేష్, రాజశేఖర్ రెడ్డి, శ్యామ్ రావు, అంజిరెడ్డి, లక్మణ్‌సింగ్, లక్ష్మణాచారి, వరప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ళ బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, క్రాంతి, మహిళ నాయకరాళ్లు రమారెడ్డి, అరుణ, గిరిజ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలు కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి సత్యనారాయణ పురంలో పార్క్ స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలని కాలనీ వాసులు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు వనం గోపాల్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధి 3వ డివిజన్ సత్యనారాయణపురం సర్వే నెంబరు 3,4 లో ఉన్న పార్క్ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తక్షణమే కార్పొరేషన్ అధికారులు స్పందించి అ స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని నిలుపుదల చేసి పార్క్ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ త్రిలేశ్వర్ రావు ఫిర్యాదు మేరకు నగర ప్రణాళిక విభాగం అధికారుల చేత దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎస్సీల లబ్ధి శాతం జాబితా పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శాఖల వారీగా రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో ఎస్సీలకు ఎంత శాతం లబ్ధి చేకూరుతుందనే జాబితాలను జిల్లా కలెక్టర్ గౌతం పరిశీలించారు. నేడు జిల్లాకు షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు రానున్నందున కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా అధికారులతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో ఎస్సీలకు ఎంత శాతం లబ్ధి చేకూరుతుందని శాఖల వారీగా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీలకు ఎంత శాతం లబ్ధిచేకూరుతుందనే జాబితాలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందించే రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, గృహ లక్ష్మి, స్వయం సహాయక బృందాల రుణాలు, మహిళా శక్తి, 2 బీహెచ్‌కే వంటి పథకాల అమలులో ఎంత మంది ఎస్సీలకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సలహాలను, సూచనలను అధికారులకు కలెక్టరు తెలిపారు. జిల్లా జనాభాలో ఎస్సీలు ఎంత శాతం ఉన్నారని సీపీఓను అడిగారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, సీపీఓ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, హౌజింగ్ ఈఈ రమణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, పరిశ్రమల శాఖ అధికారి ప్రశాంత్, సివిల్ సప్లై, అధికారి సుగుణబాయి, మెడికల్ అండ్ హెల్త్ అధికారి ఉమాగౌరీ, విద్యుత్ శాఖాధికారి, జిల్లా ఉపాధి అధికారి రాధిక, తదితరులు పాల్గొన్నారు.

కుసుమ ధర్మన్న 125వ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలా నగర్ ఆఫీసులో మొట్టమొదటి దళిత కవిగా పేరొందిన కుసుమ ధర్మన్న 125వ జయంతి సందర్భంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. కుసుమ ధర్మన్న చిత్రపటానికి ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, పూలే, అంబేద్కర్ స్ఫూర్తి గ్రూప్ నాయకులు గద్దల నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ కుసుమ ధర్మన్న అంటరానితనానికి వ్యతిరేకంగా సకల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆనాడే "మాకొద్దీ నల్లదొరల పెత్తనం"అంటూ పోరాడిన గొప్ప కవి అని చెప్పారు. స్ఫూర్తి గ్రూప్ నాయకులు శివన్నారాయణ మాట్లాడుతూ కుసుమ ధర్మన్న ప్రథమ దళిత కవి, రచయితగా ప్రసిద్ధి ఎక్కారని చెప్పారు. తను చదివింది ఐదో తరగతి అయినా తెలుగు, ఇంగ్లీష్ ఉర్దూ హిందీ సంస్కృతంలో పాండిత్యం సంపాదించి అనేక వ్యాసాలు, కవిత్వం రాశారని గుర్తు చేశారు. ఆయుర్వేద వైద్యుడిగా పట్టా పొందారని తెలిపారు. జీవితకాలం ప్రజలకు సేవ చేస్తూనే సాహిత్యంలో అందరికీ దీటుగా కృషి చేశారని చెప్పారు. పూలే అంబేద్కర్ స్ఫూర్తి గ్రూపు నాయకులు గద్దల నరసింహారావు మాట్లాడుతూ కుసుమ ధర్మన్న మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగానూ, కందుకూరి వీరేశలింగంను ప్రేరణగా తీసుకొని పని చేశారని చెప్పారు. కుల వివక్షతో దళితులను అంటరాని వారిగా చూడటం ఎంతో దుర్మార్గమని పోరాటం చేశారని వివరించారు. స్వాతంత్ర పోరాట కాలంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి పని చేశారని తెలిపారు. కుల వివక్ష వ్యతిరేకంగా దళితుల హక్కుల కోసం ప్రజా ఉద్యమాల్లో పనిచేశారని చెప్పారు. దళితుల కోసం జయభేరి అనే పత్రికను నడిపారని చెప్పారు. మనం ఆయనను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని కోరారు. అనంతరం సభ్యులందరూ కుసుమ ధర్మన్న చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జే.చంద్రశేఖర్, ఎం. శ్రీనివాసరావు, జి. శ్రీనివాసులు, గౌసియా పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ నాయకులు బంగారు నర్సింగ్ రావు



నవతెలంగాణ-బోడుప్పల్

రవాణా రంగంలో పనిచేసే కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ పేడరేషన్ (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) సీఐటీయూ అనుబంధ సంఘం నాయకులు బంగారు నర్సింగ్ రావు కోరారు. సోమవారం మేడిపల్లి మండలం చెంగిచెర్ల చౌరస్తాలో నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశానికి ముఖ్యతిధిగా హజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ప్యాసింజర్ ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు వారి సమస్యల పరిష్కారం కోసం (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) అండగా ఉంటుందన్నారు. రవాణా రంగంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అర్హులైన వాళ్లందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. నాన్ లోకల్ పర్మిట్లను నియంత్రించి ప్రభుత్వం ప్రకటించిన రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. ఓలా, ఉబర్ యాప్‌లను నియంత్రించి, దోపిడీని అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేరళ ప్రభుత్వం తరహా రైడర్ యాప్ ను ప్రభుత్వమే తీసుకువచ్చి నిర్వహించాలని సూచించారు. 2019 మోటార్ వెహికల్ సవరణ చట్టాన్ని ఉపసంహరించు కోవాలన్నారు. 29 లేబర్ కోడ్ లను పునరుద్దరించి నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలన్నారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రెండు దఫాలుగా ట్రాన్స్ పోర్ట్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వాగ్దానం చేశారే కాని ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. దీనికి నిరసనగా ఈనెల 22న రవాణా రంగం కార్మికులతో ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. ఈ ధర్నాలో అన్ని రంగాల రవాణా కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మేడిపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ ఎస్. సృజన, సీఐటీయూ నాయకులు జి. శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణ,టి. వెంకటేష్, టి. మహేష్, వి. సోమయ్య , ఎం. గంగాధర్,సిహెచ్. వెంకటేష్, రమేష్, ఆర్.సత్యనారాయణ, ఎస్. అశోక్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను విభాగం అధికారులతో శ్రీదేవి సమీక్ష..



నవతెలంగాణ - చర్లపల్లి

ఆస్తి పన్ను విభాగం అధికారులతో చర్లపల్లి డివిజ న్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరం వరకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని కేవలం 10శాతం వడ్డీతో ఏకకాలంలో పూర్తిగా చెల్లించి వడ్డీ పై 90 శాతం మాఫీని పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ స్కీం మార్చ్ 31 వరకు ఉన్నదని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం టాక్స్ ఏఎంసీ నాగార్జున, టాక్స్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, నాగిళ్ల బాల్ రెడ్డి, ప్రభుగౌడ్, శ్రీకాంత్ యాదవ్, క్రాంతి పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి



- కురుమలకు స్థానిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి
- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమరయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి
- కురుమ సంఘం ఉప్పల్ జోన్ అధ్యక్షులు రేవు కృష్ణ

నవతెలంగాణ-ఉప్పల్

కురుమలు తమ హక్కుల కోసం ఐక్యమత్యంగా ఉద్యమించాలని ఉప్పల్ జోన్ కురుమ సంఘం అధ్యక్షులు రేవు కృష్ణయ్య, జోన్ కార్యదర్శి పర్వతాలు అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కురుమ మహిళా సాధికారక సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలలో, కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల్లో కురుమలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గొర్రెల కోసం డీడీలు కట్టిన వారికి గొర్రెలు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో గొర్రెల ఫామ్ ఏర్పాటు చేసి గొర్లకు గొర్లకాపరులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దొడ్డి కొమరయ్య, చుక్క సత్తయ్య విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఒగ్గు కళాకారులకు మల్లన్న బీరప్ప దేవాలయాల్లో ఉద్యోగాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బండారు నారాయణ, కోలుపుల నర్సింహ కురుమ, మేకల శిల్పారెడ్డి, కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి, గోరిగే రమేష్ కురుమ, కార్యదర్శి గోరిగే మల్లేష్, గోరిగే పెద్ద మల్లేష్, జెన్నీ, రఘు, మైసయ్య తదితరులున్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



నవతెలంగాణ - చర్లపల్లి

పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నాచారం డివిజన్‌లోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లోని 508 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఇందిరా స్కూల్లోని 160 మంది విద్యార్థులందరికీ ఎగ్జామ్ పాడ్, పెన్ను, పెన్సిల్, షార్ప్ నార్, రబ్బర్, స్కేల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

ఉన్నత చదువులకు తొలిమెట్టు పది తరగతి పరీక్షలు : సాయిజెన్ శేఖర్

ఉన్నత చదవులకు పదో తరగతి పరీక్షలు తొలిమెట్టు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ అన్నారు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరా స్కూల్ ప్రిన్సిపాల్ అప్సర్, బీఆర్ఎస్ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి
- రూ. 1.20 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీ బ్లాక్-3లో రూ.1.20కోట్లతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రయినేజీ పైపులైన్ల మరమ్మతులు, మాన్ హెూల్ ఛాంబర్ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. ప్రతి రోజు బస్తీలో పర్యటిస్తూ ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మిగిలిన పనులన్నింటినీ అంచలంచెలుగా పూర్తి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూపా, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, భిక్షపతి, స్థానిక నాయకులు కటర్ల భాస్కర్, బాసిత్, ప్రకాష్, భూషనం శ్రీనివాస్, కాల్వల అంజి, రామంజి, దీపక్ సింగ్, ఉస్మాన్, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సాయి సుధీర్ కళాశాలలో విద్యార్థి సమ్మేళనం



నవతెలంగాణ-కాప్రా

సాయి సుధీర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీబీఏ విద్యార్థుల మధ్యగల సఖ్యతను, స్నేహాన్ని కళాశాల పట్ల గౌరవాభిమానాలు చాటిచెప్పే విధంగా విద్యార్థి ఆత్మీయ సమ్మేళం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సుధీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహాలతో విద్యార్థి సమ్మేళన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాలల చైర్ పర్సన్ ఆర్. ఉషారాణి ముఖ్యతిథిగా హాజరై విద్యార్థి సమ్మేళనం స్నేహపూర్వ వాతావరణంలో కలకాలం గుర్తుండిపోయేలా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు నృత్యాలు చేస్తూ, ఆటపాటలతో కనువిందు చేశారు. ఉపన్యాసాలతో తోటి విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు గురువుల పట్ల తమ అభిమానానికి గుర్తుగా చిరుకానుకలతో ఉపన్యాసకులను సత్కరించుకున్నారు. ఉపన్యాసక, ఉపన్యాసకేతర సిబ్బంది ఈ వేడుకలో పాలుపంచుకుని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమం డిగ్రీ, పీజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మీరానాయుడు, పద్మ పర్యవేక్షణలో నిర్వహించారు.

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి



- ఇన్‌చార్జి ఎంఈవో శ్రీధర్

నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితేనే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీధర్ తెలిపారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ, అంకుషాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదో తగరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా చదివితేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు పాఠాలు చెప్పినట్లు గుర్తు చేశారు. పరీక్షల సమయంలో టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. పరీక్ష పేపర్లను చూసి హైరానా పడొద్దని, నిశితంగా క్వశ్చన్ పేపర్‌ను చదువాలని సూచించారు. పరీక్ష పేపర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతయ్య, వనజ, కరుణ, రాజశేఖర్, నవనీత, క్యాథిన్, లక్ష్మి సురేందర్. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మందాపురం నరేష్



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని మండల సీపీఐ(ఏం) కార్యదర్శి మందాపురం నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు గ్రామ సీపీఐ(ఎం) కార్యదర్శి ఎక్కల్ దేవి కొమరయ్యతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రావల్ కోల్ గ్రామపంచాయతీకి అనుబంధంగా చాలా గిరిజన తండా గ్రామాలు ఉన్నాయన్నారు. రావల్ కోల్ గ్రామానికి సమీపంలో ఘనపూర్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, లేతమామిడి తండా, సైదోనిగడ్డ తండా, సోమారం, ఎల్లంపేట ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా రావల్ కోల్ గ్రామానికి అనుబంధంగా కనంబై తండా, గూడెంగడ్డ తండా, దొంగలగుట్ట తండాకు కేంద్రంగా ఉందని పేర్కొన్నారు. కాబట్టి రావల్ కోల్ గ్రామ కేంద్రంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో ప్రభుత్వ భవనాలు నిర్మాణానికి రావల్ కోల్ గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయన్నారు. జనాభాలో పెద్దదని, మున్సిపాలిటీ కావడానికి అన్నిరకాల అర్హతలు ఉన్నాయని తెలిపారు.

రాజీవ్ పార్కులో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్ పార్క్ అభివృద్ధి, మరమ్మతు పనుల దృష్ట్యా కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ పార్క్‌లో పాడైన జిమ్ పరికరాల స్థానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామని, చెట్ల చుట్టు ఉన్నటువంటి కొమ్మలు తెలగించామని తెలిపారు. పార్కును పూర్తిగా అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని సదుపాయాలతో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ లోకేష్, ఏఈ లింగారావ్, అశోక్ పాల్గొన్నారు.

మండల రిసోర్స్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలి



నవతెలంగాణ-బోడుప్పల్

మండల రిసోర్స్ సెంటర్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది ఉపయోగించుకోవాలని డీసీఈబీ కార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం పీర్జాదిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా మండల రిసోర్స్ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) కార్యదర్శి సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, దామోదర్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిరక్షణకు రెండో రోజు నిరసన



నవతెలంగాణ-ఆల్వాల్

మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశాన వాటికను సంరక్షించుకునే బాధ్యతలో భాగంగా డంపింగ్ యార్డ్ వద్ద మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డిలు రెండోరోజు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హిందూ శ్మశాన వాటికకు కేటాయించిన భూమిలో రాంకీకి ఎలాంటి అనుమతులు లేవని, అనైతికంగా ప్రయివేట్ బిజినెస్ గా చేసి పరిసర ప్రాంతాల ప్రజలను, కాలనీ వాసులను అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఆ భూమిని శ్మశాన వాటికకే కేటాయించే వరకు ఆందోళన చేపడతామన్నారు. ఎమ్మార్వో, ఉన్నతాధికారులు డంపింగ్ యార్డ్ వద్ద జరుగుతున్న పనులను సమీక్షించాలని డిమాండ్ చేశారు. అల్వాల్ సీఐ రాహుల్ దేవ్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, డీఐ, ఎస్ఐలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘాలతోనే అభివృద్ధి

- కాంగ్రెస్ బోడుప్పల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫక్కీర్ హరినాథ్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

కాలనీ సంక్షేమ సంఘాలతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ బోడుప్పల్ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కీర్ హరినథ్ రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 7 వ డివిజన్ అంజనేయ నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి హాజరై మాట్లాడుతూ అసోసియేషన్‌లు కాలనీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేయాలని, అప్పుడే ప్రజలు కార్యవర్గంపై పెట్టుకున్న నమ్మకం రెట్టింపు అవుతుందన్నారు. కాగా అంజనేయ నగర్ కాలనీ అధ్యక్షుడిగా ఏ.సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసయ్య వెంకటయ్య ప్రధాన కార్యదర్శిగా విశ్వ ప్రదీప్, సంయుక్త కార్యదర్శులుగా యూసఫ్, నవీన్, భూషణ్, కోశాధికారిగా శివప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఫణి కిషోర్ రెడ్డి, సత్యనారాయణ, భాను ప్రకాష్ లతో పాటు మాజీ కార్యవర్గ సభ్యులు గుండు శ్రీనివాస్, రాజ్ కుమార్, సుదీప్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 14 ఫిర్యాదులు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జంట సర్కిల్స్ కుత్బుల్లాపూర్, గాజులరామారం పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 14 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 వరకు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర సింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 8 ఫిర్యాదులో అందాయి. వాటిలో ఇంజనీరింగ్ 2, టౌన్ ప్లానింగ్ విభాగానికి 4, టాక్స్ సెక్షన్ 1, శానిటైజషన్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. అలాగే గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లా రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 6 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ 4, ఎలక్ట్రికల్ విభాగానికి 2 వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారు లకు అర్జీలు పంపిస్తున్నట్టు తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బాలానగర్

అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ టి..నర్సింహరాజు కథనం ప్రకారం గురుమూర్తి నగర్‌కు చెందిన జక్క సత్యనారాయణ(49) ఓ కంపెనీలో పని చేసేవాడు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈ మేరకు అతడు భార్య వద్ద డబ్బులు తీసుకుని అతిగా మద్యం సేవించి సాయంత్రం ఇంటి వెనుక ఉన్న స్టోర్ రూమ్‌లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. అతడి భార్య గమనించి సమీపంలోని బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి సత్యనారాయణకు కిందకు దించి ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తాగిన మైకంలో ఉరేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎం శ్రీ, మొబైల్ సెంటర్స్, ఎన్ఈసీని తక్షణమే ఉపసంహరించుకోవాలి



- గత, ప్రస్తుత ప్రభుత్వాల హామీలు, కోర్టు తీర్పులు, గ్రాట్యుటీ, పర్మినెంట్ అమలు చేయాలి
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన రూ.18 వేల వేతనం వెంటనే అమలు చేయాలి
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అశోక్, జె.చంద్రశేఖర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ, మొబైల్ సెంటర్స్, ఎన్ఈసీని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అశోక్, జె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ధర్నాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం రూ.18 వేల వేతనం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో వెంటనే చర్చించాలనీ, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాల ద్వారా ఐసీడీఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తున్నదనీ, ఇందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందనీ, ఇది అమలైతే ఐసీడీఎస్ స్వతంత్రంగా ఉండదన్నారు. ఐసీడీఎస్‌లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఐసీడీఎస్ మూతపడే పరిస్థితికి దారి తీస్తుందన్నారు. అందుకే ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది, కానీ ఈ అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోతున్నదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఐసీడీఎస్‌కు వ్యతిరేకంగా అత్యంత దుర్మార్గంగా కేంద్రం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేయాలని చూడటం అన్యాయం అన్నారు. ఈ చర్యలు రాష్ట్రంలో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తాయని తెలిపారు. జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద ప్రజలకు, అంగన్‌వాడీ టీచర్స్‌కు తీవ్రమైన నష్టం కలిగిస్తుందన్నారు. ఐసీడీఎస్ వ్యతిరేక విధానాల అమలు రాష్ట్రంలో వెంటనే ఆపాలనీ, అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, గత, ప్రస్తుత ప్రభుత్వాల హామీలు, కోర్టు తీర్పులు, గ్రాట్యుటీ పర్మినెంట్ అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రయివేటీకరణలో భాగంగానే పీఎం శ్రీ, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్, నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందనీ, వీటి అమలులో భాగంగా పీఎం శ్రీ పథకాన్ని 28 జిల్లాల్లో 58 కేంద్రాలను ఫేస్-1 కింద ప్రారంభిస్తామని విద్యాశాఖ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్య, వీటినే బాలవాటికా కేంద్రాలని కూడా అంటారనీ, ఈ పథకం 4 ఏండ్లు ఉంటుందనీ, ఈ కేంద్రాలు 3-6 ఏండ్ల పిల్లలతో నర్సరీ విద్యను ప్రారంభిస్తామని చెప్తున్నారని తెలిపారు. ఈ కేంద్రాలకు కొంత బడ్జెట్‌ను కూడా నిర్ణయం చేశారనీ, ఇప్పటికే ఈ పిల్లల కోసం 50 ఏండ్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ స్కూల్ విద్యనందిస్తున్నాయని తెలిపారు. అదనపు, ఆన్‌లైన్ పనులు తగ్గించి, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి అన్ని సౌకర్యాలు కల్పించి అంగన్‌వాడీ కేంద్రాలనే నర్సరీ కేంద్రాలుగా మార్చాలనీ, అంగన్‌వాడీ ఉద్యోగులు అనేక ఏండ్లుగా కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాలను పట్టించుకోకుండా పోటీ కేంద్రాలను పెడుతున్నదంటే ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. సీఐటీయూ శామీర్‌పేట మండల కార్యదర్శి కిష్టప్ప మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు న్యాయం చేయాలనీ, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సునిత, బి.శోభారాణి, సీఐటీయూ జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాస్, బి.లింగస్వామి, జె.వెంకన్న, పి.గణేష్, నాయకులు చంద్రశేఖర్, ఉన్నికృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు శివరాణి, శైలజ, రమాదేవి, భాగ్య, భాగ్యరేఖతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

మున్సిపాల్టీలు, మండల స్థాయిలో
వచ్చే దరఖాస్తులనూ పరిష్కరించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ప్రజావాణికి 73 అర్జీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్ ప్రజావాణిలోలోనే కాకుండా మున్సిపాల్టీ, మండల స్థాయి కార్యాలయాల్లో వచ్చే దరఖాస్తులను కూడా పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ గౌతం స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 73 ఫిర్యాదులు అందినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణితోపాటు మున్సిపాల్టీలు, మండల స్థాయి దరఖాస్తులకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం తెలియపర్చాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో నెలకొన్న ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పేద విద్యార్థులకు దాతలు చేయూత అభినందనీయం'



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు అన్నారు. పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో అంబేద్కర్ సేవా సమితి కమిటీ ఆధ్వర్యంలో "పే బ్యాక్ టు ది సొసైటీ "ప్రతినిధులు సుమారు 80 మంది విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం ప్యాడ్, పెన్ను, పౌచెస్ మొదలైన పరీక్ష కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు మాట్లాడుతూ అంబేద్కర్ సేవా సమితి కమిటీ ప్రతినిధులు చేస్తున్న ఇటువంటి గొప్ప సేవా కార్యక్రమాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారి సేవలను కొనియాడారు. కమిటీ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వీరయ్య, సామ్సన్, రాజ్ కమల్, పరశురాం, మల్లేష్, అబ్రహం, నవీన్, ప్రదీప్, పీతల కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్
- ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు
- డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వద్దు
- కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ.. ముత్తు యాదవ్







నవతెలంగాణ-కూకట్‌పల్లి

తమ తమ వాహనాల్లో ప్రయాణించే వాహన దారులు, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ.. తమ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను దృష్టిలో ఉంచుకుని సేఫ్ డ్రైవింగ్ చేస్తూ, క్షేమంగా ఇండ్లకు చేరుకోవాలి ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించి, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించి తగు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణించాలని, నవతెలంగాణ ప్రతినిధి ద్వారా కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్ ప్రజలకు తెలియజేశారు.

మైనర్‌లకు వాహనాలు ఇవ్వద్దు..

మైనర్‌లకు ఎవరైతే వాహనాలిస్తారో వారు శిక్షార్హులు అవుతారని, కాబట్టి మైనర్‌లకు వారి తల్లిదండ్రులు గానీ, ఇంకెవరైనా సరే వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పదు. అదే విధంగా మైనర్ లు వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ చేసే బాలుడితో పాటు ఎదుటి వ్యక్తికి సైతం ముప్పుగా పరిణమించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్‌లకు వాహనాలు ఇవ్వొదు. ఒక వేళ ఇస్తే వాహనం ఇచ్చిన నేరంపై తల్లి దండ్రుల ను సైతం జైల్లో శిక్షలు పడతాయి. మైనర్‌లకు వాహనాలు ఇవ్వ కుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ నెలలో విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు జోష్‌లో ఉండి, పరీక్షలు పూర్తయిన ఆనందంలో, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకు ండానే, ట్రిపుల్ రైడ్ విన్యాసాలు చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు కోరి తెచ్చుకుంటూ ఉంటారు. ఎట్టి పరిస్థితు ల్లో ఎవరూ కూడా ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని, ఒక వేళ ట్రిపుల్ రైడ్ చేస్తూ పట్టుబడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు సైతం శిక్షార్హుల వుతారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాల్సి వస్తుంది.

ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు..

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జనవరి నెలలో మొత్తం అరవై ప్రాంతాల్లో, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు, కళాశాలల విద్యా ర్థులకు, ఆటో, క్యాబ్, ఆర్‌టీసీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివార ణకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అలాగే ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు ప్రధానంగా రెండు చోట్ల నిర్వహిస్తున్నామని, ప్రతి నెల కూకట్‌పల్లి పరిధిలో ఎనిమిది నుంచి పది లక్షల రూపాయల వరకు పెండింగ్ చలా నాలు రిసిప్ట్ చేస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాల సైలెన్స ర్ తీసిన వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపడతామని తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు ఉంటా యని కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

- జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఒత్తిడికి గురికాకుండా పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ తెలిపారు. సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస గౌడ్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీడిమెట్ల సీఐ మల్లేశం పాల్గొని మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్ణయించబడుతుందన్నారు. విద్యార్థులను ప్రయోజకులను చేయడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. లక్ష్యసాధనకై ఎన్నో అవరోధాలను అధిగమించవలసి ఉంటుందని పేర్కొన్నారు.చదువు ద్వారానే పేదరికాన్ని నిర్మించవచ్చునన్నారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని... ఎటువంటి ఒత్తిడికి గురికావద్దన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండవ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పరీక్ష సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రతిఒక్కరూ తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, చెత్తను రోడ్లపై వేయకూడదని కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో, డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ శానిటేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు డిప్యూటీఈఈ ఎస్‌డబ్ల్యూఎం, పారిశుధ్య సిబ్బందితో కలిసి, ర్యాలీ, అవగాహన కల్పించడం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలందరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వారానికి ఒకసారైనా తనిఖీ చేసుకుని మీ ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను తొలగించాలని అన్నారు. ముఖ్యంగా చెత్తను వీధుల్లోనూ, కాలువలోను, చెరువుల్లోనూ వేయకుండా, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి, చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు సహకరించి, మీ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని రోగాల బారిన పడకుండా చూసుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పాండుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, అగ్రవాసు, కైసర్, ఇస్మాయిల్, మల్లేష్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భిన్న రంగాలలో పరిశోధనలకు వెనుకాడకూడదు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భిన్న రంగాలలో పరిశోధనలు చేయడానికి వెనుకాడకూడదని జేఎన్‌టీయూహెచ్ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జేఎన్‌టీయూ హెచ్ గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్‌వర్క్ 2025 కింద "రసాయన, బయో సెన్సార్లలో నానోమెటీరియల్స్" పై ప్రత్యేక కోర్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ డా.విజయ్ కుమార్ రెడ్డి, యూఎస్ఏ ఎలిజబె త్ యూనివర్సిటీ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.బిజేంద్ర కుమార్, జేఎన్‌టీయూహెచ్ ఇంజి నీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.నరసింహ రెడ్డి, గ్లోబల్ లోకల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ.హేమలతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఓ, ఎన్ఓ2, హెచ్ 2.ఎల్పీజీ వంటి వాయువుల గుర్తింపు స్వీట్ గ్లూకోస్, నాన్-ఎంజైమాటిక్ సెన్సింగ్ పద్ధతులు, గ్రాఫీన్, కార్బన్ నానోట్యూబ్ వంటి పదార్థాల వినియోగం, ప్రయోగశాలలు, సౌకర్యాలు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రయోగశాలలు రాత్రి 9 గంటల వరకు తెరిచి వుంచి, శాస్త్రవేత్తలతో నేరుగా చర్చలు జరిపే అవకాశాన్ని కల్పిస్తున్నాయన్నారు. "తాను మెకానికల్ ఇంజినీరింగ్‌లో చదివి, ఆ తర్వాత అమెరికాలో నాసా ప్రాజెక్ట్ లో ఆర్గానిక్ కెమిస్ట్రీ పరిశోధనలు చేసిన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. మల్టీడిసిప్లినరీ విధానం అనుసరించడం ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించగల రన్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 50 మంది విద్యార్థులు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా పరిశోధన పత్రాల సిద్ధం, థీసిస్, ప్రాజెక్ట్ అబ్స్ట్రాక్ట్ రచన వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని తెలిపారు.

నూతన సంక్షేమ సంఘానికి నా మద్దతు ఉంటుంది

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నూతన సంక్షేమ సంఘానికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. 130 - సుభాష్ నగర్ డివిజన్ కృషి కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ గౌడ్, కార్యవర్గ సభ్యులు కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఎమ్మెల్యేని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్, రాజ్ కుమార్, మాజీ అధ్యక్షుడు బైరీష్ గౌడ్, రామ్ రెడ్డి, మైస గౌడ్, కిషోర్ కుమార్, పూర్ణచందర్ రెడ్డి పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో మినీ స్టేడియంకు స్థలం కేటాయించాలి



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేటలో స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా ఐదు ఎకరాల స్థలాన్ని మినీ స్టేడియం కోసం కేటాయిం చాలని నిజాంపేట కు చెందిన ఆకుల సతీష్ మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా విజ్ఞాపనను అందించారు. స్టేడియం కొరకు స్థానిక సర్వే నెంబర్ 334. 186 లలో ఉన్న స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. దుండిగల్ సర్వేనెంబర్ 454. 323 లావణ్య పట్టా భూముల్లో అక్రమంగా గెస్ట్ హౌస్ నిర్మిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బౌరంపేటలో ఎన్.ఓ.సి లేకుండానే ప్రభుత్వ భూమి ఐదు ఎకరాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ను అభ్యర్థించారు. బౌరంపేటలోని సర్వే నెంబరు 166/9 స్థలంలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని నిజమైన రైతులకు సహకారం అందించాలని ఆయన కోరారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన
సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు..



నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కేపీఆర్ఐటి ఆధ్వర్యంలో 14, 15 తేదీలలో నేషనల్ లెవల్‌లో నిరాహించిన ఫుట్‌బాల్ జట్టు నేషనల్ లెవల్ స్పోర్ట్స్ ఫెస్ట్ 2025 లో పాల్గొని విజయం సాధించారు. ఈ పోటీలలో మొత్తం 16 జట్లు పాల్గొనగా వారితో తలపడి సెయింట్ మార్టిన్ విద్యార్థులు అన్నీ జట్లపై విజయం సాధించి టైటిల్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ ఎం.లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చంద్రశేఖర్ యాదవ్, ప్రొఫెసర్ గ్రూప్ డైరెక్టర్ డా.పి.సంతోష్ కుమార్ పాత్ర, బృందాన్ని అభినందించి, ప్రోత్సహించారు.

సీఎంకు ఎమ్మెల్యే ధన్యవాదాలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ నిరుద్యోగులకు జీవనోపాధికి ఆర్థిక సహాయం యువ వికాస్ పథకాన్ని ప్రారంభించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ధన్యవాదాలు తెలిపారు . సోమవారం ముఖ్య మంత్రిని ఆయన మర్యాదపూ ర్వకంగా కలిశారు. నియోజకవర్గ లబ్దిదారులను ఉద్దేశించి మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకంలో ఆన్‌లైన్‌లో అప్లై చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు

ఓయూలో ఇందిరా క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఇందిరా క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఓయూ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపార్ట్మెంట్ల నుంచి టీములు పాల్గొన్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో స్థానిక కాంగ్రెస్ నాయకులు కోట శ్రీను, డా. కనకాల ఎలెందర్,వలిగొండ నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ ముదిరాజ్, వికాస్, సురేష్,నందు,నాగరాజు, సుమంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగిన వారు పేదలను చేరదీయాలి

- గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఆర్థికంగా ఎదిగిన వారు పేదలను చేరదీసి సమానత్వంతో భిన్నత్వాలను పోగొట్టుకుంటూ ముందుకు పోతే రానున్న రోజుల్లో భారతదేశం ఎదురులేని శక్తిగా ప్రపంచ దేశాల్లో నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బోయిన్ పల్లిలో ఉన్న ఎన్‌ఐఎంహెచ్‌లో సోమవారం భారత్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ కళా సంఘం 2025 వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి వచ్చిన విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. భారతదేశంలో విభిన్న సంస్కృతులు ఆచారాలు సంప్రదాయాలు ఉన్నప్పటికీ వారంతా ఏక తాటిపై నడుస్తారని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కళా కార్యక్రమాల ద్వారా ఐకమత్యం చాటుకుంటూ ముందుకు పోవటానికి ఆస్కారం ఉందన్నారు. భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతీయులం అంటే అందరికీ ఉత్సాహం వస్తుందని చెప్పారు. మన ఆచారాల్లో ప్రతి దాంట్లో ఒక సందేశం ఉంటుందని ఉదాహరణకు దీపం వెలిగిస్తే నెగిటివ్ ఆలోచనలు పోయి పాజిటివ్‌గా ఆలోచిస్తారని, ఓంకార నాదంలోనూ ఇతరాచారాల్లోనూ ఎంతో మెసేజ్ ఉందని వాటిని గౌరవిస్తూ ముందుకు నడవాలని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వికలాంగుల కళాకారులు కూడా వారి నైపుణ్యాన్ని చాటుకు న్నారు. ఈ కళాకారులను గవర్నర్ అభినందించారు. నిప్మడ్ డైరెక్టర్ రామ్ కుమార్, భారత్ భారతి సంఘం జాతీయ అధ్యక్షుడు వినయ్, ఎన్‌ఐఎంహెచ్ ప్రిన్సిపాల్ గణేష్, భారత్ భారతి సంఘం సభ్యులు గవర్నర్‌ను ఘనంగా సన్మానించారు. సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఉదయం కూల్చివేత... సాయంత్రానికల్లా సీసీ రోడ్డు

- కిస్మత్‌పుర్‌లో రోడ్డు వివాదానికి హైడ్రా శాశ్వత పరిష్కారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ పరిధిలో కిస్మత్‌పురాలో రెండు కాలనీలను కలిపే రహదారికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని హైడ్రా సోమవారం తొలగించింది. అదే రోజు సాయంత్రానికి అక్కడ సిమ్మెంట్ రోడ్డును బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీతో వేయించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని హైడ్రా చూపిం ది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, బండ్లగూడ జాగీర్‌లోని ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ - శ్రీ హర్షిత్ లే ఔట్‌ల మధ్య ఉన్న ఈ రహదారి కూల్చివేతతో పరిసర కాలనీలకు దారి దొరికింది. కిస్మత్ పురా గ్రామంలో 18.65 ఎకరాల్లో 173 ప్లాట్లతో ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ పేరిట కాలనీ ఏర్పడింది. ఈ కాలనీకి ఆనుకుని దాదాపు 12 ఎకరాలలో 160 ప్లాట్లతో శ్రీ హర్షిత్ లే ఔట్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు లే ఔట్లను కలుపుతూ 30 అడుగుల వెడల్పుతో రహదారి ఉంది. గతంలో ఇండ్లు లేకపోవడంతో లే ఔట్‌లను కాపాడుకోవాలనే నెపంతో రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించారు. 6 నెలల క్రితం మున్సిపల్ అధికారులు కూల్చేయడంతో రహదారికి ఆటంకాలు తొలగాయి. అయితే తిరిగి శ్రీ హర్షిత్ లేఔట్ వాళ్లు రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించడంతో వివాదం తలెత్తింది. మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేపట్టినా తిరిగి నిర్మించడం తో 3 ఏండ్లుగా అవస్థలు పడుతున్నామని ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ కాలనీవాళ్లు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచారించి సోమవారం ఉదయం మున్సిపల్ అధికారుల సమక్షంలో హైడ్రా ఆ అడ్డుగోడను తొలగించింది. రహదారికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని తొలగించడమే కాకుండా ఆ వెంటనే బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి సాయంత్రానికల్లా సిమ్మెంట్ రోడ్డు వేయించడంతో రెండు కాలనీల మధ్య అడ్డుగోడను శాశ్వతంగా తొలగించినట్టయ్యింది.

నరకం చూశాం...

2కిలోమీటర్లకుపైగా వెళ్లాల్సి వచ్చేది: స్థానికులు

అడ్డుగోడ ఉండడంతో గత 3 ఏండ్లుగా నరకం చూశామని స్థానికులు, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు 2 కిలోమీటర్లకుపైగా అదనంగా ప్రయాణించాల్సి వచ్చిందన్నారు. హైడ్రా సహాయంతో తమ కష్టాలకు తెర పడిందని స్థానిక కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులతోపాటు బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ సిబ్బందిని, అధికారులను స్థానికులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

విపత్తు సమయంలో
ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఆపదమిత్ర 5వ బ్యాచ్ ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విపత్తుల సమయంలో వారి ప్రాంతంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఆపద మిత్ర శిక్షణ పొందిన వారు స్పందించి ప్రజలకు సహకారమందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ మారేడుపల్లిలోని ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ జ్ఞాన వేదిక(పాలిటెక్నిక్ కళాశాలలో) జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28వరకు నిర్వహించనున్న 5వ ఆపదమిత్ర వాలంటీర్ల ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల విపత్తులు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం సంభవిం చకుండా, ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఆపదమిత్ర వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ విపత్తు నివారణ చట్టం తెచ్చిందన్నారు. ఆపదమిత్ర శిక్షణా ద్వారా ప్రత్యేక తర్ఫీదు పొంది విపత్తులు సంభవించినప్పుడు చురుకైన పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. తదుపరి శిక్షణ పొందిన వాలంటీర్లకు దుస్తులు, ట్రాక్ షూస్ అందిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి ఎన్. సుధాకర్ రావు, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, అర్జున్ అవార్డు గ్రహీత అనూప్, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం నెపంతో రజక యువకుడికి చిత్రహింసలు..

- ఓయూ పోలీసులపై చర్యలు చేపట్టాలి..
- బాధిత కుటుంబం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రజక యువకుడిని దొంగతనం నెపంతో చిత్రహింసలు పెట్టిన ఓయూ పోలీసులపై చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబం కోరింది. ఈ మేరకు సోమవారం మానవ హక్కుల కమిషన్‌కు బాధితుని తండ్రి పరుపల్లి రాజు, తల్లి మధులత ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రజక వృత్తిదారుల సంఘంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశ య్య మాట్లాడుతూ మార్చి 1న పరుపల్లి శివను అక్రమంగా అరెస్టు చేసిన ఓయూ పోలీసులు.. పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి కాల్లు చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారని తెలిపారు. అతన్ని అనేక రకాల చిత్రహింసల గురిచేసి ఒళ్లంతా తీవ్ర గాయాలతో కుల్లపొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. గాయాలతో తీవ్ర అనారోగ్య పరిచారని గాంధీ హాస్పిటల్‌లో అతను చికిత్స తీసుకున్నాడని చెప్పారు. అక్రమంగా దొంగతనం మోపిన సదరు యజమాని కుటుంబాన్ని విచారించకుండా అన్యాయంగా రజక వత్తిదారుల యువకు డిని చిత్రహింసలకు గురి చేసిన వైనంపై మానవ హక్కు లకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించాలని పై పోలీసు అధికారులు కూడా స్పందించాలని కోరారు. పూర్తి విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేసి శివను అక్రమంగా కొట్టి చిత్రహింసలు గురిచేసిన సీఐ , ఎస్ఐ , పైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాడుతామని చెప్పారు. వారి వెంట తెలంగాణ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజుల నరేష్, గ్రేటర్ హైదరాబాద్ రజక వత్తిదారుల సంఘం, నగర కార్యదర్శి మరియల గోపాల్, జిల్లా సహాయ కార్యదర్శి రాపర్తి ప్రభాకర్, అలవాల బాబు, జిల్లా కమిటీ సభ్యులు లొంక సోమయ్య,ఆర్ తిరుపతి, పి వెంకటరాజు, ఎ హనుమంతు ఎ సాలయ్య కే శివశంకర్ ఉన్నారు.



ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

రహమత్ నగర్ చౌరస్తాలో రోడ్డు ఆక్రమణ వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని గత కొంత కాలంగా జీహెచ్‌ఎంసీ, ఇతర అధికారులకు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మెమొరాండం అందజేశారు. చౌరస్తాలో ఉన్న మద్యం దుకాణంతో సామాన్య ప్రజలకు, మూలమలుపులో బస్సులు రాకపోకలకు ఎన్నో ఇబ్బందులున్న నేపథ్యంలో సోమవారం ఫుట్‌పాత్



ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ తొలగించారు. ప్రజలకు రాక పోకలకు ఇబ్బందులుగా మారిన దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని కార్పొరేటర్ కోరారు. రహమత్ నగర్ ప్రాంతంలో ఉండే బస్తీలను ,కాలనీలుగా మార్చుకోవాలంటే మొదట రోడ్స్ బాగుండాలి, విశాలంగా ఉండాలనే ఉద్దేశంతో ఆక్రమణలను తొలగించినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ప్రసీద, సెక్షన్ ఆఫీసర్ నరేష్ నాక్ ఇంజనీర్ స్పందన రావు, మధుర నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ , ఎస్సార్ నగర్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు. ఇంటి యజమాను లకు నష్టపరిహారం ఇచ్చి త్వరలో రోడ్డు వెడల్పు పనులు కూడా చేపట్టాలని స్థానికులు కార్పోరేటర్‌ను, జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు.

క్రీడలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనివ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ. నర్సింహా
- క్రీడా యూనివర్సిటీ స్థాపనతో క్రీడలకు ప్రాధాన్యత : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- ఘనంగా ముగిసిన ఏఐవైఎఫ్ భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యత,నిధులు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ. నర్సిం హా డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్థంతిని పురస్కరించుకుని ఓయూలోని క్రికెట్ గ్రౌండ్‌లో చివరి రోజు ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు వారు అతిథిగా హాజరయ్యారు.ఐదో రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకా రులకు కరచాలనం చేసి అభినందించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ. క్రీడలపై పాలకుల తీరు మారాలని అన్నారు. 140కోట్ల జనాభా ఉన్న మనదేశంలో అంతర్జాతీయ క్రీడల్లో మెడల్స్ సాధించడానికి నానా తంటాలు పడుతున్నామని, మనకన్నా చిన్న దేశాలు మెడల్స్‌ను చాలా సాధారణంగా సాధిస్తు న్నారన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ స్థాపన ద్వారా క్రీడలకు, క్రీడాకారులకు మరింత ప్రాధాన్యత ద్వారా ఒలింపిక్స్ లో పతకాల సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.భగత్ సింగ్ పేరిట క్రికెట్ నిర్వహిం చిన ఏఐవైఎఫ్ బృందాన్ని వారు అభినందించారు. ఈ టోర్నమెంట్ లో ఖైరతాబాద్‌కు చెందిన ఏవీ కళాశాల జట్టు విజేత కాగా, ఈసీఐఎల్‌కు చెందిన వసుంధర జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ట్రోఫీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఓయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్. బోస్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి, సక్రిభాయి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యారా నరేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్ ,ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- మంచినీటి కష్టాలు రాకుండా చూడాలి
- కార్పొరేటర్ వెంకటేష్



నవతెలంగాణ - బంజారాహిల్స్

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, వేసవి కాలంలో మంచినీటి కష్టాలు రాకుండా చూడాలని జూబ్లీహి ల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఖైరతా బాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, వాటర్ బోర్డు ఎం హరీష్ శంకర్‌లకు సోమవారం ఆయన వినతి పత్రాలు అందజేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇంద్ర నగర్, సాగర్ సొసైటీ టీడీపీ ఆఫీస్ బిల్డింగ్ వెనక ఉన్న ఈ బస్తీల ప్రజలు గత 30 ఏండ్ల నుంచి పడుతున్న నీటి కష్టాలకు ఇన్నాళ్లకు మోక్షం లభించిందన్నారు. తట్టి ఖానా నుంచి వచ్చే నీటిని రోడ్ నెంబర్ 14 కేబీఆర్ పార్క్ జంక్షన్ వద్ద నుంచి నూతన 450 ఎంఎండయా పైప్ లైన్ నిర్మించి టీడీపీ ఆఫీస్ వద్ద ఉన్న పైప్ లైన్ కి లింక్ చేయడం ద్వారా ఇంద్ర నగర్, జవహర్ నగర్, సాగర్ సొసైటీ, ఆరోరా కాలనీ, కమలాపురి కాలనీలకు నీటి కొరత సమస్య తీరనుందని చెప్పారు. అంతేకాకుండా బస్తీలకు రాత్రి పూట కాకుండా, ఉదయాన్నే నీటిని సప్లై చెయ్యడానికి వీలు కలుగుతుందన్నారు.నీటి కొరత సమస్య ను బంజారా హిల్స్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ కమిషనర్లకు వివరించాగా వారు పైప్ లైన్ నిర్మాణ పనులకు 10 రోజులపాటు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు అనుమతి ఇచ్చినట్టు అధికారులు పేర్కొ న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సుమారు 42 లక్షల రూపాయలతో నిధులు మంజూరు కాగా,నూతన పైప్ లైన్ నిర్మాణానికి ట్రాఫిక్ పెద్ద అడ్డంకి గా మారింద న్నారు.నిర్మాణ పనులకు అనుమతి ఇచ్చిన పోలీస్ ట్రాఫిక్ డిపార్ట్మెంట్ అధికారులకు వాటర్ డిపార్ట్మెంట్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలోని ఫిల్మ్ నగర్ లోని వినాయక నగర్, పద్మాలయ అంబేద్కర్ నగర్, బసవతారక నగర్ లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రయినేజీ సమస్యను ఎస్ ఆర్ నగర్ వాటర్ డిపార్ట్మెంట్ మేనేజర్ హరిశంకర్‌కు వివరించి నూతన సివరేజ్ పైప్ ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

జీహెచ్‌ఎంసీ చైన్ మెన్‌ల అవినీతిపై ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీ సర్కిళ్లలో విధులు నిర్వహిస్తున్న చైన్ మెన్ (మున్షి)ల అవినీతి మితిమీరిపోతుందని, చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ సోమవారం ప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు. చైన్ మెన్‌ను స్థానచలనం చేయాలని లిఖిత పూర్వకం గా పిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని సర్కిళ్లతో పాటు సికింద్రాబాద్,బేగంపేట్ సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయని తెలిపారు. వాటికి కారణం చైన్ మెన్‌లే అని ఆరోపించారు. వారు నిర్మాణదారులతో లోపాయికారి ఒప్పందం చేసుకొని ధనార్జనే ధ్యేయంగా ఉన్నారన్నారు. సెక్షన్ ఆఫీసర్, ఏసీపీలను మేనేజ్ చేస్తూ అక్రమ కట్టడాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. వారికి నెలకు వచ్చే వేతనం కన్నా... నాలుగు, ఐదు రెట్లు భవన నిర్మాణదారుల వద్ద వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వహిస్తూ సర్కిల్ మొత్తాన్ని వారి గుప్పట్లో పెట్టుకుంటున్నారని తెలిపారు. చైన్ మెన్ ల ఆదాయానికి మించిన ఆస్తులపై కూడా త్వరలో ఏసీబీకి ఫిర్యాదు చేయనున్నట్టు ముప్పిడి స్పష్టం చేశారు.

అపోలోలో జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్ ప్రారంభం

- కీళ్ల నొప్పుల చికిత్సలో మరో అధ్యాయం
- పాల్గొన్న అపోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

శస్త్ర చికిత్స అవసరం లేకుండానే కీళ్ల నొప్పులు మాయం చేసే కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో యాజమాన్యం సోమవారం ఘనంగా ప్రారంభించింది. కీళ్ల నొప్పులతో బాధపడుతున్నవారికి ఇది ఒక వరమనే చెప్పుకోవచ్చు. బాధితుల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని శస్త్రచికిత్స అవసరం లేకుండానే దీనిని రూపొం దించారు. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, వాపు సమస్యలు, స్నాయువు గాయాలతో బాధపడుతున్న రోగుల అవసరాల తీర్చేలా డిజైన్ చేశారు. అసౌకర్యం కలగకుండా, శస్త్ర చికిత్స అవసరం లేకుండానే నొప్పులను తగ్గించే విధంగా దీనిని రూపొందించారు.

అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ "జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్ రోగికి సౌకర్యవంతంగా ఉండే చికిత్స. ఇది అన్ని వయసుల వారికి ఉపయోగకరంగా, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న అన్ని వయసుల వారికి ప్రయోజనం చేకూర్చేలా దీన్ని రూపొందించారు. ఇందులో భాగంగా టైలర్డ్ అడ్వైజ్, ట్రీట్మెంట్, థెరపీస్, రీహాబిలిటేషన్ , పోషకాహారం, అవసరమైన ప్రత్యామ్నాయ చికిత్సలు- '3 టీఎస్' పై దృష్టి పెడుతుంది. బాధితులు కీళ్ల సమస్యల నుంచి బయటపడటంతోపాటు సుదీర్ఘకాలంపాటు ఆరోగ్యవంతమైన జీవనశైలితో గడిపేందుకు ఇది ఉపయోగ పడనుంది. కీళ్ల పనితీరు మెరుగుపరిచి బాధితులను శక్తివంతులను చేయాలనే కతనిశ్చయంతో మేం పని చేస్తున్నాం" అని అన్నారు. "కీళ్ల నొప్పుల నుంచి కాపాడ టానికి ఈ నూతన కార్యక్రమం ఆర్థోస్కోపిక్ పద్ధతులను చికిత్సలతో అనుసంధానిస్తుంది. కీళ్ల పనితీరును మెరుగుపరచడం,పూర్తి కీలు మార్పిడి అవసరం లేకుండా సమస్య నివారించడంపై మేము దష్టి సారించాం" అని అపోలో హాస్పిటల్స్ చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్థ్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె జె రెడ్డి అన్నారు. ఆర్థ్రోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ రవితేజ రుద్రరాజు మాట్లాడుతూ "ఈ కార్యక్రమం అత్యాధునిక రీ జెనరేటివ్ చికిత్సలను సమగ్రమైన రీహాబిలిటేషన్, పోషకాహార పద్ధతులతో మిళితం చేసి సమగ్ర చికిత్స మార్గాన్ని అందిస్తుంది. తద్వారా కీళ్ల సమస్యలకు ముందుగానే ప్రభావవంతమైన చికిత్స అందేలా తోడ్పడుతుంది"అని అన్నారు. జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రాంలో భాగంగా ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మా చికిత్స, అత్యాధునిక స్టెమ్ సెల్ వినియోగం వంటి మార్గదర్శక పునరుత్పత్తి చికిత్సలతో పాటు అధునాతన ఆర్థోబయోలాజిక్ చికిత్సలను ఉపయోగించడం ద్వారా, రోగులు తమ కీళ్ల పనితీరును మెరుగ్గా నిర్వహించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో జూబ్లీ హిల్స్- అపోలో హాస్పిటల్స్ సీఈఓ తేజస్వి రావు, ఫుట్ అండ్ యాంకిల్ సర్జన్ కన్సల్టెంట్ డాక్టర్ వరుణ్ కొమ్మలపాటి పాల్గొన్నారు.

ఓయూను సందర్శించిన ఎస్సీ ఎస్టీ కమిషన్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సోమవారం ఉస్మానియా విశ్వవి ద్యాలయాన్ని సందర్శించింది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యా ర్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించింది. ఇంజినీరింగ్ కళాశాలలోని ఈ క్లాస్ రూంలో జరిగిన సమీక్షా సమావేశంలో కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య నేతృత్వంలో సభ్యులు, రాంబాబు నాయక్, కొనకంటి లక్ష్మీనారాయణ, రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్ సహా డిప్యూటీ డైరెక్టర్ చరణ్ దాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్ కమిషన్‌కు స్వాగతం పలికారు. సమీక్షలో భాగంగా కమిషన్ చైర్మెన్ మాట్లాడుతూ. ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థు లకు అవసరమైన ఉపకారవేతనాలు అందించేలా యూజీ సీ, ఇతర ఏజెన్సీలతో సంప్రదింపులు జరపాలని వీసీని కోరారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.అధ్యాపకులు, ఉద్యోగులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఓయూ లాంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయానికి కమిషన్ చైర్మెన్ హెూదాలో రావటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ సహా ఇతర సభ్యులు పలు అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఓయూ వీసీ వివరాలు అందించారు. ఓయూపై సమగ్ర సమాచారంతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషన్‌కు వివరించారు. ఓయూలో అమలు చేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్స్, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన వివరాలు సహా బడ్జెట్, గుర్తింపు వివరాలు, వివిధ రంగాల్లో ఓయూ పురోగతిపై మాట్లాడారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలిచ్చారు. ప్రభుత్వ అనుమతి రాగానే బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పదోన్నతులు సహా అన్ని రకాల రిక్రూట్ మెంట్లలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూసే బాధ్యత తనదేనని వీసీ హామీ ఇచ్చారు. పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు పలు సమస్యలతో పాటు సూచనలు సలహాలు కమిషన్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూలోని ఆయా కళాశాలలు, విభాగాల ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కమిషన్‌కు వినతిపత్రం

ఓయూకి విచ్చేసినరాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్‌ను, సభ్యులను యూనివర్సిటీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులు,రీసెర్చ్ స్కాలర్స్ కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఓయూలో చదువుకుంటున్న విద్యార్థులకు ఫెలోషిప్,ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించాలని, ఓయూలో దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయా లని,యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తి చేయాలని, ఓయూ అభివద్ధికి ప్రత్యేకంగా రూ. 1000 కోట్లు కేటాయించేలా చొరవ చూపాలని కోరారు.ఓయూలో డా.బాబు జగ్జీవన్ రామ్ స్టడీ సెంటర్ స్థాపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ ,విద్యార్థులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, వలిగొండ నరసింహా, సొందే అన్వర్, అజయ్ సామ్రాట్, నందు, ఆరెకంటి శ్రీకాంత్, కొప్పు శ్రీశైలం,వంశీ, చెరుకుపల్లి అనిల్ మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 1535 యూనియన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 28వ వార్షికోత్సవాల వేడుకల్లో భాగంగా విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి మిగతా యూనియన్లతో పాటు తమ 1535 యూనియన్ ముందు వరుసలో ఉంటుందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, శ్రీనివాస్, ప్రమోద్ లు తెలిపారు. సోమవారం కళ్యాణ్ నగర్ కార్యాలయంలో జరిగిన 28వ వార్షికోత్సవ వేడుకల్లో ముందుగా కేక్ కటింగ్ చేసి కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల సమస్యలకు ప్రస్తుత సీఎండి ముషారఫ్ అలీ సహకారం ఎనలేనిదని కొనియాడారు. 20 వేల మంది ఆర్టిజన్స్ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని ప్రస్తుత ప్రజాపాలన ప్రభుత్వం చేయొద్దన్నారు. అనేకమంది ఇప్పటికీ తాత్కాలిక ఉద్యోగాలుగానే పనిచేస్తున్నారని వారి వేతనాలు సైతం పని గంటలకు సమానంగా లేవని చెప్పారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి కుటుంబాలు పోషించుకునేలా వేతనాలు చెల్లించి వారిని ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, విద్యుత్ శాఖ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు సైతం తాము వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. బిల్ కలెక్టర్ల విషయంలో సైతం మానవతా దక్పథంతో ఆలోచించి ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు వసంత, సంధ్యరేణుక,సోనీ,అఖిల, ఉపాధ్యక్షులు సురేష్ రాజు, లింగం,కోటి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్.. 11 మంది సెలబ్రిటీలపై కేసు

నవతెలంగాణ-బంజారాహిల్స్

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న వారిని ఇప్పుడు కేసులు వెంటాడుతున్నాయి. ఇప్పటికే లోకల్‌బాయ్ నానీ, బయ్యా సన్నీ యాదవ్.. హర్షసాయిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నందుకు కేసు నమోదు చేసినట్లు సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. సజ్జనార్ పోస్టులతో.. ఇప్పటికే వైజాగ్ లోకల్ బాయ్ నానిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. మరో యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ మీద కూడా కేసు నమోదు చేశారు. తాజాగా మరో 11 మంది సెలబ్రిటీలపై కేసులు నమోదు చేశారు పంజాగుట్ట పోలీసులు. విష్ణుప్రియ, సుప్రీత, రీతూ చౌదరి, హర్షసాయి, టేస్టీ తేజ, పరేషాన్ బాయ్స్ ఇమ్రాన్ వంటి పులువురిపై కేసులు నమోదయ్యాయి. బెట్టింగ్ యాప్‌లతో ఎంతోమంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారంటూ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కోట్లలో సంపాదించి.. వేలల్లో పంచుతూ సంఘ సేవ చేస్తున్నట్లు పోజులు కొడుతున్న ఇలాంటి వారినా మీరు ఫాలో అవుతుంది అంటూ ప్రశ్నించారు. బెట్టింగ్ అనేది సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని భారత ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తోందన్నారు సజ్జనార్. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సైబర్ టెర్రరిస్టులను అన్‌ఫాలో కొట్టండి.. వారి అకౌంట్‌లను రిపోర్ట్ చేయండంటూ ట్వీట్ చేశారు సజ్జనార్. బెట్టింగ్ యాప్స్ పెద్ద మోసం. దీనికి తోడు కొంత మంది అదే పనిగా ప్రమోట్ చేస్తుండటంతో ఈ యాప్‌లలో ఇన్వెస్ట్ చేసి మోసపోతున్నారు జనం. అందుకే పోలీసులు ఓ వైపు వారిపై కేసులు పెడుతూనే.. బెట్టింగ్ యాప్స్‌తో ఉన్న ప్రమాదంపై అప్రమత్తం చేస్తున్నారు.



పిల్లల అభ్యాసన తీరును రోజూ పరిశీలించాలి





- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- లాలాపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యలో వెనుకబడిన పిల్లల అభ్యాసనలో ఉపయోగపడే కృత్రిమ మేధస్సు ఏఐ ఏఎక్సెల్ అభ్యాసన తీరును ప్రతిరోజు పరిశీలించాలనీ, వారు విద్యపై పట్టు సాధించేలా మెరుగైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం సికింద్రాబాద్ లాలాపేట ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్, ఏఐ, ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను పరిశీలించి సీ-గ్రేడ్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా నేర్చుకుంటున్న కంప్యూటర్ విద్యను కలెక్టర్ పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు పదిమంది విద్యార్థులకు 5 గంటలు విద్యా బోధన జరగాలని, ఇప్పటివరకు ఎంతమంది విద్యార్థులకు తరగతులు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ గదిలో ప్రతి కంప్యూటర్ వద్ద విద్యార్థుల ఉపయోగార్థం ఇయర్ ఫోన్ తప్పక ఉండాలనీ, సత్వరమే ఏర్పాటు చేసి నివేదిక అందచేయాలనీ ఆదేశించారు. సీ-గ్రేడ్లలో 3వ తరగతి నుంచి 5వ తరగతిలో పిల్లలందరికీ మెరుగైన సాంకేతిక బోధన అందించాలనీ, గ్రేడ్ల వారీగా తరగతులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణి, డిప్యూటీ ఈవో బాలు నాయక్, హెచ్ఎం ఈ.రమణమ్మ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

విద్యార్థులలో కంటి చూపు లోపాలని ముందుగా గుర్తించి మెరుగైన చికిత్సలు అందేలా ప్రభుత్వం ఉచిత కంటి పరీక్షలు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం మెహిదీపట్నం సఫ్దరియా బాలికల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే ద్వారా దృష్టి లోపం ఉన్న పిల్లలకు కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని చదవాలన్నారు. విద్యార్థులు మొబైల్, టాబ్, కంప్యూటర్, టీవీ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై ఎక్కువ సమయం కేటాయించడంతో వారిలో కంటి సమస్యలు ఎక్కువుతున్నాయన్నారు. నివారణకు హైదరాబాద్ జిల్లాలో మొదటి దశలో గతేడాది ఏప్రిల్‌లో రెసిడెన్షియల్ హాస్టల్స్‌లలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. రెండో దశలో సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు అనుబంధ పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహించామని గుర్తుచేశారు. దృష్టి లోపాన్ని గుర్తించి నాణ్యమైన కంటి అద్దాలను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని 695 పాఠశాలలో 71,309 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా.. అందులో 8,849 మందికి వక్రీభవన లోపాలతో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. 15 రోజులపాటు పూర్ణ పరీక్ష అయిదు ప్రధాన ఆస్పత్రిలో నిర్వహించగా.. 7,524 మంది విద్యార్థులకు దృష్టి లోపాలున్నాయని ధ్రువీకరించడంతో.. వా ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా నాణ్యమైన కంటి అద్దాలు అందించే దిశగా అందరికీ ఆర్‌బీఎస్‌కే ద్వారా కంటి అద్దాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు అందించామన్నారు. దృష్టిలోపమున్న పిల్లలు వారు తప్పనిసరిగా కళ్లద్దాలు వాడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, డీఈవో రోహిణి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ సాయిబాబా, డాక్టర్ మురళీధర్, డీఐవో డాక్టర్ శ్రీధర్, డీఎంవో రాములు, కార్పొరేటర్ సర్ఫరాజ్ అహ్మద్, పాఠశాల కరస్పాండెంట్ అలీ మీర్జా, హెచ్ఎం బేబీజైనబ్, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 ఇవ్వాలి

- వేధింపులు అరికట్టాలి, పని భారం తగ్గించాలి
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్
- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీకి వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆశా యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీకి వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్లు 18 ఏండ్లుగా పని చేస్తున్నప్పటికీ ఫిక్స్‌డ్ వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం లేదన్నారు. కనీస వసతుల్లేవనీ, పనికి పారితోషకం పేరుతో ప్రభుత్వాలు ఆశాల శ్రమను దోసుకుంటు న్నారన్నారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఈనెల 18న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా, 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 21వ తేదీన పీహెచ్‌సీ సబ్ సెంటర్ల ఎదుట నిరసన, 24వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఎలక్షన్ ముందు మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం చేస్తామని మాటిచ్చిన సీఎం, ఇప్పుడు నెరవేర్చాలన్నారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయిస్తూ జీవో చేయాలనీ, లేదంటే ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశాల సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన పోరాటం కొనసాగిస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి, జిల్లా నాయకులు రాధా, యాదమ్మ, లలిత, కోమలత, మంగ, తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల అనారోగ్యానికి గురై బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుని.. వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్





24న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి

- డ్రైవర్లకు సీఐటీయూ నాయకుల పిలుపు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మార్చి 24న చలో పార్లమెంటు ప్రోగ్రాంలో పాల్గొని జయప్రదం చేయాలని, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ(AIRTWF-citu) ఆధ్వర్యంలో స్థానిక డీసీఎం, అశోక్ లైలాండ్, టాటా ఏసీ వాహనాల డ్రైవర్ల తో కమలాపురి కాలనీ జీహెచ్ఎంసీ పార్కులో సోమవారం సీఐటీయూ నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సంఘం కార్యదర్శి అజయ్ బాబు, జూబ్లీహిల్స్ జోన్ సీఐటీయూ నాయకులు, జాకటి స్వామి, ప్రజా సంఘాల నాయకులు, టి సాయి శేషగిరి రావు,లు పాల్గొని మాట్లాడారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రవాణా రంగ కార్మికులు ఆటో, కార్, డీసీఎం ,లారీ ,మినీ డీసీఎం, టాటా ఏసీ, ట్రాక్టర్ ,అంబులెన్స్, స్కూల్ బస్సు ,ట్రక్కు, ప్రోక్లైనర్, వరి కోత మిషన్ , జేసీబీ బోర్ బండి, టూరిస్ట్ బస్సు ,ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు, క్లీనర్స్, మెకానికల్స్ ,లు అధిక సంఖ్యలో చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల స్థితిగతులు ,సామాజిక సంక్షేమ చట్టం, డ్రైవర్ల పై పెనాల్టీలు ,కేంద్రం ప్రకటించిన ప్రమాదకర నాలుగు లేబర్ కోడ్ లు, కుదేలైన రవాణా రంగం, ఇటువంటి అనేక సమస్యలపై మాట్లాడుతూ, మొత్తం 17 డిమాండ్లు నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వివరించారు . ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రాజు, సత్యనారాయణ, శివ ,స్వామి, రవి, మురళి, వెంకటరెడ్డి ,శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



భారత్ నగర్ బస్తీ మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహ్మద్ గౌస్ మొయినుద్దీన్ (ఖలీల్)తో పాటు బస్తీకి చెందిన 50 మంది కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం బోరబండ కార్పొరేటర్ మరియు హైదరా బాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి శ్రీమతి హాబీబా సుల్తానా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె చేతుల మీదుగా కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. చేరిన వారిలో రాజప్ప, అక్తర్, మొయిన్, హమీద్, రహమాన్,సల్మాన్,పర్వీన్, షాహిన్ , డివిజన్ అధ్యక్షుడు అశోక్, ఖయ్యూమ్, భరత్ నగర్ బస్తీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేష్ కాసుల, మున్నా తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD O.S.No.4327 OF 2024

Between:
State Bank of India,
Gaddiannaram Branch,
H.No. 16-2-740/75/13,
VK Dhage Nagar, Dilsukhnagar,
Hyderabad. Rep. by its Branch Manager
...Plaintiff
And:
Vamshilatha Chilumula,
D/o.Siramdas Shyam
...Defendant
To
Vamshilatha Chilumula,
D/o.Siramdas Shyam Aged about 37 years, Occ: Employee Plot No.32, Sai Brindhavan Colony, Dammaiguda, Nagaram, Medchal, Malkajgiri - 500083.

Please take notice that you are evading to receive summons sent by this. Hon'ble Court. The above mentioned Hon'ble Court was pleased to order notice to you by way of publication in this daily. You are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 25-03-2025 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT.RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar,
Gaddiannaram, Hyd-500 060.
Cell: 9030617991

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL. METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: ATHIVELLI O.S.NO.07 OF 2024

Between:
Mr.Naragani Veera Krishna
S/o.N.Eshwara Rao R/o.Plot.No.34 Sy.No.332, Sri Bhavani Colony, Gajularamaram Village, Qutbhullapur Mandal, Medchal-Malkajgiri District- 500055
Mob No. 9248061629
...Plaintiff
AND
1.Smt.A.Anantha Lakshmi
W/o.A.N. Murali Krishna
R/o.H.No. 8-1-284/481,
O.U.Colony, Shaikpet, Golconda, Hyderabad-500081
2.Mr.Patel Venkatesh Goud,
S/o.Patel Penta Goud R/o.
H.No.4-82, Niranjan Society,
Sri Ram Nagar Colony,
Bahadurpally, Dundigal-Gandimaisamma Mandal,
Medchal-Malkajgiri District-500043
3.Mr.N.Shankar Rao, S/o.
N.Koteswar Rao, R/o.5-3-256, Plot No.48, Venkatrao Nagar Colony, Kukatpally, Hyderabad-500072
...Defendants

WHEREAS, Respondents/Plaintiffs have filed a civil suit for injunction and Defendants No.1,2 & 3 are avoiding to receive the summons and as per the Hon'ble court direction issued summons to Defendant No.1 to 3 several times but the Defendant No.1,2 & 3 avoiding to receive the summon and as per the Hon'ble court direction hereby summoned for Defendant No.1,2 & 3 in this court by in a person or by a pleader duly instructed and able to answer all the material questions relating to the suit and petition who shall be accompanied by some person able to answer all such questions on the date of the suit and same is posted on 25-03-2025 for all of your appearance at 10-30 A.M in the above court. Take notice that in default of your appearance on the said day the matter will be determined in your absence.

(BY THE ORDER OF THE COURT)
M/S.G.N.SATYANARAYANA
K.Varun Yadav,
Advocates
Flat # 101, First Floor, Chayamina Enclave, AS Raju Nagar,
Kukatpally, Hyderabad – 500 072
Cell No.9246100703 / 9618117703

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL. METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: ATHIVELLI O.S.NO.06 OF 2024

Between:
Mr.Komera Srinu S/o.Komera Narayana R/o. H.No.16-200,
Vignan Nagar, Huzurnagar Mandal, Nalgonda District,
Telangana-508204
Present Residing at Plot No.12,
Lakshminagar Colony,
Back side of HDFC Bank,
Shaikpet Nala, Tolichowki,
Hyderabad- 500008
Mob No. 9912233495
...Plaintiff
AND
1.Smt.A. Anantha Lakshmi
W/o.A.N. Murali Krishna
R/o. H.No. 8-1-284/481,
O.U.Colony, Shaikpet, Golconda,
Hyderabad-500081
2.Mr. Patel Venkatesh Goud,
S/o. Patel Penta Goud R/o.
H.No.4-82, Niranjan Society,
Sri Ram Nagar Colony,
Bahadurpally, Dundigal-Gandimaisamma Mandal,
Medchal-Malkajgiri District-500043
3.Mr.N.Shankar Rao, S/o.
N.Koteswar Rao, R/o.5-3-256, Plot No.48, Venkatrao Nagar Colony,
Kukatpally, Hyderabad-500072
...Defendants

WHEREAS, Respondents/Plaintiffs have filed a civil suit for injunction and Defendants No.1,2 & 3 are avoiding to receive the summons and as per the Hon'ble court direction issued summons to Defendant No.1 to 3 several times but the Defendant No.1,2 & 3 avoiding to receive the summon and as per the Hon'ble court direction hereby summoned for Defendant No.1,2 & 3 in this court by in a person or by a pleader duly instructed and able to answer all the material questions relating to the suit and petition who shall be accompanied by some person able to answer all such questions on the date of the suit and same is posted on 25-03-2025 for all of your appearance at 10-30 A.M in the above court. Take notice that in default of your appearance on the said day the matter will be determined in your absence.

(BY THE ORDER OF THE COURT)
M/S. G.N. SATYANARAYANA
K.Varun Yadav,
Advocates
Flat # 101, First Floor, Chayamina Enclave, AS Raju Nagar,
Kukatpally, Hyderabad – 500 072
Cell No.9246100703 / 9618117703

IN THE COURT OF HON'BLE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVL COURT AT: SECUNDERABAD O.S.No.213 OF 2025

BETWEEN:
1.Sangineni Anuradha,
W/o J Sanjay, Aged about 51 yrs, Occ: Emp, R/o H.No: T R T qrts 192, T R T Quaters Seethafal mandi, Secunderabad, Hyderabad- 500061.
2.Janapareddy Vasudha, D/o J Sanjay, Aged about 25 years, Occ: Emp, R/o H.No: T R T qrts 192, T R T Quaters Seethafal mandi, Secunderabad, Hyderabad- 500061.
3.Janapareddy Pavan S/o J Sanjay Aged about 24 years, Occ: Emp, R/o H.No: T R T qrts 192, T R T Quaters Seethafal mandi, Secunderabad, Hyderabad- 500061.
...Plaintiffs
A N D
1.Sangineni Nageshwar Rao,
S/o Seetharama Swamy,
Aged about 80 years, Occ: House hold, R/o H.No.11-1-163,
Seethafalmandi, Near Andhra Bank, Secunderabad-61
2.All concerned
...Defendants

Please take notice that the above suit is filed by the plaintiffs to declare them as legal heirs of Deceased Janapareddy Sanjay and the same is posted on 28-03-2025, if any person/s having any objection / claims kindly appear either in person or through an advocate in the above said court at 10-30 a.m. on the above said date, as otherwise the matter will be decided accordingly.

// By Order of Court//
N. Ramakrishna
Advocate
Off:11-1-30/2
Seethafalmandi-61
Cell No.830939031

IN THE COURT OF THE HON-BLE II ADDL SENIOR CIVIL JUDGE-Cum-ADDL CHIEF JUDICIAL MAGISTRATE ::MED-CHAL-MALKAJGIRI DISTRICT At: MALKAJGIRI O.S.NO:112 OF 2025

Between:
CHITTIREDDY PRADEEP REDDY & OTHERS
...Plaintiffs 1 to 3
And
THE TAHSILDAR UPPAL & OTHERS
...Defendants 1 to 3

To All Concerned: Defendant no:3
That the above named Plaintiffs are filed the above suit for declaration to declare them as Class-1 Legal Heirs in respect of suit schedule properties of deceased Late Smt. SANDHI TRIVENI, who died on Dtd.23.02.2024 Intestate Against you and others said suit is posted on 08/04/2025 for objections. If any person or persons is /are having any objections may appear before the Hon'ble Court on dtd 08/04/2025 at 10:30 AM. Either in person or through an Advocate. Failing which the matter will be decided as per law in your Absence.

SCHEDULE OF PROPERTIES
PROPERTY- 1
All that the flat bearing number.102, on first floor, in House bearing no. 4-6-17/3A/102, with plinth area of 1200 Sft., (including car parking & common area) undivided share of land admeasuring 38.12 Sq.yds., or 31.86 Sq.mtrs., (out of total extent of 305 Sq.yds., or 254.98 Sq.mtrs.,) of "ARYAN ENCLAVE", on Plot no 61, in survey no. 71,72,75,76 & 77, Situated at Savarkar nagar, Nacharam, Uppal mandal, under GHMC Kapra circle, Medchal-Malkajgiri District, Telangana, and bounded by:-

BOUNDARIES OF FLAT NO. 102, IN FIRST FLOOR
NORTH : Open to Sky., SOUTH : Flat No. 101 & Staircase. EAST : Corridor & Open to Sky. WEST : Open to Sky.

PROPERTY-2
The open Plot No.43, admeasuring to an extent of 200.00 Sq. Yards., (or) 166.67 Sq.Mts., in Survey Nos. 821/1 & 821/2, situated at Waddepally Revenue Village, Hanamkonda Mandal, Warangal City & District (Urban) and within the limits of Greater Warangal Municipal Corporation, and within the District Warangal-Urban and it is in the jurisdiction of the Joint Sub-Registrar Registration Office, Warangal-Urban. There is no structure or house in the said sold plot and the said plot is not covered by any ward and block and the following boundaries:: EAST : PLOT No. 51 of Sri.T.SANTHOSH KUMAR WES: 40'-0"WIDE ROAD, NORTH :PLOT No.44, SOUTH : PLOT No.42 of M. SHOBA RANI

//By Order of the court//
Y.BHARATH
Advocate.
Ho.No: 2-81/59/43 Dwarakanagar phase 1, Chengicherla,
Hyderabad 500098,
Ph:9618214652,

IN THE COURT OF THE HON-BLE II ADDL SENIOR CIVIL JUDGE-Cum-ADDL CHIEF JUDICIAL MAGISTRATE ::MED-CHAL-MALKAJGIRI DISTRICT At: MALKAJGIRI O.S.NO:70 OF 2025

Between:
CHOPPARA VASUMATI DEVI & OTHERS
...Plaintiffs 1 to 4
And
THE TAHSILDAR UPPAL & ANOTHER
...Defendants 1 & 2

To All Concerned: Defendant no:2
That the above named Plaintiffs are filed the above suit for declaration to declare them as Class-1 Legal Heirs in respect of suit schedule property of deceased Late Late CHOPPARA SESHAGIRI RAO, who died on Dtd.16.08.2024 Intestate Against you and others said suit is posted on 28/03/2025 for objections. If any person or persons is /are having any objections may appear before the Hon'ble Court on dtd 28/03/2025 at 10:30 AM. Either in person or through an Advocate. Failing which the matter will be decided as per law in your Absence.

SCHEDULE OF PROPERTY:
All that the Flat No. 406, in third floor of AKANKSHA APARTMENTS, admeasuring 891 Sft., of plinth area (including common areas), together with undivided share of land admeasuring 35.70 Sq.yds or 29.84 Sq.mtrs, out of total land admeasuring 964.Sq.yds or 806.4 Sq.mtrs being constructed in open plot, in survey no. 23 situated at Block No. 4, Sneha nagar, Habsiguda village, Uppal mandal and municipality, Medchal-Malkajgiri district (than Rangareddy District), and bounded by :- North : Neighbour's Land, South : 30' wide Road, East : Neighbour's Land West : Neighbour's Land.

FLAT NO. 406 THIRD FLOOR IS BOUNDED AS:-
North : Lift & Flat No.405
South : Open to Sky
East : Open to Sky
West : Passage

//By Order of the court//
Y.BHARATH
Advocate.
Ho.No: 2-81/59/43 Dwarakanagar phase 1, Chengicherla,
Hyderabad 500098,
Ph:9618214652,

IN THE COURT OF THE JUDICIAL FIRST CLASS MAGISTRATE:: AT: KALWAKURTHY: S.T.C.N.I. No.1 OF 2024

Between:-
G. Jaipal Reddy S/o Venkat Reddy, aged about 35 years, resident of Revalli village, Urkonda mandal, Nagarkurnool district.
...Complainant
And
Chintapally Ram Reddy S/o Ranga Reddy, resident of Plot No.82, Jayasurya Patnam Phase-IV, Badangpet municipality, R.R.district. 501510.
...Accused

PUBLIC NOTICE
That my client by name G. Jaipal Reddy filed the above complaint under the Section 138 of N.I. Act, against you for cheque bounce. The case is posted on 24-3-2025 at 10.30 A.M. for your appearance. You are hereby directed to attend on the said date in person or advocate, failing which the matter will be decided on merits.

//By Order of the Hon'ble Court//
D. Bhavani Prasad,
Advocate.
H.No. 1-376/1,
Rangarao Thota,
Badepally, Jadcherla,
MBNR dist.© 8522999979

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE AT SANGAREDDY
EP. NO. 2 OF 2023
IN
O.S.NO. 152 OF 2018

Between :
S.Savitri
... Decree Holder/Plaintiff
AND
Vidavaluru Mohan Rao& Another
...JDR'S/Defendants
To
1 Sri Vidavaluru Mohan Rao S/o.V.PattabhiRamaiah, Aged about 69 years, Occ: Business, R/o. Plot no.10, Srinivasa Colony, Manikonda, Hyderabad.
2. Sri VidavaluruLavanyaW/o. V.Mohan Rao, Aged about 62 years, Occ: Business, R/o. Plot no.10, Srinivasa Colony, Manikonda, Hyderabad.

NOTICE
Take notice that my clientS.Savitrifiled the above EP against you before the Hon'bleII Addl.Senior Civil Judge, At: Sangareddy. The above case is posted on 1-01-2025 for your appearance. On that day you may appear before Hon'bleSenior Civil Judge, At: Sangareddy, by 10.30 A.M. either in person or through advocate failing which the case will be decided in your absence.

// BY ORDER OF THE COURT//
P. NARENDER REDDY,
J.MADHAVI,
ADVOCATES
SANGAREDDY
Cell: 7093056659

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA SOP NO 4 OF 2025

Between:
1. K. KRISHNAVENI
D/O Late Krishna ,Aged about 46 years, Occ: Cook R/o 19-172/15-12, Dinakarnagar ,West Venkatapuram, Alwal mandal, Medchal Malkajgiri District-500015
Phone - 9553324364
2. R. RAMANI alias T.Ramani
w/o T Anand aged about 50 years ,Occu: Housewife R/o 1-19-108,Kotha Basthi ,Venkatapuram, Alwal mandal,Medchal Malkajgiri District-500015
... Plaintiff
AND
1. The Manager,
Reserve Bank of India,
AG office Road,Saifabad, Hyderabad, Telangana-500004
2. All Concerned
... Defendants
To
D2) All concerned ....Defendant No.2

Please take notice that the above named plaintiffs have filed a succession petition against Defendants vide SOP No 4 of 2025 on the file of Hon'ble **SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA** and the same is posted to 24-03-2025 at 10.30 A.M for your appearance before the aforesaid court either in person or through an Advocate failing which the court will pass appropriate orders in your absence according to law.

(BY ORDER OF THE COURT)
K W J BOSE
ADVOCATE
Address: 21-205 , Rd no 9
West Venkatapuram, Secunderabad. 500015.
Mobile No.9440475569

IN THE HON'BLE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD O.S.No.4329 OF 2024

Between
State Bank of India,
RACPC-III, Himayatnagar,
D.No.3-6-263 264, II Floor, CCPL Sterling Building, Himayatnagar,
Hyderabad Rep. by its Manager
SARC/Authorised Officer Doranola Sravan Kumar S/o.D.Yadagiri Sharma
...Plaintiff
And:
Bokka Baswa Reddy S/o
Bokka Muthyam Reddy
...Defendant
To
Bokka Baswa Reddy
S/o Bokka Muthyam Reddy
Aged about. 57 years Occ: Employce H.No.4-9-51/62, Vijaya Nagar Colony, Phase-2, Bagh Hayathnagar,
Ranga Reddy-501 505.

Please take notice that you are evading to receive summons sent by this Hon'ble Court. The above mentioned Hon'ble Court was pleased to order notice to you by way of publication in this daily. You are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 25-03-2025 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT. RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar,
Gaddiannaram, Hyd-500 060.
Cell: 9030617991

IN THE COURT OF THE HON'BLE IV JUNIOR CIVIL JUDGE RANGA REDDY DIST. AT: L.B.NAGAR OS.NO.789 OF 2024

Between:
Mangalpally Kavitha and Others
.....Petitioner/Plaintiff
And
The Tashildar, Balapur Mandal.
.....Respondents/Defendants
To,
Whomsoever it may concern
(All Concerned)

PUBLIC NOTICE
The Petitioner/plaintiff has filed the above suit for declaration/declaring the plaintiffs as the absolute owners and possessors of suit schedule property being the legal heirs of the deceased sri. Mangalpally Rama Raju. Plaint presented under order VII rule 1 to 6 R/w section 26 of CPC. The Plaintiffs be Any concern Person or persons claiming below scheduled property of above named may present before above said Court on 09/04/2025 at 10:30 along with related documents or else this Hon'ble court may take appropriate steps for further proceedings as per law.

SUHEDULE PROPERTY
All that the piece and parcel of the land bearing H.No.2-66/1, plot no 7, Northern part, admeasuring about 99 sq.yards or 82.77 sq. mts, in Sy.no.47, situated at Raghavendra Nagar Colony, Meerpet, Balapur Mandal, Ranga Reddy District, TG-500097
Bounded by:- North ; Plot no 6,
South : Plot no 7 Southern Part:
East : NEIGHBOUR'S Land:
West : 25'.0" WIDE ROAD

(BY ORDER OF THE COURT)
K. Sravan Kumar Reddy
A.Srikanth, Advocates
Phone:- 7396272177

CHANGE OF NAME

I, PATAN HEENA, R/O H.No.1-8-1/B/38 Rajiv Gandhi Nagar, Baghlingampally, Hyderabad, **Changed My Name As HEENA S/O PATAN NAZIR KHAN**

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMERS DISPUTES REDRESSAL COMMISSION, AT: HYDERABAD C.C.No.74 OF 2024

Between
Musku Sarnalatha
...Complainant
AND
Jayathri Infrastructures India Pvt Ltd.
...Opposite Party

NOTICE
To
Jayathri Infrastructures India Pvt Ltd Rep.by its Managing Director Srinivas Kakarla S/o. Venugopal Rao Age 43ycars Regd Office; Plot No. 140,141 Eminent Plaza, 6th Phase KPHB Colony Kukatpally, Hyderabaad-500085

The Complainant filed above C.C. against you i.e. Opposite party and the Hon'ble above state commission ordered substitute of service of notices by way of paper publication for your appearance before the above commission on 22-04-2025 at 10:30 hrs.without fail otherwise the matter will be decided on merits as per law.

// BY ORDER OF THE COMMISSION//
V.RAGHAVA REDDY
P.NAGARAJU
ADVOCATES
M: 93470 71007
Counsels for Complainant

IN THE HON'BLE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD O.S.No.4325 OF 2024

Between:
State Bank of India,
Gaddiannaram Branch,
H.No.16-2-740/75/13,
VK Dhage Nagar, Dilsukhnagar,
Hyderabad. Rep. by its Branch Manager
...Plaintiff
And:
Kothapalli Dasharatha,
S/o.K. Chandraiah
...Defendant
To
Kothapalli Dasharatha,
S/o.K. Chandraiah, Aged about 52yrs, Occ: Employce H.No.4-53 /9, East Gandhinagar, Keesar Mandal, Ranga Reddy District, Hyderabad, Telangana - 501301.
...Defendant

Please take notice that you are evading to receive summons sent by this Hon'ble Court. The above mentioned Hon'ble Court was pleased to order notice to you by way of publication in this daily. You are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 25-03-2025 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT. RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar,
Gaddiannaram, Hyd-500 060.
Cell: 9030617991

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL MM AT: HAYATHNAGAR. O.S. No.180 of 2025

Between:
DASARI KUTUMBA RAO and others
...Plaintiffs
And
1.K.SOMI REDDY
2.All Concerned
...Defendants

NOTICE
To,
All Concerned
...Defendant No.2

Please take notice that the above named plaintiffs filed a suit for declare the plaintiffs are the absolute owner and possessor of the Open Land bearing Plot No: 1171, admeasuring 201.6/9 Sq. Yards or 168.5 Sq. Meters, of Survey No.202, in BHAVANI NAGAR, situated at PASMAMLA Village, Presently Abdullapurmet Revenue Mandal, Under Pedda Amberpet Municipality, Ranga Reddy District and bounded by: North: Plot No.1172 (55 Fts.,), South: Plot No.1170 (55 Fts.,), East: Plot No.1198 (33 Fts.,), West: 33 Feet Wide Road (33 Fts.,)
If any persons are having objection or right, title, interest and claim whatsoever in and over the aforementioned property and the legal heir of Late Smt. DASARI SUDARSHANA W/o DASARI KUTUMBA RAO they may appear before the Hon'ble Court on Dt: 09/04/2025 at 10:30 A.M., if you fails to appear before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absence as per Law.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/-
M/s.CH.SURESH,
K.RAMA MURTHY
Advocates,
Plot No.149, H.No.4-13-86/11,
Huda Sai Nagar Colony,
Vanasthalipuram, Hyderabad-70.
Cell:98485 97228.
Counsel for the Plaintiffs

ఎంవీ యాక్ట్-2019ను సవరించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపుల నివారణకు ప్రభుత్వ సంస్థల ద్వారా రుణాలు ఇప్పించాలని, వెహికల్ స్క్రాపింగ్ పాలసీను సవరించాలని, రోడ్డు రవాణా కార్మికులకు సామాజిక భద్రత చట్టం చేయాలని తదితర 17 కోర్కెల సాధనకు ఈ నెల 24న చలో పార్లమెంట్ ఆందోళనకు హైదరబాద్‌లోకి రవాణా రంగంలోని కార్మికులు, వెహికల్స్ యజమానులు తరలిరావాలని హైదరాబాద్ సౌత్ జిల్లా ట్రాన్స్‌ఫోర్టు కమిటీ కార్యదర్శి ఎల్.కోటయ్య పిలుపునిచ్చారు. సోమవారం కోఠి ఉమెన్స్ కాలేజీ ఆటో స్టాండ్‌లో కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆటో సీఐటీయూ యూనియన్ నాయకులు ఎం.దాడు, కే.ఆనంద్, జగదీష్, సత్యం, సీఐటీయూ గోషామహల్ జోన్ నాయకులు పి.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'మొబైల్ అంబులెన్స్ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు'

- వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మొబైల్ అంబులెన్స్ ద్వారా రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు అందజేస్తున్నామని వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, సానా ప్రమోద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్ డాక్టర్స్‌తో తాము 75 ఏండ్ల మహిళలకు మోకాలు నొప్పులకు శస్త్ర చికిత్స చేసి నడిపిస్తున్నామని, అలాగే కంటికి శస్త్ర చికిత్సలు చేసి కంటి చూపు మెరుగుదలకు కృషి చేస్తున్నామని తెలిపారు. గత కొన్ని ఏండ్ల నుండి అమెరికాలో ఉన్న రామచంద్రారెడ్డి శంకర్ నేత్రాలయా లకు విరాళాలు అందిస్తూ కొన్ని వేల మందికి సహాయం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దొంతి సంజయ్ రెడ్డి, డాక్టర్ రీనా, డాక్టర్ పాల్వాయి శాంతన్ రెడ్డి, డాక్టర్ హర్షిత రెడ్డి పాల్గొన్నారు.



క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీనివాస్





నవతెలంగాణ-అంబర్‌పేట

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, అంబర్‌పేట సీఐ అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ భగత్ సింగ్ యువ జనోత్సవాలు సందర్భంగా అంబర్‌పేట వాటర్ వర్క్ క్రికెట్ గ్రౌండ్‌లో ఫైనల్ ముగింపు మ్యాచ్‌ని వారు ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా యువజన ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్ క్రికెట్ లీగ్ పేరుతో చేస్తున్న కార్యక్రమాన్ని అభినందించారు. హైదరాబాద్ నగరంలో విద్యార్థుల, యువతను సమీకరించి ఆటల పోటీలు నిర్వహించడంతో వారి యొక్క ప్రతిభ బయటికి వస్తుందన్నారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ నిర్మూలన కోసం పాటుపడాలన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తి గొప్పదని దేశ అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సే నోటు డ్రగ్స్ అనే కార్యక్రమం తీసుకోవడం మంచి అభినందనీ యమని భగత్ సింగ్ జీవితం అందరూ చదవాలని కోరారు. క్రీడలు మానసిక వికసానికి దోహదపడుతాయ న్నారు. ఓడిన గెలిచిన స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు జేకే శ్రీనివాస్, హైదరాబాద్ కార్యదర్శి అశోక్ రెడ్డి, లెనిన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు జావీద్, హాస్మి బాబు, నాగేందర్, లిఖిత, రమ్య, స్టాలిన్, హస్మిత, రాజయ్య, మహేందర్, దేవేందర్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్-2025కు భారీ బందోబస్తు

- మార్చి 23-మే 21 వరకు ఉప్పల్ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు ఏర్పాట్లు పూర్తి
- రాచకొండ సీపీ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐపీఎల్ మ్యాచ్‌లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని రాచకొండ సీపీ సుదీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో త్వరలో జరగనున్న 18వ ఎడిషన్ 'టాటా ఐపీఎల్ 2025' క్రికెట్ పోటీల నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు నేతృత్వంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సోమవారం నేరేడ్ మెట్‌లోని రాచకొండ కార్యాలయం టలో డీసీపీలు, ఏసీపీలు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉప్పల్ స్టేడియం అధికారులు, సన్ రైజర్స్ టీమ్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, అగ్గిపెట్టెలు, పదునైన వస్తువులు, బయట నుంచి తెచ్చే తినుబండారాలు, వాటర్ బాటిల్స్ వంటి వాటిని స్టేడియంలోనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు హాజరయ్యే అవకాశం ఉండటం వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, కార్లు, ద్విచక్ర వాహనాలకు విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సాధారణ వాహనదారుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉప్పల్ ప్రధాన రహదారి మీద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్టేడియం చు ట్టూ దాదాపు 450 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. సివిల్, ట్రాఫిక్, రిజర్వ్ పోలీసులు, ఎస్‌టీటి వంటి పలు విభాగాల అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారని తెలిపారు. టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని ఐపీఎల్ నిర్వహణ బందానికి సూచించారు. స్టేడియం ప్రవేశ మార్గాల్లో అనుమతి లేని వీధి వ్యాపారులను అనుమతించకూడదని, స్టేడియం లోపల ఆహార పదార్థాలను, శీతల పానీయాలను విక్రయించేవారు ఒకే రకమైన దుస్తులను ధరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు పద్మజ, అరవింద్ బాబు, ఇందిర, జి.నరసింహారెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి, శ్యాంసుందర్, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి సందర్భంగా ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయరాదని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణు గోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి అడిషనల్ సీసీపీ గంగాధర్ పాల్గొని నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శివ కుమార్ నాయుడు మాట్లాడుతూ నగర ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు విశేష కృషి చేయాలన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యల పై ఎన్ని రోజుల్లో పరిష్కారం చేస్తారో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 85 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 36, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ విభాగం 8, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విభాగాలకు మూడు చొప్పున, యూసీడీ, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్‌మెంట్, స్పోర్ట్స్ విభాగాలకు రెండు చొప్పున, సీటీఓ హెల్త్, లేక్స్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్, వెటర్నరీ, ఆర్‌టిఐ సీపీఆర్‌ఓ, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీసీపీ ప్రదీప్, వాటర్ వర్క్స్ సీఎం సాయి రమణ, డిప్యూటీ సీఈ పనస రెడ్డిహౌసింగ్, ఈఈ రాజేశ్వర్‌రావు, పీవీ రమణ రావు, ఎస్‌యన్‌డీపీ ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ ఈ బాలాజీ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, వాల్యూయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, ఓఎస్‌డి అనురాధ, ఏఎంసీలు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఫోటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని, ఆ రోజుల్లో దేశంలో ప్రప్రథమంగా ఫోటో కెమెరాలు కొనుగోలు చేసి ఫోటోగ్రఫీను అభివృద్ధి పరిచిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అన్నారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫోటో జర్నలిస్టులకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉత్తమ వార్త, తెలంగాణ పండుగలు, సాంస్కృతిక విభాగాల్లో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త ఫోటోగ్రఫీ పోటీలలో విజేతలైన ఉత్తమ ఫోటో జర్నలిస్టులకు అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాటాడుతూ వెయ్యి మాటల కన్నా ఒక్క ఫోటో ఎంతో గొప్పదన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో పత్రికలకు ఆదరణ తగ్గిపోతుందని చర్చ జరుగుతుందని, కానీ ఇది తాత్కాలికం మాత్రమేనని, భవిష్యత్తు పత్రికలకే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, అఖిల భారత రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుడి దేవేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లి మండల పరిధిలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్ మహాలక్ష్మి రామణగౌడ్, నాంపల్లి మండల తహసీల్దార్ ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అశ్విన్, అశోక్ తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రజలకు సేవ చేయడంలో అరుణ్ ప్రజా సేవ సదన్ ముందుంటుంది

- ప్రజాసేవ సదన్ చైర్మెన్ గంధ మల్ల ఆనంద్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజలకు సేవ చేయడంలో అరుణ్ ప్రజా సేవ సదన్ ముందుంటుందని ప్రజాసేవ సదన్ చైర్మెన్ గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. అరుణ్ ప్రజా సేవ సదన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం వేసవికాలం దృష్టిలో పెట్టుకొని అంబర్‌పేట ప్రేమనగర్ గ్రీన్ ల్యాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అంబర్‌పేట సబ్ ఇన్‌స్పెక్టర్ తరుణ్ కుమార్, ప్రజాసేవ సదన్ చైర్మన్ గంధ మల్ల ఆనంద్ గౌడ్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అరుణ్ సేవాసదన్ సభ్యులు మైలారం రాజు, పులి నారాయణ, బీరప్ప, ఈశ్వర్, జక్కయ్య, ఐలి శీను, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని ప్రజలందరూ సద్వినియోగించుకోవాలి

- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న రోడ్లు, పారిశుధ్య, అక్రమ నిర్మాణలు, డ్రయినేజీ, వీధి దీపాలు, తదితర సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరించామన్నారు. అన్ని విభా గాల సమన్వయంతో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సీటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మా జీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులున్నారు.

పేదల సంక్షేమమే సీఎం రిలీఫ్ ఫండ్ లక్ష్యం



- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

పేద ప్రజల సంక్షేమామే సీఎం రిలీఫ్ ఫండ్ లక్ష్యమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న వారికి కొండంత అండ ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ 19 మంది లబ్ధిదారులకు రూ.7,20,000 విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటికే వేలాది కుటుంబాలను సీఎం సహాయనిధి ద్వారా ఆదుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, కొండా శ్రీధర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, సాయి కృష్ణ, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ముఠా నరేష్, రాజేష్, కరీక కిరణ్, శ్రీధర్ చారి, రాజశేఖర్ గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు

నూతన స్ట్రీట్ లైట్‌ల ఏర్పాట్ల పర్యవేక్షణ

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, పలు కాలనీలు బస్తీల్లో రాత్రిళ్ళు అంధకారంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదు మేరకు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ సమస్య తీవ్రతను అధికారులకు వివరించి, గడిచినా వారం రోజులుగా సుమారు 50కి పైగా నూతన స్ట్రీట్ లైట్స్‌ను సిబ్బంది ద్వారా ఏర్పాటు చేయించారు. ముందుగా సమస్య తీవ్రంగా ఉన్నచోట స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయించామని, మరికొన్ని చోట్ల డార్క్ స్పాట్స్‌ను గుర్తించి వెంటనే లైట్‌లు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. స్ట్రీట్ లైట్స్ తోపాటు అవసరమున్న చోట ఐ మాక్స్ లైట్‌లను సైతం ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఐ మాక్స్ లైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, బీజేపీ నేతలు, ఆకుల సురేందర్, జ్ఞానేశ్వర్, అరుణ్ కుమా ర్, ప్రశాంత్ స్ట్రీట్ లైట్స్ సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ అశోక్ కుమార్, సిబ్బంది బాలు నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీ ద్వారా అందిస్తున్న వృత్తి నైపుణ్య కోర్సులను నిరుద్యోగ యువతకు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. సోమవారం నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలో గల రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్(ఆర్ఎస్‌ట)లో వృత్తి నైపుణ్య కోర్సు పూర్తి చేసుకున్న ప్రత్యేక యువత స్నాతకోత్సవం జరిగింది. ఆర్ఎస్టీ సీఈవో, ఎండీ రంజిత్ కౌర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సుమారు 60 మంది ప్రత్యేక విద్యార్థులకు సర్టిఫి కెట్లు అందజేసి వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలతో రూపుదిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న యువత వివిధ రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందని చెప్పారు. ఆర్ఎస్, సీఎంఎస్, సీఎస్ఆర్బ్ ఆధ్వర్యంలో ప్రత్యేక (వికలాంగులు) యువతకు వృత్తి పరమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్సీ సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భూక్యా కాసిమ్, సీఎంఎస్ ఫౌండేషన్, సీఎస్ఆర్ హెడ్ రుషన్ పటేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

- నాంపల్లి మండల డిప్యూటీ ఈఓ బి.వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలని నాంపల్లి మండల డిప్యూటీ ఈఓ బి.వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. సోమవారం సుల్తాన్‌బజార్ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పరీక్షలు నాలుగు రోజుల్లో ఉన్నాయని మీరందరూ క్రమశిక్షణతో పరీక్షలు రాయాలన్నారు. పరీక్షకు వెళ్లేటప్పుడు భోజనం చేసి అరగంట గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష రాసేటప్పుడు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలన్నారు. సమయానికి పరీక్ష సెంటర్ కు చేరుకోవాలన్నారు. మీరందరూ పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురా వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సుష్మిత, ఉపాధ్యాయులు లలిత, సంధ్య, లక్ష్మీ సరళ ,జహంగీర్ బేగం, నైలా జయమాల, స్వప్న, శైలజ విద్యార్థులు తదితరులున్నారు.

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీపై చర్యలు తీసుకోవాలి

- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పోరిక ఈశ్వర్ సింగ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఒక వర్గానికే కొమ్ముకాస్తూ ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తున్న తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రెడ్డిపై విచారణ జరిపించి ప్రభుత్వం అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పోరిక ఈశ్వర్ సింగ్ డిమాండ్ చేశారు. పోలీసు గృహ నిర్మాణ సంస్థలో జరుగుతున్న అన్యాయాలపై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అందులో భాగంగానే ఓ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన డీఈ ఎలక్ట్రికల్ పై కక్షగట్టి బదిలీ చేశారని ఆరోపించారు. వెంటనే అతనికి ఎలక్ట్రికల్ డ్యూటీ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హుడైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పక్కనపెట్టి తన చుట్టమైన జూనియర్ తులసి రెడ్డికి సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ పోస్ట్ కేటాయించారన్నారు. ఆంధ్రలో రిటైర్డ్ అయిన ఆర్సీ కుమార్ అనే ఉద్యోగిని ఇక్కడ ఫైనాన్స్ అడ్వైజర్ గా ఔట్ సోర్సింగ్ కింద నియమించి రూ.2.50 లక్షల జీతం ఇస్తున్నారని ఆరోపించారు. రూ.50, 60 వేలకే పని చేసే తెలంగాణ వారు ఉన్నప్పటికీ అతనికి ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు. అతన్ని విధుల నుంచి తొలిగించి తెలంగాణ వారికి ఈ పోస్టుకు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్రంలో ఉన్న అన్ని బంజారా సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

బీసీల గుండెల్లో సీఎం రేవంత్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారు

టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణనను చేపట్టి బీసీ బిల్లుకు ఆమోదం తెలిపిన సీఎం ఎ.రేవంత్ రెడ్డి బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ నుంచే న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం శాసన సభలో కీలక బిల్లులను బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఒక బిల్లు, ఎస్సీ వర్గీకరణ, దేవాదాయ చట్ట సవరణపై బిల్లులను ప్రవేశ పెట్టడం హర్షణీయమన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి దామోదర రాజ నర్సింహ, దేవాదాయ చట్ట సవరణ బిల్లును మంత్రి కొండా సురేఖ సభలో ప్రవేశపెట్టడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి, బీజేపీకి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వే షన్ వచ్చినప్పుడే ఆ వర్గాలు నిజంగా హ్యాపీగా ఫీల్ అవుతాయన్నారు. స్థానిక సంస్థల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 42 శాతం రిజర్వేషన్ ఫలితాలు అందినప్పుడు సంతోషపడతాయని అభిప్రాయపడ్డారు. ఆ ఫలితాలు వారికి అందాలని ఆకాంక్షించారు. నిరుద్యోగులకు యువ వికాసం పేరుతో రూ.3 లక్షలు అందజేయడం హర్షణీయమన్నారు.

ఉద్యమాలపై నిషేధాజ్ఞలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఉద్యమాలు, ఆందోళనలపై ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించడం విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీలో ఖాళీలను భర్తీ చేసి అకాడమిక్ వాతావరణం మెరుగుపరిచే అంశాలపై దృష్టి సారించకుండా ప్రభుత్వం, ఓయూ అధికారుల తీరును ప్రశ్నించే గొంతుకలను నులిమే ప్రయత్నం చేయడం అత్యంత దౌర్భాగ్యమని విమర్శించారు.

'అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులందిస్తాం'

నవతెలంగాణ-ధూల్‌పేట్

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని సర్కిల్-2 ఏసీఎస్‌ఓ సురేందర్ అన్నారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వినియోగదారుల ఇంటింటి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డులకు సుమారు 4200ల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. సర్కిల్-2 పౌర సరఫరా శాఖకు చెందిన ఆరుగురు ఇన్‌స్పెక్టర్‌లు సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి విచారణ చేస్తున్నారని తెలిపారు. విచారణకు వచ్చిన అధికారులకు ప్రజలు పూర్తి వివరాలు అందజేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం మాల జాతికి చీకటి రోజు

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన రోజును దళితులకు, ప్రధానంగా మాల జాతికి చీకటి రోజు (బ్లాక్ డే) అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రకటించారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత కులాల భవిష్యత్తుకు సంబంధించిన వర్గీకరణ అంశంపై విస్తృతంగా చర్చించకుండా అసెంబ్లీ ఆమోదించడంతో రాజ్యాంగం ఖూనీ అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలోని అన్ని దోపీడీ కుల పార్టీలు దళితులను అణచివేయడం కోసం ఐక్యమయ్యాయని ఆరోపించారు. తప్పుల తడకగా ఉన్న జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కనీసం చర్చించకుండా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లును ఆమోదించి మెజార్టీ దళిత కులాలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. మాలల భవిష్యత్తును దెబ్బ తీయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహానికి ఆ పార్టీని తెలంగాణలో బొందపెట్టాలని పిలుపునిచ్చారు. మాల జాతికి ద్రోహం చేసిన మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దిష్టిబొమ్మలకు శవయాత్ర చేయాలని కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. సోమవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడానికి నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా అధికార పక్షం మంత్రులు, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలను అడ్డుకుని నిరసన తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డా.వి.ఎల్.రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి సంతు శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షులు జేఎస్.రావు, పార్టీ రాష్ట్ర కన్వీనర్ (లీగల్ సెల్) గోలి నరేష్, గ్రేటర్ నాయకులు మద్దెల ప్రవీణ్ కుమార్, సుబ్బారావు, అక్కిదాసు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లల కోసం...

ఎండలు పెరిగిపోతున్నాయి. బయటకు వెళ్ళాలంటే కనీస జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇంట్లో ఉన్నప్పటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన చర్మ సమస్యలు ఇబ్బందిపెడుతుంటాయి. ముఖ్యంగా చిన్న పిల్లలకు చర్మ సమస్యలు వేధిస్తుంటాయి. దద్దుర్లు, దురద వంటి సమస్యలు చిన్న పిల్లల సున్నిత చర్మంపై ఎక్కువగా ఇబ్బందిపెడుతుంటాయి. వేసవిలో వారిని జాగ్రత్తగా చూసుకోకపోతే దద్దుర్లు, మొటిమలు వస్తాయి. అందుకే వేసవిలో పిల్లల చర్మం పట్ల కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో చిన్న పిల్లలకు ఉదయం సాయంత్రం స్నానం చేయించాలి. దీంతో వారు ఉత్సాహంగా ఉంటారు. వారికి రిఫ్రెష్ కలుగుతుంది. అంతేకాకుండా.. వారికి చర్మానికి ఎలాంటి ఇన్ఫెక్షన్ సమస్య ఉండదు.

పిల్లలకు వేడి నీటిలో స్నానం చేయిస్తే.. ముందుగా నీటి ఉష్ణోగ్రతను చెక్ చేయాలి. మరీ వేడిగాగానీ, మరీ చల్లగా గానీ కాదు. సాధారణ నీటితో



స్నానం చేయించాలి. ప్రతిరోజూ షాంపూ లేదా సబ్బును అప్లై చేయకపోయినా సాధారణ నీటితో స్నానం చేయించడం వల్ల శిశువు చర్మం పై ఉండే చెమట, ధూళి తొలగిపోతాయి. పొడి చర్మం ఉండే పిల్లలకు ఎక్కువగా రుద్దడం చేయకూడదు. సున్నితంగా రుద్దాలి. స్నానం చేయించగానే.. పిల్లలకు బేబీ క్రీమ్, లోషన్ అప్లై చేయాలి.

దుస్తుల విషయంలో జాగ్రత్తలు.. పిల్లలకు వదులుగా ఉండే దుస్తులు వేయలి. శిశువు చర్మం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి వీలుగా ఉండాలి. బిగుతుగా ఉండే దుస్తులు వేయడం వలన పిల్లల చర్మం కందిపోవడం.. ఎర్రగా మారడం జరుగుతుంది. వేసవిలో కాటన్ దుస్తులు మాత్రమే వేయాలి.

పిల్లల చర్మం పట్ల జాగ్రత్తలు.. పిల్లల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. త్వరగా పొడిబారుతుంది. మాయిశ్చరైజ్ సరిగా లేకపోతే చర్మంలోని తేమ పోతుంది. ఈ సమయంలో మాయిశ్చరైజర్ చేయాలి. వడదెబ్బ నుండి రక్షిస్తుంది. బయటకు వెళ్లినప్పుడు పిల్లలకు పూర్తిగా దుస్తులు వేయాలి. టోపీ పెట్టుకోవడమే కాకుండా.. ఒక గొడుగు కూడా తీసుకెళ్లాలి. వేడి దద్దుర్లు నుండి దూరంగా ఉండటానికి బేబీ సన్‌స్క్రీన్‌ని అప్లై చేయండి.

మధ్యాహ్నం పిల్లలను బయటకు తీసుకురావద్దు.. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ఈ సమయంలో బయటకు తీసుకురావడం వలన హీట్ స్ట్రోక్, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఏసీలో పిల్లలను ఎక్కువ సమయం ఉంచకూడదు. ఇలా చేయడం వలన వారి చర్మం చిన్నపాటి వేడిని కూడా తట్టుకోలేదు. అలాగే ఎక్కువ సమయం ఏసిలో ఉండడం వలన చర్మం పొడిబారుతుంది.

పిల్లలు హైడ్రేటెడ్ గా ఉండేలా చేయాలి. పిల్లలకు చర్మ సమస్యలు రాకుండా ఉండేందుకు వారికి మధ్య మధ్యలో మూడు నుంచి నాలుగు చెంచాల నీళ్లు తాగించాలి. పిల్లలకు బాగా హైడ్రేషన్ ఉంటే చెమట పట్టదని అనుకుంటారు. కానీ అది నిజం కాదు.. ఆర్ద్రీకరణను నిర్వహించడానికి ఆరు నెలల తర్వాత నీరు, రసాలను తాగటం అవసరం. ■

ధీరవనిత కెప్టెన్ రీనా వర్గీస్

అదొక భయంకరమైన దండకారణ్యం. అలాంటి చోట అడుగుపెట్టాలంటేనే ఒకరకమైన వణుకు. అందులోనూ అది నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. ఏ క్షణాన ఎటువైపునుండి తూటాల వర్షం కురుస్తుందో తెలియని చోటు. 21 అక్టోబర్ 2024న మహారాష్ట్ర-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అబుజ్‌మర్ గ్రామం మావోయిస్టులకు, పోలీసుల మధ్య జరిగిన కాల్పులతో ఎనిమిది గంటలపాటు దద్దరిల్లిపోయింది. ఆ కాల్పుల్లో క్షతగాత్రుడైన సి-60 కమాండో శరీరంలోకి మూడు బుల్లెట్లు దూసుకుపోగా, తీవ్ర రక్తస్రావంతో మూడు గంటలపాటు ప్రాణాలతో పోరాడాడు. ఓ మహిళా పైలట్ భూమికి పదకొండు అడుగుల ఎత్తులో హెలికాప్టర్ నిలిపి, అందులో నుండి దూకి అత్యంత సాహసోపేతంగా ఆ కమాండో ప్రాణాలను కాపాడింది. ఆ ధీరవనిత పవన్ హన్స్ హెలికాప్టర్ పైలట్ 'కెప్టెన్ రీనా వర్గీస్'. ఆమె చేసిన అసామాన్య సాహసానికి దేశం యావత్తు గర్వించింది.



రీనా కేరళ రాష్ట్రంలోని పతనంతిట్ట జిల్లా కొన్నిలో పుట్టి పెరిగారు. తల్లి ఎలియమ్మ, తండ్రి సి.వి.వరుగీస్. ఈ దంపతులకు ఈమె మూడవ కుమార్తె. అత్యంత చిన్న వయసులోనే పైలెట్ కావాలని కలలు కన్నది. స్కూల్ వయసులో నువ్వేం కావాలనుకుంటున్నావు అని టీచర్ అడిగితే పైలట్ అవుతానని సమాధానం చెప్పింది. అప్పటి నుండి ఆమె విమానం గురించి మరింత అధ్యయనం చేయడం మొదలుపెట్టింది. అయితే ఆమె కుటుంబం ఆమెను డాక్టర్ చేయాలనుకుంది. కానీ రీనా మాత్రం విమానయాన రంగంలోనే తన కెరీర్‌ను ప్రారంభించాలని దృఢంగా నిర్ణయించుకుంది. ఆ వైపుగా తన పరిశోధన ప్రారంభించింది. తర్వాత కాలంలో ఆమె పట్టుదలను చూసి కుటుంబ సభ్యులు కూడా రీనాకు సహకరించారు.

లక్ష్యాన్ని చేరేందుకు

పట్టోం సెయింట్ మేరీస్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో తన చదువు పూర్తి చేసిన తర్వాత ఆమె కొయంబత్తూర్‌లోని నెహ్రూ ఏరోనాటికల్ అండ్ అప్లైడ్ సైన్స్ నుండి ఇంజనీరింగ్ డిగ్రీని అందుకుంది. ఆ తర్వాత పైలట్ కావడానికి యునైటెడ్ స్టేట్స్‌లో తన శిక్షణను కొనసాగించింది. ఆమె తన లక్ష్యాన్ని చేరుకోవడం అంత సులభమేమీ కాలేదు. ఎందుకంటే హెలికాప్టర్ పైలెట్‌గా చేయాలంటే సాధారణ పైలట్ శిక్షణ కంటే ఖర్చు ఎక్కువ. కోర్సుకు సుమారు 72 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దీని కోసం ఆమె కుటుంబం ఎంతో కష్టపడాల్సి వచ్చింది. చివరకు తన కల నిజం చేసుకుంది. ఈరోజు ఆమె కెప్టెన్ రీనా వర్గీస్‌గా తన గ్రామంలోని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. పదిహేనేండ్ల నుండి హెలికాప్టర్ పైలట్‌గా ఉంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో ఆమె పోలీసులకు అనేకసార్లు సహాయం చేసింది.



కమాండోను కాపాడుకునేందుకు...

బూబీ-ట్రాప్డ్ మావోయిస్టు ప్రధాన కార్యాలయమైన అబుజ్‌మర్ ముట్టడిలో అక్టోబర్ 21, 2024న పక్కా వ్యూహంతో పోలీస్ శిబిరాలను చుట్టుముట్టిన మావోయిస్టులు రాకెట్ లాంచర్లతో దాడులు, బాంబుల మోతతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. ఆ భీకరపోరులో సి-60 కమాండో శరీరంలోకి మూడు బుల్లెట్లు దిగడంతో తీవ్ర రక్తస్రావంతో మూడు గంటలపాటు అడివిలో ఎలాంటి సదుపాయంలేక తీవ్రగాయాలతో నరకయాతన అనుభవిస్తూ ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఆ కమాండోను కాపాడుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించారు. అయితే సీఆర్‌పీఎఫ్ బలగాలకు అండగా బ్యాకప్ ఫోర్స్ రాకుండా అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు చెట్లను నరికి రోడ్డుపై అడ్డంగా వేశారు. ఎటు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

అత్యంత సాహసోపేతంగా...

ఆ సమయంలో తోటి జవాన్లు అత్యవసర హాటూకి కాల్ చేశారు. కెప్టెన్ రీనా వర్గీస్ హాటూ కాల్‌కు స్పందించి, తన సిబ్బందితో కలిసి గడ్చిరోలి నుండి తన 13 సీట్ల డాఫిన్-ఎన్ పవన్ హన్స్ హెలికాప్టర్‌ను పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (హాటూ) 100 కి.మీ దూరంలో ఉన్న ప్రమాద స్థలానికి 35 నిమిషాల్లో చేరుకుంది. అటవీ ప్రాంతంలో గాయపడిన కమాండోను వెతకడం ఎంతో ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ రీనా అత్యంత సాహసోపేతంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి భూమికి చాలా తక్కువ ఎత్తులో నావిగేట్ చేస్తూ గాయపడిన జవాన్ ఆచూకీ కనిపెట్టింది. దట్టమైన అడవిలో లాండింగ్ చేసే అవకాశం లేదు.



ఓఖీ విపత్తు సమయంలోనూ...

ఒకవైపు మావోయిస్టుల కాల్పులు, మరోవైపు పోలీసుల కాల్పుల మధ్య గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి ఎక్కించడం అసాధ్యమని భావించింది. ఎలాగైనా జవాన్ ప్రాణాలు రక్షించాలనే సంకల్పంతో తన కో పైలెట్ సహాయంతో హెలికాప్టర్‌ను భూమికి వీలైనంత దగ్గరగా దించి కాప్టర్ భూమికి కేవలం 11 అడుగుల ఎత్తులో తిరుగుతుండగా ఆమె కాక్‌పిట్ నుండి దూకింది. కమాండోల సహాయంతో గాయపడిన జవాన్‌ను హెలికాప్టర్‌లోకి వేగంగా ఎత్తగలిగారు. ప్రమాద స్థలం నుండి కేవలం 30 నిమిషాల్లోనే గడ్చిరోలికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం, అక్కడి నుంచి నాగ్‌పూర్‌కు తరలించారు. తీవ్ర రక్తస్రావం అయినప్పటికీ సరైన సమయంలో హాస్పిటల్‌కి చేర్చడంతో కమాండో ప్రాణాలతో బయటపడ్డాడు. అంతేకాకుండా ఆమె ఓఖీ విపత్తు సమయంలో కూడా సహాయక చర్యలు చేపట్టడం గర్వించదగిన విషయం. కోవిడ్ కాలంలో లక్షద్వీప్ నుండి చాలా మందిని విమానంలో తరలించడంలో కూడా ఆమె సహాయపడింది.

భయమే మన శత్రువు

ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెలికాప్టర్ కార్యకలాపాలు అంత సులభం కాదన్న విషయం మనందరికీ తెలిసిందే. అయినప్పటికి రీనా ధైర్యసాహసాలు ప్రదర్శించి కమాండో ప్రాణాన్ని కాపాడింది. అందుకే ఆ ధీర వనితను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో సత్కరించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కూడా ఆమె సాహసోపేత సేవను అభినందించారు. కూంబింగ్ ఆపరేషన్‌లలో పురుషులు మాత్రమే కాదు మహిళలు కూడా ధైర్యంగా పోరాడగలగడంతో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న సైన్యాన్ని కాపాడగలరని 'కెప్టెన్ రీనా వర్గీస్' నిరూపించింది. భయమే అత్యంత క్రూరమైన శత్రువు. భయంతో వేసే ప్రతి అడుగు మనల్ని వెనక్కి నెడుతుంది. కనుక ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే ఏదైనా సాధించగలమని వర్గీస్ నిరూపించింది.

- కోట దామోదర్,
9391480475

వారంతా మూర్ఖులు

దేశ సంపదను విదేశాలకు దోచిపెట్టారు : ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షులను ట్రంప్ అత్యంత మూర్ఖులుగా అభివర్ణించారు. వారు దేశ సంపదను విదేశాలకు దోచిపెట్టారని, తాము ఏమి చేస్తున్నారో కూడా వారికి తెలియలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఆ సంపదలో కొంత భాగాన్ని తిరిగి తాను అమెరికాకు తీసుకొస్తున్నానని ఆయన చెప్పుకొచ్చారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై విధించిన సుంకాలకు మినహాయింపులు ఇచ్చే యోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. అమెరికా వాణిజ్య భాగస్వాములపై ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రతీకార సుంకాలు విధిస్తామని పునరుద్ఘాటించారు. తన వాణిజ్య చర్యల నుంచి ఏ దేశాన్నీ వదిలేది లేదని ట్రంప్ పదేపదే చెబుతున్నారు. 'ఏప్రిల్ 2వ తేదీ మా దేశానికి విముక్తి దినోత్సవం. కొందరు మూర్ఖులైన అధ్యక్షులు దేశ సంపదను విదేశాలకు దోచిపెట్టారు. అసలు వారు ఏం చేస్తున్నారో కూడా వారికి తెలియదు. విదేశాలకు తరలిపోయిన సంపదలో కొంత భాగాన్ని ఆ రోజున స్వదేశానికి రప్పిస్తాము' అని అన్నారు.

'వారు మాపై సుంకాలు విధించారు. మేము కూడా వారిపై విధిస్తాము. దీనికితోడు ఉక్కు, అల్యూమినియంపై అదనపు సుంకాలు వసూలు చేస్తాం' అని వాణిజ్య భాగస్వాములను ఉద్దేశించి ట్రంప్ చెప్పారు. చైనా దిగుమతులపై 20 శాతం సుంకం విధించిన అమెరికా... ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం లెవీ విధించింది. ఉత్తర అమెరికా వాణిజ్య ఒప్పందం కింద ఆటో ఉత్పత్తిదారులకు కల్పించిన నెల రోజుల రాయితీలో భాగంగా కెనడా, మెక్సికో వస్తువులపై విధించిన 25 శాతం సుంకాన్ని ఈ నెల 6వ తేదీ వరకూ నిలిపివేసింది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమెరికా కాంగ్రెస్ ఉభయ సభలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తూ కొన్ని దేశాలు అమెరికా వస్తువులపై అధికంగా, అన్యాయంగా సుంకాలు విధిస్తున్నాయని ఆరోపించారు. వాటి ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు వసూలు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్‌పై కూడా విరుచుకుపడుతూ అది వంద శాతం కంటే ఎక్కువ సుంకాన్ని వసూలు చేస్తోందని చెప్పారు.

కాగా భారత్‌పై అమెరికా ఇప్పటి వరకూ ప్రతీకార సుంకాలు విధించలేదని కేంద్ర ప్రభుత్వం గత మంగళవారం పార్లమెంటుకు తెలియజేసింది. వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు జరపాలని రెండు దేశాలు యోచిస్తున్నాయని చెప్పింది. మార్కెట్ అవకాశాలను పెంచేందుకు, దిగుమతి సుంకాన్ని తగ్గించేందుకు, టారిఫ్ యేతర అవరోధాలను తొలగించేందుకు, సరఫరాలను మెరుగుపరచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని వివరించింది.

గ్రీన్‌కార్డు హోల్డర్లపై తనిఖీలు...నిర్బంధాలు

ఇదిలావుండగా భారతీయులు సహా అమెరికాలో గ్రీన్‌కార్డులు ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు రెండో దశ తనిఖీలు ముమ్మరం చేశారు. విమానాశ్రయాల్లో ప్రవేశించకుండా అమెరికా కస్టమ్స్, సరిహద్దు రక్షణ అధికారులు వారిని రాత్రికి రాత్రే నిర్బంధించారు. గ్రీన్‌కార్డులు స్వాధీనం చేయాల్సిందిగా కొందరిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో శీతాకాలం స్వదేశంలో గడిపి తిరిగి అమెరికాలోని పిల్లల వద్దకు పయనమైన వృద్ధులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఐ-407 పత్రంపై సంతకం చేసి గ్రీన్‌కార్డులను స్వచ్ఛందంగా అప్పగించాల్సిందిగా వారిపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే అధికారుల ఒత్తిడికి తలొగ్గి గ్రీన్‌కార్డులు అప్పగించవద్దని సియాటెల్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ కృపా ఉపాధ్యాయ్ సూచించారు. గ్రీన్‌కార్డులు కలిగి ఉన్న వారు సంవత్సర కాలం అమెరికా వెలుపల గడిపినప్పుడే వారు తమ నివాస హక్కును కోల్పోతారు. అయినప్పటికీ గ్రీన్‌కార్డులు ఉన్న వారు న్యాయస్థానంలో దీనిని సవాలు చేయవచ్చు. అయితే గ్రీన్‌కార్డును విమానాశ్రయంలో అప్పగిస్తే మాత్రం వారు ఆ హక్కును కోల్పోతారు.

ముడి చమురు ధరలు తగ్గినా బాదుడే

(మొదటిపేజి తరువాయి)

ఉన్నప్పుడు భారత ముడి చమురు దిగుమతి ధర సగటున బ్యారల్‌కు 75.75 డాలర్లు పలికింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో చమురు ధరలు బ్యారల్‌కు 65-73 డాలర్ల మధ్య ఉండవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు.

డూప్లికేట్ ఓటరు ఐడీలపై చర్చకు నో

(మొదటిపేజి తరువాయి)

డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ మాట్లాడుతూ... చైర్మెన్ ఇచ్చిన రూలింగ్‌లకు అనుగుణంగా నోటీసులు లేనందున వాటిని ఆమోదించలేమని అన్నారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, టీఎంసీ ఎంపీలు నకిలీ ఓటరు ఐడీ కార్డుల అంశాన్ని లేవనెత్తాయి.

డీలిమిటేషన్‌పై చర్చకు నిరాకరణ

డీఎంకే, సీపీఐ(ఎం), సీపీఐ తదితర పార్టీలు దక్షిణాది రాష్ట్రాలపై తదుపరి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రభావాన్ని చర్చించాలని కోరాయి. అయితే అందుకు ప్రభుత్వం నిరాకరించడంతో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలను హోరెత్తించారు. అయితే, వారి నోటీసులను ఆమోదించలేదనీ, వారు చెప్పినది ఏదీ రికార్డులో లేదని డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ వివరించారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేసి నిరసన వ్యక్తం చేశారు.

రైలు రద్దీ, భద్రత, ప్రాంతీయ కేటాయింపులపై ఎంపీల ఆందోళన

రైలు రద్దీ, భద్రత, ప్రాంతీయ కేటాయింపులపై పార్లమెంట్‌లో ఎంపీలు ఆందోళనలు లేవనెత్తారు. రైల్వే మంత్రిత్వశాఖపై చర్చ సందర్భంగా సోమవారం రాజ్యసభలో పలువురు ఎంపీలు రద్దీగా ఉండే రైళ్ల, పేలవమైన నిర్వహణ, అధిక ఛార్జీలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌సీపీ (శరద్ పవార్) పార్టీకి చెందిన ఎంపీ ఫౌజియా ఖాన్ ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్లలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. బీఎస్‌పీకి చెందిన ఎంపీ రాంజీ.. సాంకేతిక పురోగతి ఉన్నప్పటికీ భద్రతా సమస్యలను ఎత్తి చూపారు. ఎంపీలు మరిన్ని జనరల్ కంపార్ట్‌మెంట్లు, మెరుగైన ప్రాంతీయ కనెక్టివిటీని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ ప్రశ్నలకు మంత్రిత్వ శాఖ నుంచి స్పందన లేకపోవడాన్ని జేఎంఎం సర్ఫరాజ్ అహ్మద్ విమర్శించారు.

లోక్‌సభలోనూ ఇదే చర్చ

లోక్‌సభలో కూడా ఇదే అంశంపై జరిగిన చర్చలో ప్రతిపక్ష ఎంపీలు రైల్వేకి సంబంధించిన వివిధ సమస్యలను లేవనెత్తారు. ప్రభుత్వ నిర్వహణలో లోపాలున్న కారణంగా రైల్వేని "వెంటిలేటర్" పైకి తెచ్చారని విమర్శించారు. ప్రజా దిగ్గజ సంస్థను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ తయారు చేయడంలా చేశారనీ, దీనివల్ల ప్రయోజనం ఉండదని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్ మాట్లాడుతూ... రైల్వే బడ్జెట్ "రికార్డ్ బద్దలు కొట్టే" చర్య అని చేసిన వాదనలు తప్పు అనీ, వాస్తవానికి ఇది "విఫల బడ్జెట్" అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ అభివృద్ధి 2014 తర్వాత ప్రారంభమైందని ఒక కథనాన్ని సృష్టిస్తోందని ఆమె చెప్పారు. వివరాల్లోకి వెళ్తే వాస్తవాలు స్పష్టమవుతాయన్నారు. అందుబాటులో ఉన్న వాస్తవాల ప్రకారం ప్రభుత్వ సంస్థ ఆర్థిక ఆరోగ్య పరిస్థితి దారుణంగా ఉందనీ, గణంకాలు అది "వెంటిలేటర్"పై ఉందని చూపిస్తున్నాయని విమర్శించారు. ఎంపీ శతాబ్ది రాయ్ మాట్లాడుతూ... రైలు ప్రమాదాల్లో మరణించిన వారిని ఎంత పరిహారం చెల్లించినా తిరిగి తీసుకురాలేమని అన్నారు. టిక్కెట్లపై రద్దు ఛార్జీలు విధించడం ప్రయాణికులను హింసించడమేనని ఆమె చెప్పారు.

రైల్వే ప్రయివేటీకరణకు ప్రయత్నాలు : సీపీఐ(ఎం) ఎంపీ సచ్చితానందన్

రైల్వే అంశంపై సీపీఐ(ఎం) ఎంపీ సచ్చితానందన్ ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే ప్రయివేటీకరణకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సర్వీస్ అందించాల్సిన రైల్వేని ప్రజలకు దూరం చేస్తున్నారని అన్నారు. రైల్వేలో నియామకాలు తగ్గిపోయాయని చెప్పారు. ప్లాట్‌ఫాం టిక్కెట్టు నుంచి అన్ని రకాల టిక్కెట్ల ధరలూ పెరిగాయని ఎంపీ విమర్శించారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

ఏప్రిల్ మొదటి వారంలో పైలట్ ప్రాజెక్ట్
నిషేధిత జాబితా జోలికెళ్తే చర్యలు
ఎల్‌ఆర్‌ఎస్ వేగవంతం చేయాలి : రెవెన్యూ మంత్రి పొంగులేటి వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భూముల రిజిస్ట్రేషన్లకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తప్పనిసరిగా స్లాట్ బుకింగ్‌తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దీన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా అమల్లోకి తెస్తామన్నారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, సీసీఎల్‌ఏ కార్యదర్శి మందా మకరంద్ , ఐటీ కార్యదర్శి బావేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీసం 45 నిముషాల నుంచి గంటకు పైగా సమయం పడుతుందనీ, స్లాట్ బుకింగ్ విధానం ద్వారా పది నుంచి 15 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. న్నారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం సామాన్యులు నిరీక్షించే పరిస్థితి లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, చాట్ బోట్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తుల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేసి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచి రెవెన్యూశాఖకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. లక్షలాది కుటుంబాలకు మేలుచేసే ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. జిల్లా రిజిస్ట్రార్‌లు ప్రతిరోజు దీనిపై సమీక్షించాలనీ, ఏమైనా సందేహాలుంటే సబ్ రిజిస్ట్రార్లు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారమార్గాలు చూడాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తుల్ని పెండింగ్‌లో పెట్టవద్దనీ, ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రజలు మూడేండ్లుగా ఎదురుచూస్తున్నారని అన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువు ఈనెల 20వ తేదీ వరకు ఉందని ప్రభుత్వం తెలిపింది. మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష వచ్చేనెల 27వ తేదీని నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో ప్రతి పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఇప్పటి వరు 38,643 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. వచ్చేనెల 21 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంటుందని వివరించారు. అదేనెల 27వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతి వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక మండలాల్లోనే పరీక్షా కేంద్రాలుంటాయని వివరించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసీలు రూ.200 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాల కోసం http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-కొందుర్గు

అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు (భారత కాల మానం ప్రకారం) జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. టేకులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ వెలిమర్తి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పవిత్రదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు ప్రగతిరెడ్డిని సిద్దిపేట జిల్లా బక్రీ చెప్యాలకు చెందిన రోహిత్‌రెడ్డికిచ్చి వివాహం జరిపించారు. ప్రగతిరెడ్డి, రోహిత్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రోహిత్‌రెడ్డి తల్లి సునీత కూడా వీరితోపాటే అమెరికాలో ఉంటున్నారు.

వీరంతా ఫ్లోరిడా నుంచి కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రగతిరెడ్డి(35), ఆమె కుమారుడు అర్విన్(6), అత్త సునీత(56) అక్కడికక్కడే మృతిచెందారు. భర్త రోహిత్‌రెడ్డి, మరో కుమారుడు గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో టేకులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ప్రగతిరెడ్డి తల్లిదండ్రులు మోహన్‌రెడ్డి, పవిత్రదేవి, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వీరిని గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. అనంతరం మోహన్‌రెడ్డి దంపతులు అమెరికాకు బయలుదేరి వెళ్లారు. మృతుల దహన సంస్కారాలు అమెరికాలోని ఫ్లోరిడాలోనే నిర్వహిస్తామని వారు తెలిపారు.

అదానీలకు ఊరట



ముంబయి : 388 కోట్ల రూపాయల మార్కెట్ నిబంధనల ఉల్లంఘన కేసు నుండి అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్), గ్రూప్ చైర్మెన్ గౌతమ్ అదానీ, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ అదానీలకు బాంబే హైకోర్టు విముక్తి కల్పించింది. మోసం జరిగినట్లు, నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఆధారాలేవీ లేవని సోమవారం వెలువరించిన తీర్పులో కోర్టు స్పష్టం చేసింది. ఎఈఎల్, దాని ప్రమోటర్లు గౌతమ్ అదానీ, రాజేష్ అదానీలు నేరపూరిత కుట్రకు, మోసానికి పాల్పడ్డారంటూ సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) 2012లో కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేసింది. కేసు నుంచి తమకు విముక్తి కల్పించాలంటూ నిందితులు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను సెషన్స్ కోర్టు అదే ఏడాది తోసిపుచ్చింది. దీనిని సవాలు చేస్తూ 2019లో ఏఈఎల్, ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తలు బాంబే హైకోర్టులో పిటిషన్ వేశారు. సెషన్స్ కోర్టు ఆదేశాలను కొట్టివేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఆర్ఎన్ లడ్డా సింగిల్ బెంచ్ సెషన్స్ కోర్టు ఆదేశాలను కొట్టివేసింది. కేసు నుండి ఏఈఎల్‌కు, ఇరువురు ప్రమోటర్లకు విముక్తి కల్పించింది. కోర్టుకు అందజేసిన పత్రాలు, రికార్డులను జాగ్రత్తగా పరిశీలించామని, మోసం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారని తెలిపింది. నేరపూరిత కుట్ర జరిగిందన్న ఆరోపణలో కూడా పస లేదని తేల్చింది. నిందితులు తప్పుడు మార్గాల్లో లబ్ధి పొందారని కేవలం ఊహాజనిత అంచనాలకు రావడం సరికాదని తెలిపింది. సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా ఆదేశాలపై రెండు వారాల పాటు స్టే ఇవ్వాలని ఎస్ఎఫ్ఐఓ కోరగా న్యాయస్థానం అందుకు నిరాకరించింది.

బడ్జెట్‌లో చేనేతకు రూ. 2వేల కోట్లు కేటాయించాలి

(మొదటిపేజి తరువాయి)

50శాతం రాయితీ అందించాలనీ, చేనేత రంగానికి సంబంధించి అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని భట్టికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, ఉపాధ్యక్షులు కోడం రమణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ సర్కారుతో సంబంధాలు

'ఫ్రీ బేసిక్స్' కోసం తీవ్ర ప్రయత్నాలు

ఫేస్‌బుక్‌పై ఆ సంస్థ మాజీ ఉద్యోగిని ఆరోపణలు

తోసిపుచ్చిన మెటా



న్యూఢిల్లీ : ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌పై ఆ సంస్థ మాజీ ఉద్యోగిని ఆరోపణలు గుప్పించారు. సదరు సోషల్ మీడియా దిగ్గజం కొన్నేండ్ల క్రితం తీసుకొచ్చిన 'ఫ్రీ బేసిక్స్' విషయంలో భారత్‌లోని మోడీ సర్కారుతో సాన్నిహిత్యాన్ని కొనసాగించిందని ఆమె వివరించింది. ఫేస్‌బుక్, మోడీ సర్కారు మధ్య సంబంధం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాని మోడీ నుంచి ఇతర నాయకులు, అధికారులతో మంచి సంబంధాలను పెంచుకొని పని చేసిందని ఆరోపించింది.

ఏమిటీ ఈ ఫ్రీ బేసిక్స్?

ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న కోట్లాది మంది వినియోగదారులకు ఉచిత ఇంటర్నెట్‌ను అందించే లక్ష్యంతో ఫేస్‌బుక్ ఈ 'ఫ్రీ బేసిక్స్' ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా, భారత్‌లోని దీనిని అమలు చేసింది. ఆ తర్వాత ఈ ప్రోగ్రాం వివాదంగా మారింది. ఇది నెట్ న్యూట్రాలిటీని ఉల్లంఘిస్తుందనీ, ఇతర ఇంటర్నెట్ సర్వీసులపై వివక్షను చూపెడుతుందని అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. నిరసనలూ జరిగాయి. విమర్శలు, నిరసనల నేపథ్యంలో భారత ప్రభుత్వం 2016లో ఫేస్‌బుక్ 'ఫ్రీ బేసిక్స్'ను బ్యాన్ చేసింది. ఫ్రీ బేసిక్స్ ద్వారా తన మార్కెట్‌ను మరింతగా పెంచుకోవచ్చని ఫేస్‌బుక్ భావించింది. చివరకు అది బ్యాన్ కావటంతో సంస్థకు ఎదురుదెబ్బ తాకింది. భారత్ నుంచి తన సర్వీసులను వెనక్కి తీసుకున్నది.

ఈ ప్రోగ్రామ్ విషయంలో ఫేస్‌బుక్ దూకుడుగా చేసిన లాబీయింగ్ ప్రయత్నాలు, ప్రధాని మోడీ కార్యాలయంతో పాటు భారత అధికారులతో సాన్నిహిత్యాన్ని పెంచుకొని పని చేసిన తీరును విలియమ్స్ తన పుస్తకంలో వివరించారు. ఫ్రీబేసిక్స్‌ను ప్రోత్సహించటానికి ఫేస్‌బుక్ లక్షల కోట్ల రూపాయలను వెచ్చించిందని పేర్కొన్నది. టీవీ, వార్తాపత్రికలు, సినిమా థియేటర్లు, రేడియో, బిల్‌బోర్డులలో ప్రకటనల ప్రచారాలకు భారీగానే ఖర్చు చేసిందని వివరించింది. భారత్ కోసం ఫేస్‌బుక్ ప్రత్యేకంగా 'వార్ రూమ్'ను స్థాపించిన విషయాన్నీ విలియమ్స్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ వ్యూహంలో భాగంగా నిర్దిష్ట వినియోగదారులకు మాత్రమే కనబడేలా ప్రకటనలు, ప్రజల మద్దతును పెంచటానికి రూపొందించిన ఎస్ఎంఎస్ ప్రచారాలు కూడా ఉన్నాయని వివరించారు.

ఫ్రీ బేసిక్స్‌కు మద్దతుగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)కు ఈ-మెయిల్ చేయాలని కోరుతూ భారతీయ ఫేస్‌బుక్ వినియోగదారులకు సందేశాలూ అందాయని పేర్కొన్నారు. ఫేస్‌బుక్ యూజర్ బటన్‌ను క్లిక్ చేయటం ద్వారా వినియోగదారుడి మొత్తం ఫ్రెండ్‌లిస్ట్‌కు.. ట్రాయ్‌కు లేఖ సమర్పించారని తెలియజేయటానికి వైరల్‌గా మార్చే ఒక ప్లాట్‌ఫామ్ ప్రచారాన్ని కూడా ఫేస్‌బుక్ రూపొందించిందని ఆమె ఆరోపించింది. భారత్‌లోని రాజకీయ నాయకత్వంతోనూ బలమైన సంబంధాలనే నెరిపిందని వివరించింది.

2016 జనవరిలో దాదాపు 1.7 కోట్లకు పైగా ఈ-మెయిల్లు ట్రాయ్‌కు అందాయని ఫేస్‌బుక్ పేర్కొన్నది. అయితే, ట్రాయ్ మాత్రం 14 లక్షల స్పందనలే అందాయని వివరించటం గమనార్హం. అయితే, నిరసనలు, ఆందోళనల, ఉల్లంఘనల చర్యల నడుమ ఫేస్‌బుక్ 'ఫ్రీ బేసిక్స్' అదే ఏడాది భారత్‌లో నిలిచిపోయింది. అయితే, ఇంతటి నెట్‌వర్క్‌ను కలిగి ఉండి, అక్కడి రాజకీయ వ్యవస్థతో బలమైన సంబంధాలు కలిగి ఉన్నప్పటికీ.. ఫేస్‌బుక్‌కు ఎదురుదెబ్బ తాకటం సదరు సంస్థను భయాందోళనల్లోకి నెట్టింది. ఆ తర్వాత మయన్మార్ వంటి దేశాలు కూడా ఫ్రీ బేసిక్స్‌కు బ్రేకులు వేశాయి. అయితే, విలియమ్స్ చేసిన ఆరోపణల్లో నిజాలు లేవని ఫేస్‌బుక్ తోసిపుచ్చింది.

ఎవరు ఈమె?

సారా విన్-విలియమ్స్ 2011 నుంచి 2018 మధ్య ఫేస్‌బుక్ ప్రపంచ వ్యవహారాలు, ప్రజా విధానానికి అధిపతిగా వ్యవహరించారు. తాను రాసిన 'కేర్‌లెస్ పీపుల్‌'లో ఆమె ఫేస్‌బుక్‌పై పై ఆరోపణలు చేశారు. అప్పట్లో వివాదంగా మారిని ఫేస్‌బుక్ 'ఫ్రీ బేసిక్స్' గురించి ఇందులో ఆమె లేవనెత్తారు. భారత్‌లో ఈ ఫ్రీ బేసిక్స్ అమలు కోసం.. సదరు సోషల్ మీడియా దిగ్గజం.. మోడీ సర్కారుతో చక్కటి సంబంధాలను కొనసాగించిందని వివరించింది. అయితే, ఫేస్‌బుక్ సంస్థ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

గుక్కెడు నీటికి చెలమలే దిక్కు
గిరిజనం కన్నీటి కష్టాలు


ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రం గుట్ట ప్రాంతంలోని గుడిసె వాసుల దుస్థితి


ఏటూరు నాగారం మండలం చల్పాక గ్రామానికి చెందిన ఆదివాసీలు కిలోమీటర్ దూరం నుంచి చెలిమల నీరు తెచ్చుకుంటున్న దృశ్యం



వైస్ కెప్టెన్‌గా డుప్లెసిస్

ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ నిర్ణయం

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మాజీ సారథి డుప్లెసిస్ ఐపీఎల్ 18వ సీజన్లో యువ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. 40 ఏండ్ల వయసులో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఐపీఎల్‌లో తొలిసారి బరిలోకి దిగుతున్న డుప్లెసిస్‌ను ఆ ఫ్రాంచైజీ వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ తరఫున ఆడిన డుప్లెసిస్‌ను గత సీజన్‌కు ముందు ఆర్‌సీబీ వేలంలోకి వదిలేసింది. రూ.2 కోట్ల కనీస ధరకు డుప్లెసిస్‌ను దక్కించుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ సఫారీ వెటరన్ స్టార్‌ను ఉప నాయకుడిని చేసింది. యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎంచుకున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో మూడు ఫ్రాంచైజీల తరఫున 145 మ్యాచులు ఆడిన డుప్లెసిస్ 35.99 సగటుతో 4571 పరుగులు చేశాడు. 421 ఫోర్లు, 166 సిక్సర్లు సహా 48 అర్థ సెంచరీలు డుప్లెసిస్ ఖాతాలో ఉన్నాయి.

ఛాంపియన్ డ్రేపర్

అంద్రీవకు మహిళల టైటిల్
ఇండియన్ వెల్స్ ఓపెన్ టెన్నిస్



ఇండియన్ వెల్స్ (యుఎస్ఏ) : బీఎన్‌పి పారిబస్ ఇండియన్ వెల్స్ ఓపెన్‌లో 23 ఏండ్ల గ్రేట్ బ్రిటన్ కుర్రాడు జాక్ డ్రేపర్ చాంపియన్‌గా నిలిచాడు. పురుషుల సింగిల్స్ 13వ సీడ్ జాక్ డ్రేపర్ సెమీఫైనల్లో రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఫైనల్లో హోల్గర్ రూనె (డెన్మార్క్)పై వరుస సెట్లలో మెరుపు విజయం సాధించాడు. రష్యా స్టార్ మెద్వెదేవ్‌పై విజయంతో టైటిల్ పోరుకు చేరుకున్న 21 ఏండ్ల డెన్మార్క్ చిన్నోడు అంతిమ సమరంలో తేలిపోయాడు. 6-2, 6-2తో జాక్ డ్రేపర్ వరుస సెట్లలో ఘన విజయం సాధించాడు. 10 ఏస్‌లు కొట్టిన డ్రేపర్ నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించాడు. పాయింట్ల పరంగా 59-39తో రూనెపై తిరుగులేని ఆధిపత్యం చెలాయించాడు. హోల్గర్ రూనె తొలి సెట్ నుంచి అంచనాలను అందుకోలేదు. రెండు సెట్లలో ఒక్క బ్రేక్ పాయింట్ సాధించని రూనె... ఓవరాల్‌గా నాలుగు గేమ్ పాయింట్లతో సరిపెట్టుకున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఏమాత్రం అంచనాలు లేని క్రీడాకారులు పోటీపడటం టెన్నిస్ ప్రియులను ఆకట్టుకుంది.



మహిళల సింగిల్స్‌లో తొమ్మిదో సీడ్, రష్యా యువ సంచలనం మిర్రా అంద్రీవ చాంపియన్‌గా అవతరించింది. టాప్ సీడ్, అరినా సబలెంక‌పై మూడు సెట్ల సమరంలో పైచేయి సాధించి 17 ఏండ్ల వయసులోనే ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. టైటిల్ పోరులో సబలెంక మంచి ఆరంభం దక్కించుకుంది. తొలి సెట్‌ను 6-2తో గెల్చుకుని టైటిల్ దిశగా ఓ అడుగు ముందుకేసింది. కానీ రష్యా అమ్మాయి రెండో సెట్లో సత్తా చాటింది. 6-4తో సెట్‌ను గెల్చుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. డిసైడర్‌లోనూ 6-3తో మెరిసిన అంద్రీవ మహిళల సింగిల్స్ క్వీన్‌గా నిలిచింది. ఆరు ఏస్‌లు కొట్టిన అంద్రీవ.. నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా 40-31తో స్టార్ ప్లేయర్‌పై పైచేయి సాధించింది. మూడు బ్రేక్ పాయింట్లు సాధించిన సబలెంక.. వరుసగా చివరి రెండు సెట్లలో పరాజయం పాలై టైటిల్‌ను చేజార్చుకుంది. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ పావిక్, మార్సెలో జోడీ 6-3, 6-4తో గెలుపొంది టైటిల్ సాధించగా.. మహిళల డబుల్స్‌లో డెమి, ఏసియా మహ్మద్ జంట 6-2, 7-6(7-4)తో పైచేయి సాధించి విజేతగా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో టాప్ సీడ్ సారా ఎరాని, అంద్రీయ జోడీ 6-7, 6-3, 10-8తో టైటిల్ ఎగరేసుకుపోయారు.

బ్రూక్‌పై వేటు సబబే!

ఇంగ్లాండ్ క్రికెటర్లు అలీ, రషీద్



న్యూఢిల్లీ : ఇంగ్లాండ్ యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ ఇటీవల ఐపీఎల్ ఆటగాళ్ల నిబంధనావళి ప్రకారం రెండు సీజన్ల పాటు నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ సీజన్ ఆటగాళ్ల వేలంలో రూ. 6.25 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రూక్‌ను కొనుగోలు చేసింది. ఇంగ్లాండ్ టెస్టు క్రికెట్ సీజన్ దృష్ట్యా ఐపీఎల్18లో ఆడలేనని ఆఖరు నిమిషంలో బ్రూక్ ప్రకటించాడు. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడాల్సి ఉండగా.. అప్పుడూ అందుబాటులో ఉండలేదు. సన్‌రైజర్స్ రూ.4 కోట్లతో అప్పుడు బ్రూక్‌ను ఎంచుకుంది. ఐపీఎల్ నూతన నిబంధనల ప్రకారం వేలంలో ఫ్రాంచైజీలు కొనుగోలు చేసిన ఆటగాళ్లు ఇతర కారణాలతో సీజన్‌కు దూరమైతే.. రెండేండ్ల నిషేధానికి గురి కావాల్సి ఉంటుంది. బ్రూక్ నిషేధంపై ఇంగ్లాండ్ క్రికెటర్లు మోయిన్ అలీ, ఆదిల్ రషీద్ స్పందించారు. 'బ్రూక్‌పై నిషేధం తీవ్రమైనది కాదు. రూల్స్ ప్రకారం ఎవరైనా అదే చేస్తారు. నిజానికి బ్రూక్ వంటి ఆటగాడు ఆఖర్లో ఆడలేనని అంటే.. ఫ్రాంచైజీలు ప్రణాళికలు గందరగోళంగా మారతాయి. కుటుంబ, ఫిట్‌నెస్ కారణాలు మినహా ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడకుంటే నిషేధం విధించటం సబబే అని మోయిన్ అలీ అన్నారు. వేలానికి ముందే అందరికీ రూల్స్ తెలుసు. వేలంలో ఫ్రాంచైజీలు తీసుకున్న తర్వాత ఆడకుంటే.. ఎదురయ్యే పరిణామాలు సైతం తెలుసు. ఆటగాళ్లు తమ నిర్ణయాలకు బాధ్యత వహించాల్సిందే అని ఆదిల్ రషీద్ అభిప్రాయం వ్యక్తం చేశాడు.

నవచిత్రం


'అతనొక్కడే'లా గుర్తుండిపోతుంది


కళ్యాణ్‌రామ్, విజయశాంతి

నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న యాక్షన్, ఫ్యామిలీ డ్రామా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు నిర్మించారు. ఈ చిత్ర టీజర్‌ని మేకర్స్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ,'ఈ కథ నాకు చాలా నచ్చింది. కళ్యాణ్ రామ్ నిజంగానే రాముడు లాంటి బాలుడు. తనకి చాలా మంచి మనసుంది. 'సరిలేరు నీకెవ్వరు' తర్వాత ఒక యాక్షన్ సినిమా చేయమని చాలామంది కోరారు. ఈ సినిమాలో అలాంటి యాక్షన్ కుదిరింది. చాలా రోజుల తర్వాత యాక్షన్ చేశాను. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు. 'అమ్మ (విజయశాంతి) చేసిన 'కర్తవ్యం' సినిమాని ఎవరు మర్చిపోలేం.ఈ సినిమా కథని డైరెక్టర్ ప్రదీప్ చెప్తుంటే 'కర్తవ్యం' సినిమాలో వైజయంతికి కొడుకు పుడితే ఎలాంటి ఇన్సిడెంట్స్ జరుగుతాయి అనేది ఈ కథ అన్నారు. అయితే అమ్మ ఒప్పుకుంటేనే ఈ సినిమా చేద్దామని అన్నాను. ఈ సినిమా మెయిన్ పిల్లర్ అమ్మ. ఈ వయసులో కూడా అమ్మ ఎలాంటి డూప్ లేకుండా అద్భుతమైనటువంటి స్టంట్స్ చేశారు. 'అతనొక్కడే' సినిమా ఎప్పటికీ గుర్తుంటుంది. ఈ సినిమా కూడా మరో 20 ఏళ్ల పాటు గుర్తుండిపోతుంది' అని హీరో నందమూరి కళ్యాణ్ రామ్ చెప్పారు.

మోహన్‌బాబు బర్త్‌డే కానుకగా..


మోహన్‌బాబు

హీరో విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ఈచిత్రానికి సంబంధించి థర్డ్ సింగిల్ అప్డేట్ వచ్చింది. మహాదేవ శాస్త్రి పరిచయ గీతంను ఈనెల 19న మోహన్ బాబు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆవిష్కరించనున్నారు. మోహన్ బాబు ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించడమే కాకుండా మహాదేవ శాస్త్రి పాత్రను కూడా పోషించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ పాటను మేకర్స్ విడుదల చేయనున్నారు.

ఈ చిత్రంలో విష్ణు మంచు, ప్రీతి ముకుందన్, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, ముఖేష్ రిషి, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు. సంగీత దర్శకుడు మిస్టర్ స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన పాటలు ఇప్పటికే శ్రోతలను అలరించాయి. ఇక ఇప్పుడు మూడో పాటగా మహా దేవ శాస్త్రి పరిచయ గీతాన్ని విడుదల చేయనున్నారు. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రాన్ని ముకేష్ కుమార్ సింగ్ తెరకెక్కించారు. ఏప్రిల్ 25న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

నవ్వించే 'సారంగపాణి..'



ప్రియదర్శి, రూప కొడువాయూర్

శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటిలది సూపర్ హిట్ కాంబినేషన్. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత వాళ్లిద్దరి కలయికలో రూపొందుతున్న మూడో చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి హీరోగా నటించారు.

వేసవిలో థియేటర్లలో వినోదాలు పంచేందుకు ఈ సినిమా సిద్ధమైంది. ఏప్రిల్ 18న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. 'సారంగపాణి జాతకం'లో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ కథానాయికగా నటించారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ సాంగ్ 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' పాటలు ట్రెండ్ అవుతుండగా, టీజర్‌లోని మాటలు, హాస్య సన్నివేశాలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'ఫస్ట్ కాపీతో సహా ఈ సినిమా రెడీ అయ్యింది. త్వరలో సెన్సార్ పూర్తి చేస్తాం. ఏప్రిల్ 18న థియేటర్లలోకి సినిమాను తీసుకొస్తున్నాం. వేసవిలో హాయిగా కుటుంబ సమేతంగా ఎంజాయ్ చేసే చిత్రమిది. మా దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఇటీవల విడుదలైన టీజర్‌లో ప్రేక్షకులకు మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో పరిచయం చేశాం. ఇంటిల్లిపాదినీ కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక చిత్రమిది' అని అన్నారు.

'ఏం బతుకురా నాది..'


రాజ్ తరుణ్


రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాంచ్ మినార్'. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్‌ఎల్‌పి బ్యానర్ పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం మేకర్స్ సినిమా ఫస్ట్ సింగిల్ మిడిల్ క్లాస్ ఆంథమ్ 'ఏం బతుకురా నాది' సాంగ్‌ని రిలీజ్ చేసి, మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు.

శేఖర్ చంద్ర ఈ సాంగ్‌ని క్యాచీ ట్యూన్‌గా కంపోజ్ చేశారు. దినేష్ రుద్ర ఈ పాటని పాడిన స్టయిల్ ఎట్రాక్టివ్‌గా ఉంది. హీరో క్యారెక్టర్‌ని ప్రజెంట్ చేస్తూ అనంత్ శ్రీరామ్ రాసిన లిరిక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సాంగ్‌లో రాజ్ తరుణ్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. అందరికీ కనెక్ట్ అయిన ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈచిత్రానికి సమర్పణ: గోవింద రాజు, రచన - దర్శకత్వం: రామ్ కడుముల, నిర్మాతలు: మాధవి, ఎంఎస్ఎం రెడ్డి, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి, ఆర్ట్ డైరెక్టర్: 'బేబీ' సురేష్ భీమగాని, డైలాగ్స్: గొరిజాల సుధాకర్.

ఆత్మలు ఎందుకు కనిపిస్తాయి?


అల్లరి నరేష్

హీరో అల్లరి నరేష్ ఓ విభిన్న చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'పొలిమేర, పొలిమేర 2' చిత్రాలతో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కి నాని కాసరగడ్డ దర్శకత్వంతో పాటు ఎడిటింగ్‌ని నిర్వహిస్తున్నారు.

సోమవారం ఈ సినిమా టైటిల్‌ను ఒక స్పైన్ చిల్లింగ్ టీజర్ ద్వారా రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి '12ఎ రైల్వే కాలనీ' అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు, టీజర్ సినిమా కథను గ్లింప్స్‌లా ప్రజెంట్ చేసింది. అల్లరి నరేష్ ఒక కిటికీ దగ్గర నిలబడి, ఆలోచనలో, ధ్యాన ముద్రలో కనిపించడంతో టీజర్ బిగెన్ అవుంతుంది. వైవా హర్ష వాయిస్ ఓవర్‌లో కొంతమందికి మాత్రమే ఆత్మలు ఎందుకు కనిపిస్తాయో, రాబోయే అతీంద్రియ అంశాలను ఎందుకు సూచిస్తుందో ప్రశ్నిస్తుంది. టీజర్‌లో వింతైన, కలవరపెట్టే సంఘటనలు ఎగ్జైటింగ్‌గా ఉన్నాయి. ప్రతి పాత్ర కూడా అనుమానాస్పదంగా ఉంది. అల్లరి నరేష్ పాత్ర ఒకరిని షూట్ చేసి, నవ్వడం ప్రేక్షకులను ఆ పాత్ర గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగించేలా ఉంది. అల్లరి నరేష్ డిఫరెంట్ షేడ్స్‌తో మరో ఆసక్తికరమైన పాత్రను పోషించగా, 'పొలిమేరా' సిరీస్ ఫేమ్ డాక్టర్ కామాక్షి భాస్కర్ల కథానాయికగా నటించారు. ఈ సమ్మర్‌లోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

వినోదంతో పాటు ఎమోషనూ ఉంది


సుప్రీత్ కృష్ణ

ఫాంటసీ, మ్యాజికల్ అంశాలతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు.

చిత్రవాహిని, ఆర్‌వైజి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి ఈచిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 21న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుప్రీత్ కృష్ణ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఓ క్రికెట్ యాడ్‌లో ఓ వెహికల్‌ని చూసినప్పుడు కలిగిన ఆలోచన ఇది. వెహికల్‌కు లైఫ్ ఉంటే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి వచ్చిన కథ ఇది. ఈ అంశానికి కమర్షియల్ ప్యాకేజీని కలిపి చేశాం. పిల్లల దగ్గరికి 'టుక్ టుక్' ఎలా వచ్చింది?, ఈ వెహికల్ వెనుక ఉన్న కథ ఏమిటి అనేది ఆసక్తికరంగా చెప్పాం. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్ కూడా ఉంటుంది. గతంలో వచ్చిన 'బామ్మ బాట బంగారు బాట', 'మెకానిక్ మామయ్య', 'కారు దిద్దిన కాపురం' చిత్రాలకు ఈ చిత్రానికి పోలీక ఏమీ లేదు. ఇది కంప్లీట్ ఒరిజినల్ స్టోరీ.
- చిత్తూరు నేపథ్యంలో 90 నుండి 20వ దశకంలో జరిగే స్టోరీ. ఈ సినిమాలో వెహికల్ పాత్రను గతం, వర్తమానం, భవిష్యత్ అన్ని తెలిసిన స్కూటర్‌గా డిజైన్ చేశాం. అందరికి హై ఇచ్చే సీక్వెన్స్‌లు ఉన్నాయి. రోషన్ నటించిన 'కోర్టు' హిట్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. 'కోర్టు'తో పాటు మా సినిమాపై కూడా రోషన్ మంచి నమ్మకంతో ఉన్నాడు. సినిమా హిట్ అవ్వడం, కోర్టు హిట్ అవ్వడం మా మూవీకి కూడా ప్లస్ అవుతుంది.

'షణ్ముఖ' రిలీజ్‌కి రెడీ


ఆది సాయికుమార్, అవికాగోర్

ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది.

సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈనెల 21న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అవికాగోర్ మాట్లాడుతూ, హీరో ఆది నటనకు అందరూ ఫిదా అవుతారు. రవి బసూర్ నేపథ్య సంగీతం ఈచిత్రానికి హైలెట్‌గా ఉంటుంది' అని అన్నారు.

'ఈ టైటిల్ చాలా పాజిటివ్‌గా ఉందని చెప్పారు. అవికాతో పనిచేయడం సంతోషంగా ఉంది. ఆమె పాత్రకు ఎంతో ఇంపార్టెంట్ ఉంటుంది. ఈ సినిమా ఓ మంచి ప్రయాణం. రవి బసూర్ అద్భుతమైన సంగీతం ఇచ్చాడు. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో నేపథ్య సంగీతం అందరిలో గూజ్ బంప్స్ తెప్పిస్తుంది. అందరూ ఆ నేపథ్య సంగీతం థ్రిల్‌గా ఫీలవుతారు. దర్శకుడు షణ్ముగం ఈ సినిమాను తన భుజాలపై వేసుకుని ఇక్కడి వరకు తీసుకొచ్చాడు' అని హీరో ఆది చెప్పారు.

దర్శకుడు షణ్ముగం సాప్పని మాట్లాడుతూ,'ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. మంచి టైటిల్‌కు తగ్గ కథతో ఈ సినిమా చేశాను. మా అన్నయ్య, మరో నిర్మాత తులసీరామ్ పుట్టినరోజు ఈనెల 21న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

వచ్చే వారం బ్యాంకు ఉద్యోగుల సమ్మె

- 24, 25న నిరసనలకు యూఎఫ్‌బీయూ పిలుపు
- పోస్టుల భర్తీ, ఐదు రోజుల పని డిమాండ్



నవ తెలంగాణ - హైదరాబాద్

దేశంలోని బ్యాంక్ ఉద్యోగులు తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రయివేటు, రూరల్ బ్యాంక్‌లకు చెందిన తొమ్మిది బ్యాంక్ యూనియన్లు తమ డిమాండ్‌లను నెరవేర్చాలని మార్చి 24-25 తేదీల్లో దేశ వ్యాప్త సమ్మెకు దిగనున్నాయి. ఈ ఆందోళనల్లో దాదాపుగా 8 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు పాల్గొననున్నారని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) వెల్లడించింది. ప్రధానంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఐదు రోజుల పని విధానం, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్‌లతో సమ్మెకు దిగుతున్నట్లు తెలిపింది. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫిడరేషన్ (ఏఐబీఓసీ), నేషనల్ కాన్ఫిడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ (ఏఐబీఓఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ), ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఐఎన్‌బీఓసీ), ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ (ఐఎన్‌బీఓసీ), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ (ఎన్‌ఓబీడబ్ల్యూ), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ ఆఫీసర్స్ (ఎన్‌ఓబీఓ) సంఘాలు యూఎఫ్‌బీయూ వేదికగా సమ్మెకు దిగుతున్నట్టు ఆ సంఘాల ప్రతినిధులు సంయుక్తంగా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల భర్తీ, వారానికి ఐదు రోజుల పని విధానంతో సహా ఏ అంశంపైనా ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ (ఐబీఏ) దిగి రాలేదని ఆ సంఘాల ప్రధాన ఆందోళన. పనితీరు ఆధారంగా ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) జారీ చేసిన ఆదేశాలనూ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది తమ ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పీఎస్‌బీల్లో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ పదవులను భర్తీ చేయాలని మరో ప్రధాన డిమాండ్‌గా ఉంది. గ్రాట్యూటీ చట్ట పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఈ పథకాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు అనుసంధానం చేయాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తోంది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు

- ఈ-కామర్స్ సంస్థల గిడ్డంగుల్లో బీఐఎస్ సోదాలు



న్యూఢిల్లీ : ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బీఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బీఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బీఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బీఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో సోదాలు చేసినట్టు సమాచారం.

మళ్లీ మారుతీ సుజుకీ ధరల పెంపు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మరోమారు తమ వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి తమ వాహన ధరలను 4 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్టు ఆ కంపెనీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో గత రెండు నెలల్లో ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యయాల భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయడం మినహా వేరే మార్గం లేదని ఆ కంపెనీ పేర్కొంది. ఈ కంపెనీ ప్రాథమిక మోడల్ ఆల్టో కె-10 నుంచి ఇన్విక్టో మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణి రూ.4 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు ఉంది. ఇంతక్రితం మోడళ్లను బట్టి గరిష్ఠంగా రూ.32,500 వరకు పెంచేసింది. తాజా పెంపునతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది.

హైదరాబాద్‌లో ఏప్రిలియా ట్యూనో 457 ఆవిష్కరణ



హైదరాబాద్ : ఏప్రిలియా ట్యూనో 457ను ఆ కంపెనీ హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.3,96,005గా నిర్ణయించినట్లు ఆ కంపెనీ తెలిపింది. 457 సిసి ట్విన్ సిలిండర్ ఇంజిన్ కలిగిన దీనికి మూడేళ్ల వారంటీని అందిస్తున్నట్టు పేర్కొంది. రూ.10,000తో ముందస్తు బుకింగ్స్‌ను తెరుస్తున్నామని.. త్వరలోనే డెలివరీలను ప్రారంభించనున్నట్టు వెల్లడించింది.

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలుపై అసెంబ్లీలో చర్చించండి

అంబేద్కర్ అభయహస్తం తక్షణమే అమలు చేయాలి : ఎమ్మెల్యేలు కూనంనేని, కాలేరు వెంకటేష్‌కు దళిత సంఘాల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఎన్నికల హామీలపై అసెంబ్లీలో చర్చించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్లలో సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కు ఆ సంఘాల నేతలు వినతిపత్రాలు అందజేశారు. అసెంబ్లీలో చర్చిస్తామని వారికి ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, పీయంసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్. శివలింగం, డీబీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు జి.నరసింహ మీడియా సమావేశంలో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకం స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామనే హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదని వారు విమర్శించారు. బడ్జెట్‌లో మొక్కుబడిగా నిధులు కేటాయించి చేతులు దులుపు కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీల రిజర్వేషన్లను 18 శాతం పెంచుతామన్న హామీని సైతం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మాల, మాదిగ, ఉపకులాల కార్పొరేషన్‌లుగా విభజిస్తామనే హామీని పక్కన పెట్టేశారని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్‌కు చైర్మెన్‌ను నియమించినప్పటికీ కొత్తగా యాక్షన్ ప్లాన్ విడుదల చేయడం లేదన్నారు. గతంలోని పెండింగ్ సబ్సిడీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు భూపంపిణీని అటకెక్కించారని చెప్పారు. దాడులకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు తక్షణ సహాయం, నష్టపరిహారం అందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పునరావాసం కల్పించడంలేదనీ, 41 సీఆర్పీసీ పేరుతో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇస్తుండటంతో దాడులు మరింత పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఎస్సీ, ఎస్టీలపై దాడులను సమీక్షించి అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం సంవత్సరంలో రెండు సార్లు ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగాల్సిన హైపవర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ చట్టం ప్రకారం 2011 జనాభా లెక్కల మేరకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఖర్చు అంతంత మాత్రమేనని చెప్పారు 2024-25 బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.33,127 వేల కోట్లను కేటాయించగా కేవలం రూ. 9,824 కోట్లను మాత్రమే ఖర్చు చేశారని గుర్తుచేశారు. అంటే ఖర్చు 29.7 శాతం మాత్రమేనని తెలిపారు. దాదాపు పది శాఖలు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి మళ్లీ బడ్జెట్ వస్తున్నప్పటికీ ఇంకా రూ. 23,303 కోట్లను పూర్తిగా ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల నిధుల కేటాయింపుల సంక్షేమంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనీ, దళిత అభివృద్ధి శాఖకు తక్షణమే మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నగర కార్యదర్శి బిట్ర సుబ్బారావు, ఎంఎస్ఎస్ ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. అరుణ్ కుమార్, మహేందర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జీడీపీలో పెరుగుతున్న ఆసియా వాటా




న్యూఢిల్లీ : ప్రపంచ జీడీపీ వృద్ధిలో ఆసియా కీలక పాత్ర పోషిస్తోంది. 1960ల కంటే.. 2023 నాటికి ప్రపంచ జీడీపీ లో ఆసియా వాటా ఊహించనిస్థాయిలో పెరిగిందని ప్రపంచ బ్యాంకు నివేదికలే చెబుతున్నాయి. ప్రపంచంలో ఖండాల వారీగా చూసుకుంటే.. యూరప్, ఉత్తర, దక్షిణ అమెరికాల కంటే ఆసియా జీడీపీ వృద్ధి పెరిగిందని ప్రపంచ బ్యాంకు వరల్డ్ డెవలప్‌మెంట్ ఇండికేటర్ (డబ్ల్యూడీఐ) సమాచారం వెల్లడించింది. 1960 నుంచి దశాబ్దాలవారీగా పరిశీలిస్తే.. ప్రపంచ జీడీపీలో ఆసియా ఖండం జీడీపీ వాటా పెరిగిందని డబ్ల్యుడిఐ సంఖ్యల్నిబట్టి చూస్తే తెలుస్తుంది. 2010-2023 మధ్య కాలంలో ప్రపంచ జిడిపిలో ఆసియా వాటా 34.5 శాతంగా ఉంది. ఆసియా జీడీపీ వాటా పెరుగుతుంటే.. మరోవైపు ఉత్తర అమెరికా, యూరప్ జిడిపి వాటా తగ్గిందని డబ్ల్యుడిఐ సమాచారం పేర్కొంది.

కీలకంగా మారిన ఆసియా జీడీపీ వాటా

ప్రపంచ జీడీపీ వృద్ధిలో ఆసియా వాటా 1960 దశాబ్దంలో 17.2 శాతం నుంచి 2010-23 మధ్య 48.5 శాతంకి పెరిగింది. ప్రపంచ జీడీపీ వృద్ధిలో ఆసియా కీలక వాటాదారిగా మారింది. ప్రత్యేకించి 1990ల నుంచి పరిశీలిస్తే.. ప్రపంచ జీడీపీ లో ఆసియానే అతిపెద్ద వాటాదారుగా నిలిచింది. ఉత్తర అమెరికా, యూరప్‌లు ఆధిపత్యంలో ఉన్న సమయంలో కంటే.. ప్రపంచ జీడీపీ వృద్ధికి ఆసియా జీడీపీ వాటా ఎక్కువగా ఉంది. యూరప్ వాటా 1960ల్లో 30 శాతంగా ఉంది. అదే 2010-23 కల్లా 18.9 శాతానికి పడిపోయింది. ఇక ఉత్తర అమెరికాది కూడా అదే పరిస్థితి. 1960ల్లో ఉత్తర అమెరికా జీడీపీ 28.7 శాతంగా ఉంది. 2010-23కి 23.1 శాతానికి పడిపోయింది.

అమెరికా - చైనా

ప్రపంచ జిడిపిలో అమెరికా, చైనా జిడిపిలు కీలకంగా మారాయి. 2023 ఆసియా జిడిపిలో 49.6 శాతం చైనా నుంచే వచ్చింది. 2010-23లో 44.7 శాతంగా ఉంది. ప్రపంచ జిడిపి వాటాలో అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థలు చాలా ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. 2010-23లలో అమెరికా 39.9 శాతం, చైనా 47.7శాతంగా ఉన్నాయి. ప్రపంచ జిడిపి వృద్ధిలో భారత్ ఈ సమయంలో ప్రధాన వాటాదారుగా ఉండేందుకు ప్రయత్నించింది. కానీ ఈ రెండు దేశాల జిడిపి కంటే భారత్ తక్కువ వాటానే కలిగి ఉంది.ప్రపంచంలో అమెరికా, చైనాల ఆర్థిక వ్యవస్థల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. 2023లో అమెరికా, చైనాలు రెండు దేశాలు కలిపి ప్రపంచ జిడిపి వాటాలో 42.6 శాతంగా ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఈ నిష్పత్తి పెరుగుతోంది. 2010-23లో అత్యధిక జిడిపి వాటా 15.6 శాతం వాటాతో రెండోస్థానంలో నిలిచింది. 1960లో జర్మనీ వాటా 8.7 శాతంగా ఉంది. ఇక జపాన్ 1970ల నుంచి 1990ల సగటు 9.4 శాతంగా ఉంది. 1960ల్లో అమెరికా జిడిపి వాటా 33.2 శాతంగా ఉంది. కానీ క్రమంగా తగ్గుతూ 2010-23కల్లా 24.4 శాతానికి పడిపోయింది. దీన్నిబట్టి చూస్తే ఇతర దేశాల కంటే కూడా చైనా చాలా వేగంగా ముందుకొచ్చింది. 2000ల నుంచి చైనా ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుని.. ప్రస్తుతం రెండో ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. బహుశా అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థల మధ్యే ఎకానమిక్ వార్ జరుగుతోందని ట్రెండ్‌నుబట్టి తెలుస్తోంది.



మోడీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది : ఖర్గే

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా.. మోడీ ప్రభుత్వం మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం లేదు. ప్రజల్ని దోచుకుంటోంది అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. చమురు ధరలు తగ్గినప్పటికీ దాని ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం ప్రజలకు చేరవేయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని.. పలు మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికల్ని ఆయన ఉటంకించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయి. అయినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గట్లేదు. 2014 నుంచి సుమారు 34 శాతం వరకు ముడి చమురు ధరలు తగ్గాయి. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ. 36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుంది' అని ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిలిమిటేషన్ అంశంపై కూడా ఆయన స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని చూస్తోంది. డిలిమిటేషన్ ద్వారా దక్షిణాదిలో ఎంపీ సీట్ల సంఖ్య తగ్గే వకాశం ఉంది. ఉత్తరాదిలో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దాంతో దేశంలో సమన్యాయం లేకుండా పోతుంది. అలాంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలని ఖర్గే పిలుపునిచ్చారు.

ఆ కేసులన్నింటినీ గువహటిలోనే విచారించాలి : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండ కేసులను గువహటికి బదిలీ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ప్రస్తుతం సిబిఐ విచారణ చేపడుతున్న ఈ కేసులను గతంలో అస్సాంకి బదిలీ చేసింది. బదిలీ చేయబడిన కేసుల విచారణ గువహటి కోర్టులోనే జరుగుతుందని మేము స్పష్టం చేస్తున్నాం అని సిజెఐ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. 2023, ఆగస్ట్ 25న ముందస్తు విచారణ కోసం గువహటికి బదిలీ చేసిన కేసులలో విచారణపై న్యాయవాది చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

సిజెఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం కూడా జస్టిస్ గీతామిట్టల్ నేతృత్వంలోని కమిటీ పదవీకాలాన్ని 2025, జులై 31 వరకు పొడిగించింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 21కి వాయిదా వేసింది. మణిపూర్ జాతి హింస ఘటనల్లో బాధితుల ఆశ్రయం మరియు ఉపశమనం కోసం బాంబే హైకోర్టు జడ్జి ఎస్.పి.జోషి, ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి ఆశా మీనన్, జమ్ముకాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ అధ్యక్షతన సుప్రీంకోర్టు 2023 ఆగస్టు 7న ఒక కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. గతేడాది ఆగస్టు 5న కమిటీ పదవి కాలాన్ని సుప్రీంకోర్టు ఆరు నెలలు పొడిగించింది. మణిపూర్‌లో వాతావరణం, నేర విచారణ న్యాయమైన ప్రక్రియను నిర్ధారించాల్సిన అవసరాల రీత్యా సుప్రీంకోర్టు గతంలో 27 కేసులను అస్సాంకి బదిలీ చేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన కేసుతో పాటు లైంగిక వేధింపుల కేసులు వీటిలో ఉన్నాయి. బదిలీ అయిన కేసులను పరిష్కరించడానికి ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది న్యాయాధికారులను నామినేట్ చేయాలని గువహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు ఆదేశించింది.

అసెంబ్లీలో వీగిన అన్నాడీఎంకే అవిశ్వాస తీర్మానం




చెన్నై : తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పావుకి వ్యతిరేకంగా సోమవారం అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అన్నాడిఎంకె ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వాయిస్ ఓటుతో విఫలమైందని డిప్యూటీ స్పీకర్ పిచాండి ప్రకటించారు. 154 మంది సభ్యులు తీర్మానాన్ని వ్యతిరేకించగా, కేవలం 62 మంది మాత్రమే అనుకూలంగా ఓట్లు వేసినట్లు తెలిపారు. అసెంబ్లీలో స్పీకర్ ఎం. అప్పావు "పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, డిఎంకె కార్యకర్తలా పనిచేస్తున్నారు" అని అన్నాడీఎంకే తన తీర్మానంలో పేర్కొంది. అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని చూసి ప్రజలు 'నవ్వుతారు' అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎద్దేవా చేశారు. అప్పావు చర్యలు ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగానే ఉన్నాయని, అందుకే స్పీకర్‌గా ప్రకటించామని అన్నారు. తమ ప్రభుత్వం, పార్టీ ప్రభావం లేకుండా ఆయన వ్యవహరిస్తున్నారని, ఈరోజు ఈ అంశాన్ని ప్రజలు కూడా విశ్వసిస్తారని అన్నారు.

నేరస్థులకు రక్షణ కల్పిస్తున్న నితీశ్‌కుమార్ ప్రభుత్వం

పాట్నా : బీహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం నేరస్థులకు రక్షణ కల్పిస్తోందని ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. తేజస్వీయాదవ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి సహా పలువురు ఆర్‌జెడి ఎమ్మెల్యేలు సోమవారం ఉదయం అసెంబ్లీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తేజస్వీయాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే సురక్షితంగా లేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పోలీసులపై దాడులు జరుగుతున్నాయని, వారికే భద్రత లేదని, రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇక్కడ ఎవరు సురక్షితంగా ఉన్నారని నితీశ్‌కుమార్ ప్రభుత్వాన్ని నిలదీశారు. నితీష్ కుమార్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ అభద్రతా భావానికి గురవుతున్నారని అన్నారు.

హోలీ సందర్భంగా రెండు రోజుల్లో 22 హత్యలు జరిగితే, రోజుకి ఎన్ని హత్యలు జరుగుతాయని ఆర్‌జెడి నేత రబ్రీదేవి నితీశ్‌కుమార్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక్కడ సుపరిపాలన ఉందని, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉందని నితీశ్‌కుమార్ పేర్కొన్నారని ..కానీ ప్రభుత్వ, పోలీస్ అధికారులే హత్యకు గురవుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత శుక్రవారం (హోలీ) సాయంత్రం అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ హత్యకు గురైన సంగతి తెలిసిందే.



67 సంస్థలపై ఎంహెచ్‌ఏ నిషేధం

న్యూఢిల్లీ : కేంద్ర హోం శాఖ (ఎంహెచ్‌ఏ) తాజాగా 67 సంస్థలపై నిషేధం విధించింది. ఉగ్రవాద సంస్థలు, చట్టవ్యతిరేక సంస్థల సవరించిన తాజా జాబితాను ఎంహెచ్‌ఏ ప్రకటించింది. ఉగ్రవాద కార్యకలాపాలలో వారి పాత్ర కారణంగా, దేశ భద్రతకు ముప్పు కలిగిస్తున్నందుకు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కింద 67 సంస్థలపై నిషేధం విధించినట్లు తెలిపింది. యూఏపీఏ సెక్షన్ 35 కింద అధికారికంగా ఉగ్రవాదసంస్థలుగా వర్గీకరించి, చట్టంలోని మొదటి షెడ్యూల్‌లో 45 సంస్థలను చేర్చినట్టు పేర్కొంది. మిగిలిన 22 సంస్థలను యూఏపీఏ సెక్షన్ 3(1) కింద చట్ట వ్యతిరేక సంస్థలుగా వర్గీకరించింది.

ఈ సంస్థలలో చాలావరకు దేశవ్యాప్తంగా ఉగ్రవాదం, వేర్పాటువాదం మరియు హింసాత్మక కార్యకలాపాలలో పాల్గొన్నాయని ఎంహెచ్‌ఏ పేర్కొంది. ప్రతి ఏడాది ఎంహెచ్‌ఏ ఈ జాబితాను ఆధునీకరిస్తూనే ఉంది. యూఏపీఏ కింద జాబితా చేసిన సంస్థల ఆస్తులను స్తంభింపచేయడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న సభ్యుల అరెస్టులు వంటి చర్యలను చేపడుతోంది.

మోడీ, క్రిస్టోఫర్ భేటీ

రక్షణ ఒప్పందంపై భారత్ - న్యూజిలాండ్ సంతకం



న్యూఢిల్లీ : ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం నరేంద్ర మోడీతో భేటీయ్యారు. ఈ సందర్భంగా భారత్-న్యూజిలాండ్ ప్రధానమంత్రులు తమ దేశాల మధ్య ఉన్న రక్షణ, భద్రతా సంబంధాలను సంస్థాగతీకరించే భారీ ఒప్పందంపై సంతకం చేశారు. న్యూజిలాండ్‌లో భారత్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న చట్ట విరుద్ధ కార్యక్రమాలపై మోడీ ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ఇరుదేశాల మధ్య ఈ ఒప్పందం కుదరడం విశేషం. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నరేంద్ర మోడీ, క్రిస్టోఫర్ లక్సన్ మధ్య సోమవారం విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. ప్రధానంగా వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఈ చర్చల తరువాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక మీడియా ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రకటనలో 'ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, సంస్థాగతీకరించడానికి రెండు వైపుల నుంచి నిర్ణయం తీసుకున్నాం' అని మోడీ తెలిపారు. అలాగే రక్షణ పరిశ్రమ రంగంలో సహకారం కోసం ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తామని కూడా మోడీ వెల్లడించారు. అదేవిధంగా 'మేమిద్దరం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒకే మాటపై ఉన్నాం. అది 2019 మార్చి 15న జరిగిన క్రైస్ట్‌చర్చ్ ఉగ్రదాడి అయినా లేదా 2008 నవంబర్ 26న జరిగిన ముంబయి ఉగ్రదాడి అయినా సరే.. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. ఆమోదయోగ్యం కాదు' అని మోడీ తెలిపారు. ఉగ్రవాద దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు అవసరమని ప్రధానమంత్రి మోడీ తెలిపారు. 'ఉగ్రవాద, వేర్పాటువాద, రాడికల్ శక్తులకు వ్యతిరేకంగా మేం కలిసి సహకరించుకోవడం కొనసాగిస్తాం. అయితే, ఇదే సందర్భంలో న్యూజిలాండ్‌లోని కొన్ని చట్ట విరుద్ధ శక్తులు భారత వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయనే మా ఆందోళనను మేం పంచుకున్నాం' అని మోడీ పేర్కొన్నారు. అలాగే ఈ చట్టవ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా న్యూజిలాండ్ ప్రభుత్వం నుంచి తమకు సహకారం కొనసాగుతుందని భారత్ విశ్వాసంగా ఉందని మోడీ తెలిపారు.

అంతేకాకుండా, పరస్పర ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించాలని భారత్-న్యూజిలాండ్ నిర్ణయించుకున్నాయని ప్రధాని మోడీ ప్రకటించారు. దీంతో పరస్పర వాణిజ్యం, పెట్టుబడులు పెరుగుతాయని, పాడిపరిశ్రమ, ఆహార ప్రాసెసింగ్, ఫార్మా వంటి రంగాల్లో పరస్పర సహకారం, పెట్టుబడులు ప్రోత్సహిస్తామని మోడీ చెప్పారు. స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన ఇండో-పసిఫిక్‌కు భారత్, న్యూజిలాండ్ మద్దతు ఇస్తున్నాయని మోడీ తెలిపారు. 'మేం విస్తరణవాదాన్ని కాదు, అభివృద్ధి విధానాన్ని నమ్ముతాం' అని మోడీ చెప్పారు. కాగా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సవాలుతో కూడిన వ్యూహాత్మక దృక్పథం గురించి మోడీతో చర్చించినట్లు న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ తెలిపారు. సంపన్నమైన ఇండో-పసిఫిక్‌కు దోహదపడ్డంతో పాటు, ఇరుదేశాలకు సంబంధించిన ఉమ్మడి ఆందోళనలను పరిష్కరించడానికి బలమైన నిబద్ధతను పునరుద్ఘాటించినట్లు క్రిస్టోఫర్ వెల్లడించారు.

2.38 శాతానికి ఎగిసిన టోకు ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ : దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 2.38 శాతానికి పెరిగింది. జనవరిలో ఇది 2.31శాతంగా ఉన్నట్లు సోమవారం విడుదలైన అధికారిక నివేదిక తెలిపింది. ఆహార ఉత్పత్తులు, ఆహార వస్తువులు, వస్త్రాలు, ఆహారేతర వస్తువులు, ఇతర తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడంతో టోకు ద్రవ్యోల్బణం పెరిగినట్టు పేర్కొంది. కూరగాయల ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణం, సరఫరా పెరగడంతో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఇటీవల కాలంలో తగ్గుతున్నాయని, రానున్న నెలల్లో మరిన్ని వడ్డీ రేట్లపై కోతలు అంచనాలను మరింత పెంచుతున్నాయి.

ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం కేంద్రబ్యాంకు నిర్దేశించిన 4శాతం లక్ష్యం కంటే తక్కువకు పడిపోయిందని , కూరగాయల ధరలు తగ్గడమే ప్రధాన కారణమని గతవారం ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

బీసీ బిల్లుపై ప్రధాని మోడీకి సీఎం లేఖ

అపాయింట్‌మెంట్ కోరిన రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి ఒక లేఖ రాశారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో రెండు బిల్లులను ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బిల్లులకు కేంద్రం మద్దతు కోరేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆ లేఖలో సీఎం పేర్కొన్నారు.

'రాజీవ్ యువ వికాస '

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ మేరకు ఆదివారం నోటిఫికేషన్ జారీ కాగా సోమవారం నుంచి ఆన్‌లైన్, మండలాఫీసు, ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్ 6 నుంచి మే 30 వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల మంజూరు ఉంటుంది. జూన్ 2న ప్రతి జిల్లాలో మంజూరి పత్రాలను ప్రదానం చేస్తారు. రూ.6 వేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ పథకాన్ని 5 లక్షల మంది లబ్ధిదారులకు అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా స్థాయిలో సంబంధిత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతను ఎంపిక చేస్తారు.

మహిళా సంఘాలకు దేవాదాయ భూముల లీజ్

వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తాం

చిట్‌చాట్‌లో మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేవాదాయ శాఖ పరిధిలోని భూములు అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు మహిళా సంఘాలకు లీజుకిస్తామని అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సెల్ఫ్ డ్రైవింగ్ గురించి కేటీఆర్‌కు తెలిసినంత ఎవ్వరికీ తెల్వదని దెప్పిపొడిచారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆమె మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఆర్కియాలజీ, దేవాదాయ, టూరిజం, ఫారెస్టు శాఖలను యూనిట్‌గా చేస్తే టెంపుల్ టూరిజం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. దేవాలయాల్లోని బంగారం వివరాలు తెప్పిస్తున్నామనీ, ఒక్క వేములవాడ రాజన్న టెంపుల్‌లోనే 60 కేజీల బంగారం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను ఒకే గొడుగు కిందకు తేబోతున్నామన్నారు. ప్రతి గుడి ఖర్చులనూ థర్డ్ పార్టీతో ఆడిట్ చేపిస్తామన్నారు. పురాతన దేవాలయాల అభివృద్ధి కోసం అనేక దరఖాస్తులు వస్తున్నాయన్నారు. టీటీడీ తరహాలోనే యాదగిరి గుట్ట బోర్డు ఉండాలని చట్టసవరణ చేశామని చెప్పారు. అయితే, యాదగిరి గుట్ట బోర్డుకు స్వయం ప్రతిపత్తి ఉండదనీ, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీల లెటర్లతో దైవదర్శనాలకు వెళ్లే వారి విషయంలో అభ్యంతరాలు తెలపడం సరిగాదన్నారు.

24 నుంచి టీటీడీ దర్శనాల్లో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలకు అనుమతి

ఉత్తర్వులు జారీ చేసిన టీటీడీ బోర్డు

ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలతో వచ్చే భక్తులకు ఈ నెల 24 నుంచి తిరుమలలో దర్శనాలకు అవకాశం కల్పిస్తున్నట్టు టీటీడీ బోర్డు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సహకరించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దర్శనాల విషయంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసులపై టీటీడీ బోర్డు అభ్యంతరాలు తెలిపిన విషయం విదితమే. ఇది సరిగాదనీ, తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీల లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు మంత్రి కొండా సురేఖ లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీనిపై ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు టీటీడీ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.



సమాచార సమన్వయంతో పోరాటాలకు స్ఫూర్తి

- 'టెలిసూర్' ప్రెసిడెంట్
- హవానాలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

హవానా : ప్రపంచంలోని వివిధ దేశాల్లో పోరాడే ప్రజల మధ్య జరిగే సమాచార సమన్వయం పోరాటాలకు మరింత స్ఫూర్తి నిస్తుందని లాటిన్ అమెరికా దేశాల ప్రత్యామ్నాయ టెలివిజన్ ఛానల్ 'టెలిసూర్' ప్రెసిడెంట్ పట్రిసియా విజగ అన్నారు. క్యూబన్ ప్రెస్ డే సందర్భంగా ఆ దేశానికి చెందిన యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ క్యూబా (యుపిఇసి)'పాత్రియా ఇంటర్నేషనల్ కొలోక్యూమ్ 4వ ఎడిషన్ 'అంతర్జాతీయ సదస్సును సోమవారం హవానాలో ప్రారంభమైంది. ఈ సదస్సుకు 46 దేశాల నుండి 300మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన పట్రిసియా విజగ పోరాడే ప్రజల మధ్య పరస్పర సమాచార మార్పిడి అత్యంత కీలకమని చెప్పారు. టెలిసూర్ ప్రారంభం నుండి ఈ లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

వెనిజులా మాజీ అధ్యక్షుడు ఛావెజ్ చొరవతో 2000 సంవత్సరంలో ప్రారంభమైన తమ సంస్థ 2005 నుండి కార్పొరేట్ మీడియా సంస్థల కట్టుకథలపై విస్తృతమైన పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వెనిజులాతో పాటు లాటిన్ అమెరికా అంతా విస్తరించి పోరాడే ప్రజలకు సంఘీభావంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్‌లో చోటుచేసుకున్న అకృత్యాలను, అమానుష హింసాకాండను వెలికితీసే క్రమంలో భద్రతకు సంబంధించి తీవ్రమైన సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. భాషా సంబంధిత సమస్యలు వీటికి అదనమని చెప్పారు. అటువంటి అవాంతరాలు ఎన్ని ఉన్నా అధిగమించి ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. అంతర్జాతీయంగా ఈ కృషిని మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన బాధ్యత వివిధ దేశాల్లో ఉన్న ప్రత్యామ్నాయ మీడియా సంస్థలపై ఉందని చెప్పారు. తాము ప్రారంభించిన కాలంలో సాంకేతికతకు పరిమితులుండేవని, ఇప్పుడు ఎఐతో సహా ఆధునిక సాకేతికత అందుబాటులోకి వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని చెప్పారు. ఆమె ప్రసంగాన్ని హవానా విశ్వవిద్యాలయంకు చెందిన కమీల అనే జర్నలిజం విద్యార్థిని అంగ్లంలోకి అనువదించారు.

సందర్శించిన క్యూబన్ ప్రెసిడెంట్

క్యూబా ప్రెసిడెంట్ మిగాయిల్ డయాజ్ కానెల్ అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులను ఆయన పలకరించి, కాసేపు మాట్లాడారు. వారితో కలిసి గ్రూపు ఫోటో దిగారు.

-బి. తులసీదాస్

కార్మిక చట్టాలపై ముందుకు

అమలుకు సిద్ధమవుతున్న కేంద్రం

- ట్రేడ్ యూనియన్ల ఆగ్రహం
- దేశవ్యాప్త నిరసనలకు ప్రణాళికలు
- నేడు సమావేశం కానున్న కార్మిక సంఘాలు



ఫైల్..

న్యూఢిల్లీ : వివాదాస్పద నూతన కార్మిక చట్టాల అమలు విషయంలో మోడీ సర్కారు ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నది. ఈ చట్టాల అమలుకు ప్రణాళికలు రచిస్తున్నది. ఇవి కార్మిక వ్యతిరేక చట్టాలనీ, వీటిని వెనక్కి తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా పలు కార్మిక సంఘాలు ఇప్పటికే డిమాండ్ చేశాయి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కారు ఇవేమీ పట్టించుకోకుండా చట్టాల అమలుకే సై అంటున్నది. ఇది కార్మిక సంఘాలకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. దీంతో దేశవ్యాప్త నిరసనలకు ట్రేడ్ యూనియన్లు సిద్ధమవుతున్నాయి.

కోడ్ ఆన్ వేజెస్, ఇండస్ట్రీయల్ రిలేషన్స్ కోడ్, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్.. ఈ నాలుగు చట్టాల కోసం నిబంధనలు రూపొందించటాన్ని వేగవంతం చేయటానికి గత ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ అనేక సమావేశాలను ఏర్పాటు చేస్తోన్నారు. 'లేబర్' అనే అంశం ఉమ్మడి జాబితాలో ఉన్నది. కాబట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిబంధనలను రూపొందించాల్సి ఉంటుంది. కేంద్రం, పలు రాష్ట్రాలు ఇప్పటికే ముసాయిదా నిబంధనలను పబ్లిష్ చేశాయి.

ఈ నేపథ్యంలో కార్మిక చట్టాలను అమలు చేయటానికి కేంద్రం యోచిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తున్నది. వచ్చేనెల నుంచి ప్రారంభం కానున్న 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి దగ్గరలోనే వీటిని అమలు చేయొచ్చని సమాచారం. "ఆందోళనల పరిష్కారానికి రాష్ట్రాలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశాలు జరుగుతోన్నాయి. నాలుగేండ్ల క్రితమే కేంద్రం ముసాయిదా నిబంధనలను నోటిఫై చేసింది. 2025-26 ప్రారంభంలో చట్టాల అమలుకు ప్రభుత్వం ఆసక్తితో ఉన్నది" అని ఒక అధికారి చెప్పారు.

నేడు ట్రేడ్ యూనియన్ల సమావేశం

లేబర్ కోడ్‌ల అమలులో మోడీ సర్కారు అత్యుత్సాహంపై ట్రేడ్ యూనియన్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. దీంతో కార్మిక సంఘాలు మంగళవారం సమావేశం కానున్నాయి. నాలుగు చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు ఒక కార్యక్రమాన్ని రూపొందించటంపై ఇవి చర్చించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్‌కు చెందిన పది కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల సంయుక్త వేదిక ఈ సమావేశానికి పిలుపునిచ్చింది.

చట్టాలపై ఐఎల్‌సీలో చర్చ జరగలేదు : ఐఎన్‌టీయూసీ

నూతన కార్మిక చట్టాలు ప్రస్తుతమున్న 29లేబర్ చట్టాలను రీప్లేస్ చేస్తాయనీ, ఇవి కార్మికులను దెబ్బతీస్తాయని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ ఉమేశ్, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ అశోక్ సింగ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఆమోదానికి ముందు నాలుగు చట్టాలపై ఇండియన్ లేబర్ కాంగ్రెస్ (ఐఎల్‌సీ)లో చర్చించలేదని అశోక్ సింగ్ అన్నారు. 2015 నుంచి ఐఎల్‌సీ సమావేశమే జరగలేదని గుర్తు చేశారు.

లేబర్ కోడ్‌ల ప్రతులు దహనం చేస్తాం : సీఐటీయూ

రూల్స్‌ను నోటిఫై చేసిన రోజే నిరసనలు చేసే ప్రదేశాల వద్ద లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఉమేశ్ అన్నారు. మేలో సార్వత్రిక సమ్మె జరుగుతుందని వివరించారు. కేంద్ర వ్యవసాయ పాలసీలపై ప్రస్తుతం నిరసనలు చేస్తోన్న రైతు సంఘాలు కూడా ట్రేడ్ యూనియన్ల నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే, ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ మాత్రం ట్రేడ్ యూనియన్ల ఆందోళనలకు దూరంగా ఉంటున్నది. తాము ఏ నిరసనల్లోనూ పాలుపంచుకోవటం లేదని బీఎంఎస్ నార్త్‌జోన్ సెక్రెటరీ పవన్ కుమార్ చెప్పారు.

గ్రూప్స్ పరీక్షా పేపర్లను రీవాల్యూయేషన్ చేయాలి

అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాలి : శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గ్రూప్స్ పరీక్షల పేపర్లను రీవాల్యూయేషన్ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శాసనమండలిలో ఆమె పిటిషన్ సమర్పించారు. అభ్యర్థులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారనీ, వాటిని ప్రభుత్వం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నివృత్తి చేయాలని సూచించారు. గ్రూప్స్ పరీక్షలు రాసిన విద్యార్థులు పలు అనుమానాలు లేవనెత్తుతూ తెలంగాణ విద్యార్థుల జేఏసీ విద్యార్థులు తనకు పిటిషన్ అందించారని తెలిపారు. గ్రూప్ 1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను వెల్లడించకపోవడం నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధమని ఎత్తిచూపారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరు హాల్ టికెట్ నెంబర్లు కేటాయించడం వల్ల కూడా విద్యార్థులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని ఆమె సభ దృష్టికి తీసుకొచ్చారు. క్యాటగిరీ వారీగా వెబ్ నోట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండూ మూడ్రోజుల క్రితం వెబ్ నోట్ పెట్టి మళ్లీ డిలీట్ చేశారనీ, దాంతో విద్యార్థుల అనుమానాలు బలపడుతున్నాయని వివరించారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలకు దాదాపు 5 లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారనీ, అందులో 2.3 లక్షల మంది పరీక్షలు రాశారని తెలిపారు. 13,315 ఓఎంఆర్ షీట్లు ఇన్ వాలీడ్ అయ్యాయని పబ్లిక్ సర్వీస్ కమిషన్ చెబుతోందనీ, కానీ అందుకు కారణం చెప్పకపోవడంతో విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కమిషన్ విడుదల చేసిన ప్రాథమిక కీ కి, ఫైనల్ కీ కి చాలా వ్యత్యాసాలు ఉన్నాయనీ, దాంతో మార్కులు తగ్గి ఉద్యోగావకాశాలకు గండి పడిందని తెలిపారు. తెలుగు మీడియం అభ్యర్థుల విషయంలోనూ అన్యాయం జరిగిందని అంటున్నారనీ, ముఖ్యంగా తెలుగు రాని అధ్యాపకులు పేపర్లు దిద్దడం వల్ల ట్రాన్స్‌లేషన్ సమస్య ఏర్పడి మార్కులు తక్కువగా వచ్చాయన్నారు. గ్రూప్ 4 విషయంలోనూ అనుమానాలను అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. లోకల్, నాన్ లోకల్ ఆప్షన్ లేదని, దాంతో మల్టీజోన్‌లో ఎక్కడ నియామకాలు చేపడుతారో స్పష్టత ఇవ్వలేదని తెలిపారు.



విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

టీచర్ల సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపండి : గవర్నర్‌కు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపు పెంచేలా చూడాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్‌తో కలిసి ఆయన గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల గురించి వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఉద్యోగులకు మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించేలా చూడాలని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, ఇతర బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసేలా ఆదేశించాలని పేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు, హెల్త్ కార్డులు, పదోన్నతులు అందేలా చూడాలని విన్నవించారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీ జరిగేలా చూడాలనీ, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వివరించారు.

అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్లాన్

శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని టూరిజం ప్రత్యేక పాలసీలో పెట్టాం : మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా టూరిజం పాలసీని రూపొందించామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కామారెడ్డి జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపైనా, దేవాదాయ, పర్యావరణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై కాంగ్రెస్ సభ్యులు మదన్‌మోహన్‌రావు, బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు, పైడి రాకేశ్‌రెడి అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. పోచారం రిజర్వాయర్ ప్రాంతంలో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నాగన్నబావి అభివృద్ధి, ఫుడ్‌కోర్టు, లైటింగ్ అంశాలు ప్రభుత్వ ప్రతిపాదనల్లో ఉన్నాయని చెప్పారు. పాల్వాయి హరీశ్‌బాబు లేవనెత్తిన అసిఫాబాద్‌లో హరిత హోటల్ నిర్మాణం పూర్తిచేయడం తమ పరిశీలనలో ఉందన్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని స్పెషల్ టూరిజం పాలసీలో పెట్టామన్నారు. ఎకో టూరిజాన్ని ప్రోత్సహించబోతున్నామన్నారు. టీజీఎఫ్‌డీసీ ద్వారా ఎకో పర్యాటకాన్ని చేపట్టేందుకు ఎస్ఆర్ఎస్‌పీ సమీపంలోని ఉమ్మెద గ్రామంలోని సర్వే నెంబర్ 618లో 1.20 ఎకరాలను, జలాల్‌పూర్‌లోని సర్వే నెంబర్ 71లోని మూడెకరాల భూమిని సాగునీటి శాఖ ద్వారా ప్రభుత్వం తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు అప్పగించిందని తెలిపారు. అవసరమైన తదుపరి అభివృద్ధి పనులను టీజీఎఫ్‌డీసీ చేపట్టబోతున్నట్టు తెలిపారు.

రెండు వాయిదా ప్రతిపాదనల తిరస్కరణ

అభయహస్తం కింద రాష్ట్ర సర్కారు ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత అంశంపై బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని శాసనసభ తిరస్కరించింది. సింగరేణి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని కూడా సభ తిరస్కరించింది.

రాములోరి తలంబ్రాలకు ఆర్టీసీ ఏర్పాట్లు

రూ.151 చెల్లిస్తే ఇంటికే తెచ్చిస్తారు : పోస్టర్ ఆవిష్కరించిన టీజీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలను నేరుగా భక్తుల ఇండ్లకే చేర్చే కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఏర్పాట్లు చేసింది. దేవాదాయ శాఖ సహకారంతో కల్యాణ తలంబ్రాల హోం డెలివరీ చేస్తున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్‌డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాలతో పాటు సంస్థ వెబ్‌సైట్ "స్రంతిఎశ్రీశీస్రఆర్ఐఎం.ఎశీ.ఐఆ లో రూ.151 చెల్లించి వివరాలను నమోదు చేసుకుంటే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఆ తలంబ్రాలను భక్తులకు హోం డెలివరీ చేస్తారు. దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ఆవిష్కరించి తలంబ్రాల బుకింగ్‌ను ప్రారంభించారు. భద్రాద్రిలో ఏప్రిల్ 6న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా భక్తుల నుంచి నేరుగా ఆర్డర్లు స్వీకరిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు ఆర్టీసీ కాల్‌సెంటర్ ఫోన్ నంబర్లు 040-69440069, 040-69440000లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ వీ రవీందర్, ఈడీ మునిశేఖర్, సీటీఎం(కమర్షియల్) శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు 574 మంది ఎంపిక

తుది ఫలితాలు విడుదల

టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల పరిధిలో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్, మ్యాట్రన్, మహిళా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షల తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 581 పోస్టులకు 574 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ఆ వివరాలను www.tspsc. gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామనీ, అభ్యర్థులు ఆ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 23న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు. గతేడాది జూన్ 24 నుంచి 29 వరకు కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్ష (సీబీఆర్టీ) విధానంలో రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,45,359 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1, గ్రేడ్-2, మహిళా సూపరింటెండెంట్ పోస్టులకు 561 మంది, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలో వార్డెన్, మ్యాట్రన్ గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టులకు 13 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు.

ప్రతి నియోజకవర్గానికీ విజన్

ఎమ్మెల్యే ఛైర్మన్, జిల్లాస్థాయి అధికారి స్పెషల్ ఆఫీసర్

పి4పై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



అమరావతి : స్వర్ణాంధ్ర విజన్-2047 తరహాలో ప్రతీ నియోజకవర్గానికి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047పై సోమవారం అసెంబ్లీలో లఘు చర్చ జరిగింది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ దీనిలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వీటిని అమలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గాలవారీ విజన్ రూపకల్పనకు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలను పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశామని తెలిపారు. ఏటా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నామని, 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఉన్నామని తెలిపారు. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనికి సూక్ష్మం నుండి సూక్ష్మం అనే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా మండల, మున్సిపాలిటీ విజన్ యాక్షన్‌ప్లానును గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా తీసుకుని అమలయ్యేలా చూస్తామని తెలిపారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ రూపొందించి కలెక్టర్ల సదస్సులో విడుదల చేస్తామని, ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని చెప్పారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని, ఎమ్మెల్యేలు పరిశ్రమలను తరిమేయడం కాకుండా తీసుకురావడం నేర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండాలని, ఉపాధి కలగాలంటే పరిశ్రమలు రావాలని, సేవల రంగం వృద్ధితో ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు అనంతపురం కరువు జిల్లాగా ఉండేదని, దానిపై ఎక్కువ దృష్టి పెట్టేవాళ్లమని చెప్పారు. ఇప్పుడు రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గానూ, విండ్, సోలార్, పంప్డ్ ఎనర్జీకి కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ఇప్పుడు అనంతపురం జిల్లా 26 జిల్లాల్లో ఐదోస్థానంలో ఉందని, మొదటిస్థానానికి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పస్తుతం నీళ్లున్నా ఎన్‌టిఆర్, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాల్లో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. దీనికోసం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ స్థాయిలో విజన్ ఫ్రేమ్‌వర్కు రూపొందించుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే 686 మండలాల్లో బలాలు, అవకాశాలను గుర్తించామని చెప్పారు. 2028-29కి ఐదేళ్ల ప్లానును కలెక్టర్ల మార్గదర్శకంలో రూపొందిస్తామని చెప్పారు. నియోజకవర్గాల్లో మైక్రోలెవల్ ప్లాను అమలు చేస్తామని వివరించారు.

ప్రతీ కుటుంబానికి సొంతిల్లు

నియోజకవర్గంలో ప్రతీ కుటుంబానికి ఇంటిస్థలం ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వం సెంటుపట్టాను ఊరికి దూరంగా ఇచ్చిందని, దాంతో అవి ఎవరికీ పనికిరాకుండా పోయాయని తెలిపారు. సెంటుపట్టా ఉన్నచోటనే స్థలం కావాలంటే రెండు సెంట్లు ఇస్తామని, 2029 నాటికి ప్రతి కుటుంబానికి సొంతిల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు.

2047 నాటికి నూరు శాతం అక్షరాస్యత

ప్రస్తుతం 5.3 కోట్లు ఉన్న జనాభా 2047 నాటికి 5.8 కోట్లకు పెరుగుతుందని 70 ఏళ్లుగా ఉన్న సగటు జీవితకాలం 85 ఏళ్లకు పెరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ జనాభా 36 శాతం నుండి 60 శాతానికి చేరుకుంటుందని, నూరు శాతం అక్షరాస్యత సాధిస్తామని చెప్పారు. నిరుద్యోగ రేటు 4.1 శాతం నుండి 2 శాతానికి తగ్గుతుందని, ఎగుమతులూ రూ.1.68 లక్షల కోట్ల నుండి రూ.39.12 లక్షల కోట్లకు చేరుకుంటాయని చెప్పారు.

నియోజకవర్గాల వారీ ర్యాంకులు

విజన్ అమలు కోసం సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని, ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తామని తెలిపారు. వీరికి సహాయంగా యంగ్ ప్రొఫెషనల్, జిఎస్‌డబ్ల్యుఎస్ నుండి ఐదుగురిని నియమిస్తామని చెప్పారు. దీన్ని నియోజవకర్గ మోనటరింగ్ యూనిట్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారికి సమర్థత, జవాబుదారీతనం పెంచేందుకు కీ ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్ అధారంగా చేసుకుని ర్యాంకులను నియోజకవర్గం వారీగా ఇస్తామని తెలిపారు. నెలకోసారి పురోగతిని పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. సిఎస్ రెండు నెలలకు, సిఎం మూడు నెలలకు ఒకసారి విజన్ అమలును సమీక్షిస్తారని వివరించారు.

ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మేలు

ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుందని సిఎం అన్నారు. తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన భాషను ద్వేషించడంలో అర్థం లేదన్నారు. మాతృభాష తెలుగు, హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీషని అన్నారు. తెలుగువాళ్లు జపాన్, జర్మనీ ఇతర దేశాలకు వెళుతున్నారని, అవసరమైతే ఆ భాషలను ఇక్కడే మనం నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మాతృభాషలో చదువుకున్నవారే ప్రపంచవ్యాప్తంగా రాణించారని చెబుతూనే సిఎం ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భాషలపై లేనిపోని రాజకీయాలు చేయడం మంచిది కాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. విజన్‌పై లఘు చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అప్పటి ఓటమికి నేనే కారణం

2004, 2019లో పనిలో పడి కొన్ని పనులు చేయలేకపోవడం వల్ల ఓటమి పాలయ్యామని, దానికి తానే కారణమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని తెలిపారు.

పేదలను దత్తత తీసుకుంటే అవార్డులు

రాష్ట్రంలో 35 లక్షల మంది అట్టడుగుస్థాయిలో ఉన్నారని, వారికి మొదటిదశ కింద 20 లక్షల మందిని, రెండోదశలో 15 లక్షల మందిని పి4లో భాగస్వాములను చేస్తామని తెలిపారు. పేదలను దత్తత తీసుకునే వారికి ప్రభుత్వం తరపున అవార్డులు, గుర్తింపు ఇచ్చి గౌరవిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి కనీస సదుపాయాలు కల్పించడం బాధ్యతగా తీసుకుంటామని చెప్పారు. పి4. జీరోపావర్టీ, బ్లూఎకానమీ, నాలెడ్జ్ ఇన్నోవేషన్, వంటి పలు అంశాలపై స్టీరింగ్ కమిటీ ఉంటుందని, వీటన్నింటికీ అత్యుత్తమస్థాయిలో లీడర్‌షిప్ కౌన్సిల్ ఉంటుందని పేర్కొన్నారు. 2029 నాటికి హామీలన్నీ అమలు చేస్తామని తెలిపారు. లఘు చర్చలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కొలికిపూడి శ్రీనివాసరావు మాట్లాడారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతమే లక్ష్యం

- విద్యార్థుల విషయంలో రాజకీయం చేయొద్దు
- ఆశ్రమ పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తాం : ప్రశ్నోత్తరాల్లో మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క)



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. విద్యార్థుల విషయంలో ప్రతి అంశాన్నీ రాజకీయం చేయొద్దని సభ్యులను కోరారు. మంచి సూచనలు, సలహాలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని నొక్కి చెప్పారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీలపై, పలు సమస్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సభ్యులు జాటోత్ రామచంద్రనాయక్, ఆదినారాయణ, హాస్టళ్లలో విద్యార్థుల మరణాలపై బీఆర్ఎస్ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానమిచ్చారు. ఏడేండ్ల తర్వాత 40 శాతం డైట్‌చార్జీలను, 16 ఏండ్ల తర్వాత కాస్మోటిక్ చార్జీలను 212 శాతానికి పెంచామని వివరించారు. తాను ములుగు ఎస్టీ గర్ల్స్ హాస్టల్‌లో చదువుకుని ఈ స్థాయికి ఎదిగానని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు, ఓసీల్లోని పేదలు కూడా పెద్ద ఎత్తున హాస్టళ్లలో చేరుతున్నారని వివరించారు. పిల్లలు అర్ధాకలితో చదువుకోవడం, నిద్రించడం ఇబ్బందికరంగా ఉందనే విషయాన్ని గుర్తించే పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో డైట్ చార్జీలను పెంచామని అన్నారు. హాస్టళ్లలో కల్తీ ఆహారం పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాస్టళ్లలో రాత్రి పూట బస చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. నాలుగు నెలల కాలంలో రూ.499 కోట్లకుపైగా ఖర్చు చేశామని చెప్పారు. క్లాసుల వారీగా ఏ పిల్లలకు ఎంత డైట్ చార్జీలు ఇస్తున్నామనే దాన్ని అంకెలతో సహా వివరించారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, నూతన జాతీయ విద్యావిధానం అంటూ కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ స్కాలర్‌షిప్పులను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. విద్యారంగం మీద కేంద్ర ప్రభుత్వ వైఖరి బొట్టుపసే తప్ప బోనం లేదన్నట్టుగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ విద్య బలోపేతం కోసం నిధులు పెంచాలని కేంద్రాన్ని కోరారు. దుబ్బాక హాస్టల్‌లో విద్యార్థి అస్వస్థతకు గురైతే హైదరాబాద్‌లోని నీలోఫర్‌లో చికిత్స అందిస్తున్నామన్నారు. గతంలో హాస్టళ్లను కడితే తాము కూల్చినట్టు, గతంలో మంచి ఆహారం పెడితే తాము దాన్ని తీసేసినట్టు, గతంలో కలుషిత ఆహార ఘటనలే జరగనట్టు బీఆర్ఎస్ సభ్యులు రాజకీయం చేయడం తగదని సూచించారు. అంగన్వాడీ చిన్నారుల నుంచి పీజీ విద్యార్థుల వరకు అన్ని వసతులూ కల్పిస్తున్నామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తామని హామీనిచ్చారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు ఇవ్వకుంటే బాగుండు అన్నట్టుగా బీఆర్ఎస్ భావిస్తోంది : సీతక్క

గవర్నమెంట్ స్కూళ్లో చదివాను కాబట్టి సూటిగా సుత్తిలేకుండా మాట్లాడుతాననీ, తమ ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్య కోసం రూ.167 కోట్లు చెల్లించామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులపై బీఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్, అనిల్ జాదవ్ అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. అంకెలతో సహా వివరణ ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ ఏం చేయలేదన్నట్టు మాట్లాడటం సరిగాదన్నారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు ఇవ్వకుంటే బాగుండు అన్నట్టు బీఆర్ఎస్ భావిస్తోందని విమర్శించారు. తాము విదేశీ విద్యానిధి ద్వారా స్కాలర్‌షిప్పులు ఇస్తామనీ, బీఆర్ఎస్‌కు రాజకీయం చేసేందుకు అవకాశమివ్వబోమని చెప్పారు. తాను గంగుల కమలాకర్‌లా పెద్ద స్కూళ్లలో పెద్ద చదువులు చదవలేదనీ, సమాజాన్ని మాత్రం బాగా చదివి ఇక్కడకు వచ్చానని చురకలు అంటించారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్పు పథకం విదేశాల్లో చదివే విద్యార్థులకు ఉపయోగపడుతుందని అలాగే ఉంచామనీ, బీఆర్ఎస్ సభ్యులు నెత్తీనోరు బాదుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఆ పథకం సహాయంతో 1913 మంది విద్యార్థులు చదువుతున్నారనీ, మొదటి విడతలో 725 మంది, రెండో విడతలో 1188 మంది ఉన్నారని చెప్పారు. పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని తెలిపారు. ఐఐటీలో చదివే విద్యార్థులకు రూ.2 లక్షల సహాయానికి సంబంధించిన జీవో 10 విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని గంగుల కమలాకర్‌కు హామీనిచ్చారు.

మహిళా జర్నలిస్టులకు బెయిల్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇటీవల అరెస్టయిన యూట్యూబ్ జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ప్రతి సోమ, శుక్రవారం విచారణకు హాజరు కావాలని వారిని ఆదేశించింది.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

- టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలంగాణ గౌడసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మకమని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీ బిల్లు ఆమోదం పొందడంతో బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం దక్కుతుందని తెలిపారు. విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందడంతో పేదలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని రుజువైందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

8 జిల్లాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర నాయకత్వం మరో ఎనిమిది జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండెల లక్ష్మీనారాయణ ఆ పేర్లను ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల సహఇంచార్జి గీతామూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి(రంగారెడ్డి అర్బన్), పి.రాజ్ భూపాల్ గౌడ్(రంగారెడ్డి రూరల్), కొప్పు రాజశేఖర్‌రెడ్డి(వికారాబాద్), వేముల నరేందర్‌రావు(నాగర్‌కర్నూల్), టి.రామాంజనేయులు(జోగులాంబ గద్వాల), నెల్లూరి కోటేశ్వరరావు(ఖమ్మం), బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (భద్రాద్రి కొత్తగూడెం), జె.నిరంజన్ యాదవ్(భాగ్యనగర్ మలక్‌పేట)లను అధ్యక్షులుగా నియమించారు. ఆ జిల్లాల పరిధిలోని 32 నియోజకవర్గాల నుంచి ఒక్కో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడి పేర్లను కూడా ప్రకటించారు. 38 జిల్లా కమిటీలకుగానూ ఇప్పటి వరకూ 36 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించినట్టు అయింది.

కొత్త నిబంధనలు.. మా సంస్కృతిపై దాడి రాజస్థాన్ ఎంపీ

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో (ఎంజిఎన్ఆర్ఇజిఎ)లో గత ఐదేళ్లలో కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలపై భారత్ ఆదివాసి పార్టీ ఎంపి రాజ్‌కుమార్ రోట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు రెటీనా స్కాన్‌లను తప్పనిసరి చేయడం వంటి నిబంధనలతో ఆ పథకాన్ని కేంద్రం బలహీనపరుస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

వేసవిలో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు పనులు ప్రారంభం

మండలిలో మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ వేసవిలోనే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో టీజేఎస్ సభ్యులు ఎం కోదండరామ్‌రెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటిలోగా ప్రారంభమవుతుందని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ వలే సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కూలిపోతాయని నిపుణులు అభిప్రాయపడిన విషయం వాస్తవమేనా?అని అడిగారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించనున్న విషయం వాస్తవమేనా?అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానమిస్తూ తుమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలను ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి సరఫరా కోసం విభిన్న ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

వరిధాన్యం కొన్న రైతులకు బకాయిలెప్పుడిస్తారు? : మధుసూదనాచారి

రాష్ట్రంలో గతేడాది ఖరీఫ్‌లో ఎన్ని మెట్రిక్ టన్నుల వరిని పండించారని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అందులో రైతుల నుంచి ఎంత కొనుగోలు చేశారని అడిగారు. రైతులకు ఎంత చెల్లించారనీ, బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారని ప్రశ్నించారు. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమాధానమిస్తూ 2024-25 ఖరీఫ్‌లో 156.20 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యిందని



వివరించారు. అందులో రైతుల నుంచి 53.93 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. రైతులకు రూ.12,511.76 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందులో రూ.11,099 కోట్లు ఇప్పటికే చెల్లించామని అన్నారు. మిగిలిన రూ.1,412.76 కోట్లు వారంరోజుల్లో చెల్లిస్తామని వివరించారు.

25 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణాలు మాఫీ చేశాం : తుమ్మల



రాష్ట్రంలో 25,35,964 మంది రైతులకు సంబంధించి రూ.రెండు లక్షల్లోపు ఉన్న రూ.20,616 కోట్లు రుణమాఫీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏకకాలంలో ఇంత పెద్దమొత్తంలో రైతుల రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం దేశంలోనే లేదన్నారు. గతేడాది 69.82 లక్షల మంది రైతులకు రూ.7,625.14 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేశామని వివరించారు. 2024-25 యాసంగి కాలం నుంచి పెట్టుబడి సహాయాన్ని ఎకరాకు ఏడాదికి రూ.పది వేల నుంచి రూ.12 వేలకు పెంచామని చెప్పారు. ఈనెల 15 నాటికి 52.09 లక్షల మంది రైతులకు రూ.4,166.21 కోట్లు విడుదల చేశామన్నారు. 2024-25లో 29,14,692 మంది రైతులకు విద్యుత్‌పై రూ.9,800.07 కోట్ల సబ్సిడీని ఇచ్చామని అన్నారు. అదేకాలంలో ఖరీఫ్‌లో 4,48,939 మంది రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో 23.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,199 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. బ్యాంకర్లు సమర్పించిన సమాచారంలో కొన్ని తప్పులున్నాయని అన్నారు. ఆధార్ లేకపోవడం, చెల్లుబాటుకాని ఆధార్ ఉండడం, ఆధార్‌తో ఖాతాలు అనుసంధానం కాకపోవడం, ఆధార్ ప్రకారం రుణం తీసుకున్న వారి పేర్లలో తేడాలు ఉండడం వంటి సాంకేతిక సమస్యలతో కొందరు రైతుల రుణాలు మాఫీ కాలేదన్నారు. వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. భూగర్భ జలవనరుల శాఖతో వ్యవసాయ శాఖ అనుసంధానం చేసుకుని ఏ కాలంలో ఏయే పంటలు వేయాలో, నీరు ఎప్పుడు లభిస్తుంది వంటి విషయాలను రైతాంగానికి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. దానివల్ల రైతులు నష్టపోకుండా ఉంటారని కోరారు. వరి వేయడం వల్ల నీరు అందుబాటులో ఉండకపోవడం వల్ల ఎక్కువ మంది రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సాంకేతిక సమస్యలున్న రైతుల రుణాలను మాఫీ చేయాలని కాంగ్రెస్ సభ్యులు మహేష్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ సూచించారు.

2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం : భట్టి



తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ని జనవరి 11న ప్రకటించామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ విధానం ద్వారా 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 40 వేల మెగావాట్లను లక్ష్యంగా చేసుకుని పునరుత్పాదక ఇంధన వనరులు (గ్రీన్ ఎనర్జీ)ని ఉత్పత్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం సౌర, పవన, పంప్‌డ్ వాటర్ స్టోరేజీ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్, గ్రీన్ హైడ్రోజన్ మొదలైన వాటిపై దృష్టి సారిస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)కు వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవకాశం కల్పిస్తామని అన్నారు. వారికి వడ్డీలేని రుణాలను ఇప్పించి విద్యుత్ ఉత్పత్తి చేయిస్తామనీ, దాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. లీజు భూములు, ప్రభుత్వ భూములను తీసుకుని మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్ స్టేషన్లను ఆరు వేలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అందులో యువతకు అవకాశం కల్పిస్తామన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా ఆర్టీసీ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

'మిషన్ లైఫ్' అంటే తెలియదు

- నాలుగోవంతు కంటే ఎక్కువ మంది భారతీయుల పరిస్థితిది
- కేంద్ర కార్యక్రమంపై సీపీఏ సర్వేలో బహిర్గతం
- మోడీ ప్రభుత్వం తీరుపై అసంతృప్తి
- మరిన్ని చర్యలు తీసుకోవాలని వెల్లడి



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ పర్యావరణ కార్యక్రమమైన 'మిషన్ లైఫ్'పై దేశ ప్రజలలో చాల మందికి ఇప్పటికీ అవగాహన లేదు. దీనిని ప్రారంభించి దాదాపు నాలుగేండ్లు కావొస్తున్నా. భారతీయులలో నాలుగోవంతు కంటే ఎక్కువ మందిది ఇదే పరిస్థితి. దీనిపై మోడీ సర్కారు సరైన చర్యలు తీసుకోని కారణంగానే అది ప్రజల్లోకి చొచ్చుకెళ్లలేదని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. 'మిషన్ లైఫ్(లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)' కార్యక్రమాన్ని కేంద్ర పర్యావరణ, అటవులు, వాతావరణ మార్పు (ఎంఓఈఎఫ్అండ్‌సీసీ) మంత్రిత్వ శాఖ 2021, నవంబర్‌లో ప్రారంభించింది. ప్రజలలో స్థిరమైన, పర్యావరణ స్పృహతో కూడిన జీవన విధానాన్ని ప్రోత్సహించటం దీని ఉద్దేశం. అయితే, ఈ విషయంలో మోడీ ప్రభుత్వం తగినంతగా ప్రమోట్ చేయలేదని చాలా మంది పౌరులు భావిస్తున్నారు. ఇటీవలి సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. అగర్తల కేంద్రంగా పని చేసే వినియోగదారులు రక్షణ సంఘం (సీపీఏ) దేశంలోని 25 పెద్ద నగరాల్లో ఒక సర్వే నిర్వహించింది. దేశంలోని 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యూటీ)కు చెందిన వినియోగదారుల సంస్థలు, వివిధ రంగాలకు చెందినవారు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, పరిశోధకులు, గృహిణులు ఈ సర్వేలో పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ ప్రభావవంతంగా అమలవుతున్నదని 16 శాతం మంది మాత్రమే విశ్వసించారు. 2022, జులై 1 నుంచి కేంద్రం ఈ బ్యాన్‌ను అమలు చేసిన విషయం విదితమే. కానీ, ఇప్పటికీ చాలా మందికి దీనిపై అవగాహన లేదన్న విషయం ఈ సర్వేతో వెల్లడైంది. ఇక ఆర్గానిక్ ఫుడ్, పర్యావరణహిత ఉత్పత్తులు, కార్బన్ ఫుట్‌ప్రింట్స్ తగ్గించే ప్రయత్నాల గురించి మాత్రం పబ్లిక్ సానుకూల అవగాహనను కలిగి ఉన్నది. అయితే, గ్రీన్‌వాషింగ్, ఉత్పత్తులు పర్యావరణ అనుకూలమైనవి లేదా స్థిరమైనవి అని తప్పుగా చెప్పుకునే తప్పుదారి పట్టించే ప్రకటనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల గణనీయమైన సంఖ్యలో ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. గ్రీన్‌వాషింగ్‌ను ఎదుర్కోవటానికి ప్రభుత్వం తీసుకునే చర్యలపై 67 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారు.

స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహించటానికి ప్రభుత్వం మరిన్ని చొరవలు, కఠినమైన చట్టాల అమలు, అవగాహన ప్రచారాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉన్నదని పలువురు విశ్వసించారు. సాధారణ వినియోగదారుల అవగాహనను చెక్ చేయటం కోసం, స్థిరమైన జీవనశైలికి మారే ఆవశ్యకతను ప్రజలకు చెప్పటమే సర్వే ఉద్దేశమని సీపీఏ కార్యనిర్వాహక అధ్యక్షులు జార్జ్ చెరియాన్ అన్నారు. పర్యావరణ సంబంధ విషయాలపై అంతర్జాతీయ వేదికలపై ఉపన్యాసాలు ఇచ్చే మోడీ.. తన దేశంలో అందుకు సంబంధించి ఒక కార్యక్రమాన్ని తీసుకొచ్చి, దానిని ప్రజలలోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవటం ఎంత వరకు కరెక్టని సామాజిక కార్యకర్తలు, పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తున్నారు.

కళ్యాణమస్తు పథకాన్ని ప్రారంభించలేదు

- కళ్యాణలక్ష్మిని కొనసాగిస్తున్నాం : మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్
- మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ : కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కళ్యాణమస్తు పథకాన్ని ఇంకా ప్రారంభించలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తున్నామని వివరించారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ కళ్యాణమస్తు పథకాన్ని ప్రారంభిస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందరికీ తెలుసనీ అందుకే ఇంత ప్రారంభించలేదని అన్నారు. ఆదాయాన్ని పెంచే మార్గం ఉంటే చెప్పాలని కవితను మంత్రి కోరారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి బీఆర్ఎస్ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తాము ఇస్తున్నామనీ, దానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ : కవిత



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించిందని అన్నారు. మహిళలకు పెండ్లి సమయంలో తులం బంగారం ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కళ్యాణమస్తు పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా సమాధానం చెప్పడం లేదని అన్నారు. 2023, డిసెంబర్ నుంచి పెండ్లి అయిన మహిళలకు తులం బంగారం తర్వాత రీయింబర్స్ చేస్తారా?అని ప్రశ్నించారు. కానీ ప్రభుత్వ సమాధానం నిరాశాజనకంగా ఉందన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీ కూడా అమలయ్యే అవకాశం లేదని చెప్పారు. ఈ మోసాన్ని మహిళలు గమనిస్తున్నారని అన్నారు.

యూనివర్శిటీ ప్రాంగణంలో నమాజ్

- విద్యార్థి సస్పెండ్ , అరెస్ట్

మీరట్ : యూనివర్శిటీ ప్రాంగణంలో నమాజ్ చేయడంతో పాటు ఆ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఒక విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. మీరట్‌లోని ఐఐఎంటి యూనివర్శిటీలో గత శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఐఐఎంటి యూనివర్శిటీ ప్రాంగణంలో కొందరు విద్యార్థులు నమాజ్ చేస్తున్న వీడియోను ఖలీద్ ప్రధాన్ (ఖలీద్ మేవతి) సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోపై స్థానిక హిందూ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఖలీద్ ప్రధాన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. యూనివర్శిటీ ప్రాంగణంలో నమాజ్ చేస్తున్న వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి, మత విద్వేషాలను రెచ్చగొట్టినందుకు ఖలీద్‌ను అదుపులోకి తీసుకున్నామని సర్కిల్ ఆఫీసర్ ప్రతాప్ సింగ్ తెలిపారు. కార్తీక్ హిందూ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శనివారం గంగానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బిఎన్ఎస్ సెక్షన్ 299, ఐటి (సవరణ) చట్టం, 2008లోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేశామని అన్నారు.

బహిరంగ ప్రదేశంలో నమాజ్ చేయడంతో పాటు మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ఆ వీడియోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఐఐఎంటి యూనివర్శిటీ ప్రతినిధి సునీల్ శర్మ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఖలీద్‌తో పాటు ముగ్గురు భద్రతా సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వర్గీకరణ నివేదికకు ఏపీ క్యాబినెట్ ఓకే

- గ్రూపు1లో రెల్లి ఉపకులాలకు ఒకశాతం
- గ్రూపు2లో మాదిగ ఉపకులాలకు 6.5శాతం
- గ్రూపు3లో మాల ఉపకులాలకు 7.5శాతం
- జిల్లాల వారీ అమలు
- త్వరలోనే కేంద్ర కమిషన్‌కు నివేదన



అమరావతి : షెడ్యూల్ కులాల వర్గీకరణ సిఫార్సులకు రాష్ట్ర మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం సోమవారం సాయంత్రం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులకు మేరకు మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ ఇటీవలే షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై సమర్పించిన నివేదిక విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. కమిషన్ నివేదికను యధాతథంగా ఆమోదించాలని మంత్రి మండలి నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో ఈ నివేదికను త్వరలో కేంద్ర ఎస్సీ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపనుంది. ఈ నివేదికలో షెడ్యూల్డ్ కులాలను మూడు గ్రూపులుగా విభజించి ఒకటో గ్రూపులో రెల్లి ఉప కులాలకు ఒక శాతం, గ్రూపు-2లో మాదిగ ఉప కులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో మాల ఉపకులాలకు 7.5 శాతం చొప్పున రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. అలాగే రాష్ట్రం ఒక యూనిట్‌గా ఈ రిజర్వేషన్లు ఉండాలని కూడా సూచించినట్లు తెలిసిం ది. ఈ నేపథ్యంలో బేడ బుడగ, జంగాలను రెల్లి ఉపకులాల్లో చేర్చే అంశంపై శాసనసభలో తీర్మానం చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమా చారం. ఈ రిజర్వేషన్లను జిల్లాల వారీగా అమలు చేయాలని సమావేశంలో భావించినట్లు తెలిసింది. చేనేత కార్మికులను ఆదుకునేందుకు వారికి 200 యూనిట్ల చొప్పున విద్యుత్‌ను ఉచితంగా అందిం చాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. మరమగ్గాలు వినియోగించే వారికి కూడా ఐదు వందల యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించడం విశేషం. ఈ నిర్ణయంతో మరమగ్గాల ద్వారా వస్త్రాలు తయారుచేసే వారికి మేలు కలుగుతుండగా, దాని ప్రభావం చేనేత కార్మికులపై పడుతుందన్న భావన కూడా వ్యక్తమవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సప్లిమెంటరీ స్టేట్‌మెంట్‌కు ఆమోదం తెలిపారు. అలాగే ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ కోసం కొత్తగా తయారుచేసిన బిల్లును కూడా ఆమోదించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారే కాకుండా జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది.

రాజధాని ప్రాంతంలో పనులకు ఆమోదం

రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మించే, చేపడుతున్న అనేక పనులకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ పనులకు టెండర్లు ఆహ్వానించగా, సిఆర్‌డిఏ అధికారులు వాటిని పరిశీలించి ఎల్-1లను ఖరారు చేసినట్లు తెలిపింది. ఈ పనులకు తాజాగా మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇందులో విద్యుత్ లైన్లు, రోడ్లు, డ్రైనేజ్ వంటివి ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సంబంధించి నగదు సీలింగ్ క్లాజ్‌ను కూడా ఆమోదించారు. 22,,607 కోట్ల రూపాయల విలువైన పనుల టెండర్లను ఆమోదించే అధికారాన్ని సిఆర్‌డిఏ కమిషనర్‌కు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచబ్యాంకు, ఎడిబి, హడ్కో, వంటి ఆర్థిక సంస్థల నుంచి వచ్చిన 15,095 కోట్ల రుణంతో అమలు చేసే మరో 37 పనుల నిర్వహణ అధికారాన్ని అమరావతి అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు అప్పగించారు.

బుడమేరుకు నిధులు

గత ఏడాది తీవ్ర నష్టం కలిగించిన బుడమేరు కాలువ మరమ్మతు పనులకు నిధులు కేటాయిస్తూ నిర్ణయించారు. తాత్కాలిక పనులకు 1.80 కోట్లు, పూర్తి స్థాయి పనులకు 37.97 కోట్లు కేటాయించాలని నిర్ణయించారు. కొత్తగా ప్రకటించిన ఎపి ఇన్నోవేషన్, స్టార్ట్ అప్ పాలసీ ద్వారా ఎకో సిస్టమ్‌ను అమలుచేసేందుకు, ఇటీవల జరిగిన రాష్ట్ర పరిశ్రమల ప్రమోషన్ బోర్డు ద్వారా అనుమతించిన ప్రాజెక్టులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే అనంతపురం సత్యసాయి జిల్లాల్లో కొత్తగా నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో ఎన్‌జిఇఎల్ హరిత్ సంస్థ స్థాపించే పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు. గ్రీన్ ఎనర్జీ విధానంలో భాగంగా ఆస్త్రా వెంచర్స్‌కు పంప్‌డ్ స్టోరేజి ప్రాజెక్టు ఏర్పాటుకు 864 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయ అటవీకరణ కింద ఇచ్చే ప్రతిపాదనలపైనా చర్చ జరిగింది. ప్రముఖ ఒబరాయ్ హోటల్స్ అధ్వర్యంలో ఉన్న ఒబరాయ్ విలాస్‌కు యాక్సస్ రోడ్ నిర్మాణానికి కూడా అనుమతిచ్చినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల నియామకాలపైనా నిర్ణయం తీసుకున్నారు.

కడప పేరు మళ్లీ

గతంలో కడప జిల్లా పేరును వైఎస్ఆర్ జిల్లాగా మార్పు చేయగా, తాజాగా దానిని వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అమరావతి ప్రాంతంలో వివిధ సంస్థలకు భూములు కేటాయించేందుకు ఇప్పటికే తయారైన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.

బీసీ రిజర్వేషన్ల పెంపు మా విజయమే

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీసీ రిజర్వేషన్ల పెంపు తమ విజయమే అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత అన్నారు. పెరిగే రిజర్వేషన్లను వెంటనే అమలు చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు. సోమవారంనాడిక్కడ జరిగిన తెలంగాణ ప్రజా కవులు, కళాకారుల వేదిక ఆవిర్భావ సభలో ఆమె మాట్లాడారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు కలిపి ఒకే బిల్లు పెడితే తీవ్ర అన్యాయం జరుగుతుందని తొలి నుంచీ తాము వాదిస్తున్నామనీ, ప్రభుత్వం దాన్ని పరిగణనలోకి తీసుకొనే రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టిందని చెప్పారు. అన్ని వర్గాల కోసం తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందనీ, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. బీసీ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తెలంగాణ కళాకారులు గళమెత్తాలని పిలుపునిచ్చారు.

588 కుటుంబాలకు కారుణ్య నియామకాలు

- ఆమోదించిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 588 కుటుంబాలకు కారుణ్య నియామకాలను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. కారుణ్య నియామకాల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచింది. పంచాయతీరాజ్ శాఖలో దాదాపు 560 మంది అర్హులైన అభ్యర్థులకు కారుణ్య నియామకాలను ప్రభుత్వం ఆమోదించింది. వారి కుటుంబాల దీన స్థితిని చూసి ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు చేసిన నిరంతర విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారని సోమవారం జగదీశ్వర్, శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా మరణించిన ఉద్యోగుల కృషిని గౌరవించడమే కాకుండా వారి కుటుంబాల్లో ఆశాకిరణాన్ని అందించడంలో మంత్రి సీతక్క కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు ఈ దస్త్రాన్ని తీసుకెళ్లి ఆమోదం పొందేలా ఆమె కృషి చేశారని తెలిపారు.